సంపుటము – II
సమావేశము– I
నెం. 1

వెల రూ.13-00
2 జూలై, 2014
బుధవారము,
(శక సం. 1936,
ఆషాఢం – 11)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపములు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | పేజి నెం. |
|---|---|---|---|
| 1. | అధ్యక్షుని ఎన్నిక | ... | 1 |
| 2. | గణాంక వివరముల పట్టిక | ... | 57 |

# తెలంగాణ  శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| తాత్కాలిక ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ  ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సిహెచ్.  ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి  ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి. ఎన్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి  యస్.  నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

(మొదటి సమావేశము (రెండవ విడత) : మొదటి రోజు)

**బుధవారము, జూలై 2, 2014**

(సభ ఉ. గం. **11.00** ని.లకు ప్రారంభమైనది)

(గౌరవ తాత్కాలిక ఛైర్మన్ అధ్యక్ష స్థానములో వున్నారు)

## అధ్యక్షుని ఎన్నిక

తాత్కాలిక అధ్యక్షులు : గౌరవ సభ్యులందరికీ తెలియచేయునది ఏమనగా, శాసన పరిషత్తు అధ్యక్షుని ఎన్నిక నిమిత్తం నిర్దేశించిన సమయం ప్రకారం జూలై 1వ తేదీ సాయంత్రం 5గంటల వరకు రెండు నామినేషన్లు అందినవి.

శ్రీ ఫారూఖ్‌హుస్సేన్ పేరును శ్రీ డి.శ్రీనివాస్, శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్, శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి మరియు శ్రీ ఎం. రంగారెడ్డి ప్రతిపాదించారు.

శ్రీ కె. స్వామిగౌడ్ పేరును శ్రీ మహమ్మద్ మహమ్మూద్ అలీ, నాయిని నర్సింహారెడ్డి, సయ్యద్ అల్తాఫ్ హైదర్ రజ్వీ, డా. కె. నాగేశ్వర్, పాతూరి సుధాకర్ రెడ్డి, కాటేపల్లి జనార్థన్ రెడ్డి, సయ్యద్ అమినుల్‌హసన్ జాఫ్రీ మరియు నబావత్ రాములు నాయక్ ప్రతిపాదించారు.

ఇద్దరు సభ్యులు నామ నిర్దేశం కాబడిన కారణంగా, తెలంగాణ శాసన పరిషత్తు తాత్కాలిక కార్య విధాన నిబంధన 9(4) ప్రకారం, అధ్యక్షుని ఎన్నిక నిమిత్తం బ్యాలట్ విధానం అనుసరించడం జరుగుతుంది.

గౌరవ సభ్యుల జాబితాలో సూచించిన విధంగా అక్షర క్రమంలో శాసనసభ సచివాలయ కార్యదర్శి ఒక్కొక్క సభ్యుడిని పిలవడం జరుగుతుంది. వారు కార్యదర్శి టేబుల్ వద్దకి వచ్చి, బ్యాలట్ పత్రం తీసుకుని, ఓటింగు కంపార్టుమెంటులోకి వెళ్లాలి. అక్కడ బ్యాలట్ పత్రంలో వారి అభీష్టం మేరకు ఎన్నుకున్న అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న కాలమ్‌లో ప్రత్యేక గుర్తుతో సూచించిన తర్వాత, బ్యాలట్ పత్రాన్ని కార్యదర్శి టేబుల్ మీద ఉంచిన బ్యాలట్ బాక్స్‌లో వేసి, తిరిగి తమ నిర్దేశిత స్థానం వద్దకి వెళ్లి కూర్చోవలసి ఉంటుంది. మొదటిసారి పిలిచినపుడు హాజరు కాని సభ్యుల్ని తిరిగి పిలిచిన తర్వాత, బ్యాలట్ పత్రాల లెక్కింపు ప్రక్రియ

ప్రారంభమవుతుంది. కార్యదర్శి, ఉప కార్యదర్శి మరియు సహాయ కార్యదర్శులు సమావేశ మందిరంలోనే ఓట్లను లెక్కిస్తారు. నామ నిర్దేశం చేయబడిన టెల్లర్లు, వారి వారి సభ్యుల ఎన్నిక ప్రయోజనాలను పరిశీలిస్తారు. లెక్కింపు ప్రక్రియ అనంతరం, ఫలితాన్ని ప్రకటించడం జరుగుతుంది.

మొత్తం ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యేంత వరకు గౌరవ సభ్యులందరూ తమ తమ స్థానాల్లోనే కూర్చొని, నిశ్శబ్దాన్ని పాటించవలసిందిగా కోరడమైంది.

(ఈ దశలో ప్రతిపక్షనాయకులు శ్రీ డి.శ్రీనివాస్ లేచి మాట్లాడడానికి ప్రయత్నించారు. తమ నాయకునికి మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సభ్యులు గౌరవ తాత్కాలిక అధ్యక్షుణ్ణి కోరారు. )

శ్రీ డి. శ్రీనివాస్ః (అసెంబ్లీ) అధ్యక్షా, మా ఫీలింగ్స్ మీకు అవసరం లేదా? మా ఒపీనియన్ కూడా మీకు అవసరం లేదా?

(ఈ సమయంలో – కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ యం.యస్. ప్రభాకర్ రావు, శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, శ్రీ ఫారూక్ హుస్సేన్ లు వెల్‌లోకి వచ్చి ... ఇది అన్యాయం, యల్ఓపి గారికి మాట్లాడడానికి అవకాశం ఇవ్వండి .. అని కోరారు. )

మిస్టర్ యాక్టింగ్ ఛైర్మన్ః దయచేసి మీరెళ్లి కూర్చోండి. నేను వారికి అవకాశం ఇస్తాను, వెళ్లి మీ సీట్లలో కూర్చోండి.

(యాక్టింగ్ ఛైర్మన్ సలహా మేరకు వెల్‌లో ఉన్న సభ్యులు తమ తమ సీట్లకి వెళ్లి ఆశీనులయ్యారు.)

శ్రీ డి. శ్రీనివాస్ః అధ్యక్షా, చాలా బాధాకరమైన పరిస్థితుల్లో ఈరోజు ఈ హౌస్‌లో కూర్చున్నాం . ఇది పెద్దల సభ అంటారు. ఆ గౌరవాన్ని మనం కాపాడుకోకుండా ఆదరాబాదరాగా మళ్లీ ఈ సభా సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగింది. పది రోజుల క్రితమే మన కౌన్సిల్ సమావేశాలు ముగిశాయి. గవర్నర్ అడ్రస్ మీద మనమంతా బ్రహ్మాండంగా మాట్లాడుకున్నాం . సోనియా గాంధీ గారే తెలంగాణా రాష్ట్రం ఇచ్చారన్నారు. ఫ్ మినిస్టర్ గారు కూడా తన రిప్లైలో – అన్ని పార్టీలను కలుపుకుని పోతూ మేము బంగారు తెలంగాణాకి బాటలు వేస్తామన్నారు. మేమందరమూ తెలంగాణా అభివృద్ధి కొరకు తప్పకుండా నిర్మాణాత్మకమైన సహకారం అందజేస్తామని ఈ సభలోనే చెప్పాం . మళ్లీ ఏమి అనుమానం వచ్చిందో ఏమో తెలియదు. ఎందుకు ఈ రకంగా వ్యవహరిస్తున్నారు, వేరే పార్టీ వాళ్లను ఎట్రాక్ట్ చేయడం, వీళ్లే ఇష్టపూర్వకంగా అక్కడికి వెళ్లారా, లేక వాళ్లే వీళ్లను అక్కడికి లాగారా

అన్నది భగవంతునికే తెలుసు . Whatever it is, there is a procedure, దాని ప్రకారమే మేము నోటీసు ఇచ్చాం . మీరు ఆ టైములో లేరు, మీ సెక్రటరీ గారికి ఇచ్చాం .

మిస్టర్ యాక్టింగ్ ఛైర్మన్: మీరిచ్చిన నోటీసు అందింది, దాన్ని సెక్రటేరియట్‌కి పంపించడం జరిగింది. దాని మీద పద్ధతి ప్రకారం, రూల్ ప్రకారం యాక్షన్ తీసుకుంటాం .

శ్రీ డి. శ్రీనివాస్: సంతోషం అధ్యక్షా, మీరు హైదరాబాదుకి రాగానే ఆ పని చేసినందుకు ధన్యవాదాలు. కానీ ఏదో మునిగి పోతోందన్నట్లుగా ఇంత ఎమర్జన్సీగా సెషన్ పెట్టవలసిన అవసరం ఏమిటో అర్థం కావడం లేదు. రాష్ట్రంలో వర్షాలు లేవు, కరవు వచ్చే పరిస్థితి ఉంది. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దాని కోసం ప్రస్తుతం సమావేశాలు ఏర్పాటు చేసి, తర్వాత ఛైర్మన్ ఎన్నిక పెట్టుకుని ఉంటే అది వేరేగా ఉండేది. కేవలం ఛైర్మన్ ఎన్నిక కోసం, పది రోజుల క్రితం sine die అయిన కౌన్సిల్ సమావేశాన్ని మళ్లీ ఏర్పాటు చేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది? ఇది అప్రజాస్వామికం . తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో అన్ని పార్టీల వాళ్లు నిర్మాణాత్మకమైన సహకారం అందజేస్తామని సభలోనే చెప్పారు. ఈ రకంగా defections engineer చేసి, ఈ రకంగా సభ్యులను భయపెట్టి, కనీసం ఓటింగ్‌కి కూడా రాకూడదని చెప్పారు. అసలు సీక్రెట్ బ్యాలెట్ పెట్టవలసిన అవసరం ఏమొచ్చింది? ఇంత వరకు సీక్రెట్ బ్యాలెట్ ఎప్పుడు జరగలేదు. చాలా సాధారణంగా ఎన్నికలు జరిగేవి. అటువంటి దానికి ఎన్నికలు పెట్టి, సీక్రెట్ బ్యాలెట్ పెట్టి చేస్తున్నారు. గతంలో శాసన సభలో స్పీకర్‌గా మనోహర్ గారి ఎన్నిక కూడా హెడ్ కౌంట్‌తో జరిగింది. ఇంత దురాలోచనతో, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా, ఇంత abrupt గా హౌస్‌ని పిలిచి, మెంబర్స్‌ని క్రాసింగ్‌కి ఎంకరేజ్ చేసి సీక్రెట్ బ్యాలెట్ పెట్టడమేమిటి? ధైర్యంగా ఎంకరేజ్ చేసి వాళ్లు వచ్చి చేరారు అని చెప్పండి. సీక్రెట్ బ్యాలెట్ పెట్టి మీరు వారికి ప్రొటెక్షన్ ఇస్తున్నారు ఇక్కడ .

శ్రీ టి. హరీష్ రావు: (తన చేతిలో ఉన్న రూల్స్ బుక్‌ని చూపిస్తూ) శ్రీనివాస్ గారూ, మీరు సీనియర్ సభ్యులు, ఒకసారి రూల్ పొజిషన్ చూడండి.

SRI D. SRINIVAS: Please, let me complete. I too know the Rule position. రూల్‌లో by ballot అని ఉన్న మాట వాస్తవం . కానీ సాంప్రదాయాలు కూడా ఉంటాయి. ఎన్నిసార్లు మనం బ్యాలెట్ పెట్టాం? రూల్స్‌ని strict గా adhere అవుతూ ఎన్నిసార్లు మనం హౌస్‌ని నడిపిస్తున్నాం? Mood of the House ని బట్టి ఎన్నిసార్లు మనం మార్పులు చేసుకోవడం లేదు ! ఈవిధంగా ఉదాహరణని బట్టి ఎన్నిసార్లు మనం మార్పులు చేసుకోవడం లేదు ! ఈవిధంగా ఉదాహరణలున్నాయి కాబట్టి ఇది పద్ధతి కాదు. ఇంత దౌర్జన్యంగా, ఈ రకంగా ప్రెషర్ బిల్డప్ చేసి..

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః అధ్యక్షా, రూల్ లేనప్పుడు సాంప్రదాయం ఉంటుంది. రూల్–9(4) ప్రకారం బ్యాలెట్ ద్వారా ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది.

శ్రీ డి. శ్రీనివాస్ః రూల్ ఉన్నప్పటికీ సాంప్రదాయాలను అనుసరిస్తూ ...

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః (మెదక్, నిజామాబాదు, ఆదిలాబాదు & కరీంనగర్) రూల్ ఉన్నపుడు సాంప్రదాయం ఎలా ఉంటుంది, దాన్ని ఎలా అనుసరిస్తాం? మీరు గత 30 సంవత్సరాలుగా ప్రజాస్వామ్యంలో ఉన్నారు.

శ్రీ డి. శ్రీనివాస్ః అధ్యక్షా, నేను సాంప్రదాయాలకు సంబంధించి ఉదాహరణ కూడా చెప్పాను. స్పీకర్ పదవికి మనోహర్‌గారు కాంటెస్ట్ చేసినపుడు ఏమి జరిగిందో ఇక్కడ ఉన్న సెక్రటరీ గారిని అడగండి. సాంప్రదాయం ప్రకారం జరిగిందో లేదో చెబుతారు. రూల్ ఉన్నప్పటికీ కూడా దాన్ని ప్రక్కన పెట్టి ఓపెన్ ఎలక్షన్/బ్యాలెట్ పెడితే బాగుంటుందనే భావనతో, ట్రాన్స్‌పరెంటుగా చేస్తే బాగుంటుందని ఆవిధంగా చేయడం జరిగింది.

అధ్యక్షా, నేను ఏమంటున్నానంటే – మీరు కూడా ఆ రకంగా జరిపించండి. సీక్రెట్ బ్యాలెట్‌కి ఏ ఉద్దేశ్యంతో వెళ్లారు? మేము అంటున్నదేమంటే – please, postpone this election. Local body elections లో అందరూ నిమగ్నమై ఉన్నారు. అటువంటి టైములో ఇంత hurry-burry గా ఛైర్మన్ ఎన్నిక పెట్టడం ఎంత మాత్రమూ justifiable కాదు. Justify చేసుకోవడానికి మీకు కారణాలు కూడా లేవు. కనుక మీరు దయచేసి ఈ ఎన్నికను వాయిదా వేసి తర్వాత పెట్టండి, మేమందరమూ కూడా సహకరిస్తాం, మాట్లాడుకుందాం, చేద్దాం . అధ్యక్షా, దయచేసి మీరు intervene అయి ఈ ఎలక్షన్‌ని పోస్ట్‌పోన్ చేయమని కోరుతున్నాను.

శ్రీ టి. హరీష్‌రావుః (సిద్ధిపేట) సార్, ఇప్పుడు కౌన్సిల్ ఛైర్మన్ గారి ఎన్నిక ప్రభుత్వం ఫిక్స్ చేసిందో, ఇంకెవరో చేసిందో కాదు, గవర్నర్ గారే ఫిక్స్ చేస్తారు. సీనియర్ సభ్యులు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఈ ఎన్నికను వాయిదా వేయమంటున్నారు. మన రూల్స్ బుక్‌లో సెక్షన్–9(4)లో చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. మన హౌస్ రూల్స్ ప్రకారంగా ... Rule 9 (4) of Ad-hoc Rules of procedure and conduct of business in the Telangana Legislative Council prescribed thus:

Rule 9 (4): On the date so fixed for election, the person presiding at the meeting shall read out to the House the names of members who have been duly nominated together with those of other proposers and if only one member has been so nominated, shall declare that member as duly elected. If more than one member has been so nominated, the House shall

proceed to elect the Chairman by ballot. Any member so nominated may withdraw his candidature at any time before the ballot commences under sub-rule (6).

By ballot అంటే సభలో జరిగే పద్ధతి ఇది. ఎలక్షన్ ప్రొసీజర్ మీద మీకు సమాచారం ఇవ్వడం జరిగింది. పెద్దలు శ్రీనివాస్‌గారు చాలా అనుభవజ్ఞులు . ఎలక్షన్‌ను గవర్నర్‌గారు నోటిఫై చేశారు. ఎలక్షన్ by ballot జరగడానికి మీరు ఒప్పుకున్నారు. మీ పార్టీ తరపున మీరు నామినేషన్ కూడా వేశారు. ఒప్పుకుని నామినేషన్ వేసి ఇక్కడికి వచ్చిన తర్వాత ఎన్నికను వాయిదా వేయమని అడగడం హాస్యాస్పదం . Procedure was laid down, procedure was communicated to every Member. ఆ ప్రొసీజర్‌ని చదివి, ఆ ప్రొసీజర్‌కి అనుగుణంగానే మీ పార్టీ తరపున నామినేషన్ వేశారంటేనే ఎన్నికకు మీరు ఒప్పుకున్నట్లు. సంతకాలు పెట్టారు మీరు. దాన్ని మరచిపోయి తప్పుదారి పట్టించే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు.

అధ్యక్షా, వాళ్లు ప్రొసీజర్స్ గురించి మాట్లాడారు. 30.7.1980 నాడు రాజ్యసభలో కూడా ఇలాంటి విషయము చర్చకి వచ్చింది. ఆనాడు Former Chief Justice of India – శ్రీ హిదయ్‌తుల్లా గారు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆరోజు ప్రొసీజర్‌ని మార్చాలని అక్కడ అడిగితే హిదయ్‌తుల్లా గారు ఒక రూలింగ్ ఇచ్చారు. నేను కొత్తగా చెప్పడం లేదు, వారిచ్చిన రూలింగ్‌నే చెబుతున్నాను.

The excerpts from the ruling of Dr Hidayatullah, the former Chief Justice of India and the then Chairman of Rajya Sabha on 30.07.1980 with regard to the convention in Rajya Sabha:

"……Therefore, the existing rule alone must be followed and no other part of convention can be revised. Thus, according to the precedent and reason of the rule, the election shall be according to the procedure prescribed."

ఏవైతే ప్రొసీజర్స్ prescribe అయ్యాయో వాటి ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి తప్ప ఇప్పటికిప్పుడు మార్చుకోవడానికి వీలు లేదన్నారు. నేను కూడా ఏమంటున్నానంటే – ఒకవేళ మీరు రూల్ మార్చాలంటే దానికి మేము రెడీ, మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. There is a laid down procedure. మార్చాలంటే దానికి రూల్స్ కమిటీ ఉంది. రూల్స్ కమిటీకి రెఫర్ చేద్దాం . రూల్స్ కమిటీని నామినేట్ చేద్దాం . భవిష్యత్తులో మనం అసెంబ్లీ రూల్స్ మార్చుకోవాలంటే దానికి కూడా మేము రెడీ. దానికి వెనక్కి పోవలసిన అవసరం లేదు. బేసిక్‌గా మన అసెంబ్లీలో ఏవైతే ప్రొసీజర్స్ ఉన్నాయో, రూల్స్ ఉన్నాయో

వాటికి అనుగుణంగానే ఈ నోటిఫికేషన్ వచ్చింది. ఆ నోటిఫికేషన్‌ని మీరు కూడా యాక్సెప్ట్ చేశారు. మీరు కూడా నామినేషన్ వేశారు. ఎన్నిక జరిగే సమయంలో ఇలా మాట్లాడడం మంచిది కాదు. పెద్దలు మీకు కూడా తెలుసు . ఒకసారి గవర్నర్ నోటిఫై చేస్తే, స్పీకర్ గారు సభ్యుల వివరాలు సభ ముందు పెట్టిన తర్వాత ముందుకు పోవలసిందే తప్ప దాన్ని ఆపే ప్రొసీజర్ ఎక్కడైనా ఉందా? ఈ సాంప్రదాయాన్ని ఎప్పుడైనా చూశామా? పెద్దలు చాలా అనుభవజ్ఞులు. ఇది పెద్దల సభ. దీనికి disqualification కి సంబంధమే లేదు. దాని మీద వెనక్కి పోవాలని మేము కూడా అనడం లేదు. మీరిచ్చిన నోటీసుకి సంబంధించి ఇప్పుడే ఛైర్మన్‌గారు ఎనౌన్స్ చేశారు, దాన్ని నేను పరిశీలిస్తున్నాను, సెక్రటేరియట్‌కి పంపాను, చర్య తీసుకుంటామన్నారు. మేము కూడా కోరుతున్నాం, తప్పకుండా మీరు పరిశీలించి ఏది చట్టపరంగా, న్యాయపరంగా కరెక్టుగా ఉందో ఆ నిర్ణయం తీసుకోండి. దానికి మేము వ్యతిరేకం కాదు. కానీ దానికీ దీనికి సంబంధం లేదు. ఈ పెద్దల సభ గౌరవం పెరిగే విధంగా దయచేసి హుందాగా ఈ ఎన్నికకి సహకరించండి. మీ అభిప్రాయం ఏమైనా ఉంటే చెప్పండి. మీరే ప్రొసీజర్ ఒప్పుకుంటారు, మీరే నామినేషన్ వేస్తారు, మళ్లీ మాట మార్చి ఇదేమి పద్ధతని మాట్లాడడం మీకు సరైనది కాదని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**11.15 ఉ.** శ్రీ డి. శ్రీనివాస్ : అధ్యక్షా, గౌరవ మంత్రి వర్యులు శ్రీ హరీష్‌రావు గారు చాలా బాగా మంచిగా చిలుకకు చెప్పినట్లు చెప్పారు. గవర్నరు గారు నోటిఫై చేయమని ఎప్పుడు చెబుతారు? On the recommendation of the Government only the Governor does it. గవర్నరు గారు వాలంటరీగా, ఇష్టపూర్వకంగా, ఆయనకై ఆయనే నోటిఫై చేయించారా? Only on the recommendation of the Chief Minister or his Cabinet colleagues, గౌరవ ముఖ్యమంత్రి గారి దగ్గర నుండి ఫైల్ వచ్చిన తరువాతనే గవర్నరు గారు as suggested by the Government i.e. the Council of Ministers, he takes a decision. గవర్నరు గారు ఇచ్చిందంటే గవర్నరు గారికి సంబంధం ఏమిటండి? As a head of the State, he acts, మేము నామినేషన్ వేశామని అంటున్నారు. మాకు ప్రజాస్వామ్య విలువలపై గౌరవం ఉంది. ప్రజాస్వామ్య విలువల్ని మేము గౌరవిస్తాం. ఈ ఎన్నికను వాయిదా వేయండి. ఈ ఎన్నిక న్యాయబద్ధంగా జరగడం లేదు, చాలా హడావిడిగా జరుగుతున్నది కాబట్టి ఈ ఎన్నికను వాయిదా వేయండని గవర్నరు గారిని కోరాం. ఆయన ఎగ్జామిన్ చేస్తామన్నారు. కాని, ఎలక్షన్ ప్రాసెస్ మొదలై ఎప్పుడైతే నామినేషన్ వేశారో మీరు, we have to go as per the Rules. ఎందుకంటే.. రాజ్యాంగం మీద మాకు విశ్వాసం ఉన్నది. రూల్

పొజిషన్ చెబుతున్నారు. రూల్స్ మార్చుకోవడం గురించి మాట్లాడుకోవడమనే ది వేరే అంశం. కావాలని అనుకున్నప్పుడు హౌజ్‌కు అధికారం ఉంది, క్యాబినెట్‌కు అధికారం ఉంది. శ్రీ నాదెండ్ల మనోహర్ గారు శాసనసభ సభాపతిగా ఎన్నికైనప్పుడు, అప్పుడు ఎట్లా రూల్స్ అడాప్ట్ అయ్యాయి, లేదా how was that convention adopted? ఆనాడు కూడా ప్రతిపక్ష పార్టీలున్నాయి. Telugu Desam Party, was in the main opposition on that day. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ఉంది. కాని ఈ రకంగా వచ్చి చేయడమనేది కరెక్ట్ కాదు. ఎప్పుడైతే అన్ని పార్టీలు మీకు constructive co-operation ఇస్తామన్నారు కాబట్టి అందరితో మాట్లాడి ఎన్నికలు పెడితే ఎవరు వద్దంటారు? కాని ఈ రకంగా ఇంత అర్జెన్సీ ఎందుకు వచ్చిందో దయచేసి చెప్పాలి. కనుక మళ్లీ నేను అభ్యర్థిస్తున్నాను.....

శ్రీ టి. హరీష్ రావు (మైకు లేకుండా) : నామినేషన్ వేసి కూడా....

శ్రీ డి. శ్రీనివాస్ : అవునండి, మీరు బుల్డోజ్ చేసుకొని పోతా ఉంటే వద్దంటారా, ఎన్నికల్లో పాల్గొనవద్దని చెప్పేయండి. అది కూడా మీరే ఆర్డర్ ఇవ్వండి. గెలవడం, ఓడిపోవడం అనేది వేరే విషయం. నామినేషన్ వేయడమనేది కేవలం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం. తమరితో నా చివరి విన్నపం ఏమిటంటే, దయచేసి ఈ ఎలక్షన్‌ని వాయిదా వేయమని రెక్వెస్ట్ చేస్తున్నాను. ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఆలోచన చేయాలి. లేదంటే ఇంత అర్జంట్‌గా ఎలక్షన్‌కి పిలవడానికి ఏమి అవసరం వచ్చిందో హౌజ్‌కి చెప్పాలి.

శ్రీ అరికెల నర్సారెడ్డి : (స్థానిక సంస్థలు) అధ్యక్షా, ఈరోజు శాసనపరిషత్ ఛైర్మన్ ఎన్నిక కోసం హడావుడిగా, ఆగమేఘాల మీద ఒక నిర్ణయం తీసుకొని ఎన్నికల ప్రక్రియను మీరు అనౌన్స్ చేయడం జరిగింది. పెద్దల సభలో ఎన్నికలు ఏ విధంగా జరుగుతున్నాయి, స్థానికంగా ఏ పార్టీ నుంచి ఎవరు గెలిచారు, దానిని ఏ విధంగా గౌరవించాలి, మనం వ్రాసుకున్నటువంటి చట్టాలను, మనం వ్రాసుకున్నటువంటి రాజ్యాంగాన్ని ఏ విధంగా గౌరవించాలని ప్రజలు వేచిచూస్తున్నారు. పదిహేనురోజుల క్రితమే శాసనపరిషత్ సమావేశాలు జరిగాయి. మరో నెలరోజుల తరువాత బడ్జెట్ సమావేశాలు జరగబోతున్నాయి. వాస్తవానికి, ఈ సభలో ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఎన్నిక ఎప్పుడైనా పెట్టుకోవచ్చు. దానికి ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. ఎన్నిక పెట్టుకోవాలంటే, అధికారపార్టీలో ఉన్న సభ్యుల బలమెంత, ఇతరుల బలమెంత అనేది బేరీజు వేసుకుని ఉంటే మంచిగా ఉండేది. ప్రజాస్వామ్యంలో ఎంతమందైనా నామినేషన్లను దాఖలు చేయవచ్చు. దానిలో తప్పేమీ లేదు. కానీ, ఒక సమావేశాన్ని నిర్వహించి, అన్ని రాజకీయపక్షాలను ఆ సమావేశానికి

ఆహ్వానించి ఛైర్మన్ పదవిని పూరించడం కోసం అన్ని పార్టీలతో సమాలోచనలు చేసి సభ్యులందరినీ గౌరవంగా రిక్వెస్ట్ చేసి అధికారంలో ఉన్న పార్టీకి ఛైర్మన్ పదవిని ఇవ్వమని అడిగి ఉంటే చాలా బాగుండేది. ప్రజలు కూడా అభినందించి ఉండేవారు. ఇతర పార్టీలనుంచి సభ్యులను వారి పార్టీలోకి తీసుకుని, సంఖ్యాబలం చూసుకుని ఆగమేఘాల మీద ఎన్నికను నిర్వహిస్తున్నారు. ఈనాడు సభా మర్యాదను కాపాడడంలేదు. ఒక సరైన విధానంలో ఈ ఎన్నిక జరగడం లేదు. ఎందుకంటే, జిల్లాపరిషత్‌ల మరియు మండల పరిషత్‌లో సభ్యులు గౌరవంగా లేచి నిలబడి ఓట్లు వేసే ప్రక్రియ ఉన్నది. ఈ శాసనపరిషత్ తర్వాతనే శాసనసభ. ఈ సభలో సభ్యులంతా నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకుని ఉంటే బాగుండేది. దానిని కూడా మీరు పాటించడం లేదు. అటు అధికార పక్షం కానీ, ఇటు ప్రతిపక్షంకానీ తమ బాధ్యతను సరిగా నెరవేర్చడం లేదు కాబట్టి ఈ ఎన్నిక ప్రక్రియ సజావుగా జరగలేదు. పెద్దల సభ అంటే ఈ విధంగా ఉంటుందా అని ప్రజలు చర్చించుకునే అవకాశముంది కనుక ఈ ఎన్నిక ప్రక్రియను సరైన విధంగా జరపడం లేదని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. అధికారపార్టీ ముందుగా ప్రతిపక్షాలతో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకుని ఉంటే మేము నూటికి నూరు శాతం సహకరించి ఉండేవాళ్లం. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌పార్టీ కూడా సరిగా చొరవ చూపలేదు. అటు పాలకపక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షం కూడా ఛైర్మన్ పదవి కోసం నామినేషన్‌ను దాఖలు చేయడం జరిగింది. ఈ ఎన్నిక ప్రక్రియ సరిగా జరగడంలేదు కాబట్టి, అధికారపార్టీ మరియు ప్రధాన ప్రతిపక్షపార్టీలు తప్పుచేస్తున్నాయి కాబట్టి, ప్రజలకు అవి మంచి సంకేతాలను ఇవ్వలేకపోతున్నాయి కాబట్టి తెలుగుదేశం పార్టీ సభ్యులు ఈ ఓటింగ్‌లో పాలుపంచుకోలేకపోతున్నారు. ఇది చాలా బాధాకరమైన విషయం అయినప్పటికీ, వారు తప్పుచేస్తున్నారు కాబట్టి మేము ఈ ప్రక్రియలో పాలుపంచుకోవడం లేదు. అందువల్ల, మేము తెలుగుదేశం పార్టీ తరపున ఈ ఎన్నికకు దూరంగా ఉంటూ వాకౌట్ చేస్తున్నాము.

(తెలుగుదేశం పార్టీకి చెందిన శాసనపరిషత్ సభ్యులు సర్వశ్రీ అరికెల నర్సారెడ్డి, పోట్ల నాగేశ్వర్‌రావు, ఉల్లోళ్ల గంగాధర్‌గౌడ్, బలసాని లక్ష్మీనారాయణ సభనుంచి వాకౌట్ చేశారు.)

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : (అసెంబ్లీ) అధ్యక్షా, ఏ చట్టసభలకైనా గౌరవం, మర్యాద, హుందాతనం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఆరు దశాబ్దాల తరువాత ఇచ్చిన పార్టీగా, ఇచ్చిన నేతగా శ్రీమతి సోనియాగాంధీ గారు అయినప్పటకీ, ఉద్యమ పార్టీగా వారు చెబుతున్నటువంటి వాగ్దానాలను ప్రజలు విశ్వసించి 63మంది ఎమ్మెల్యేలను గెలిపించడం జరిగింది. నిర్ణయం ఏదైనప్పటికీ జరిగిపోయింది. మా ప్రతిపక్షనేత గారు చెప్పినట్లు ఇంత హడావిడిగా, ఇంత గందరగోళం మధ్య అప్రజాస్వామ్యంగా చేయవలసిన అవసరం లేదు.

17 మంది సంఖ్యాబలం ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ, 5, 6 మంది ఉన్నటువంటి టిఆర్ఎస్ పార్టీ సంఖ్యాబలం 15/16 మందికి వచ్చినటువంటి నేపథ్యం ఉంది. ఏది ఏమైనప్పటికి ప్రజలు చూస్తున్నారు, తెలంగాణ సమాజం చూస్తుంది. గతంలో అనేకసార్లు రాజీనామాలు చేసినా ఉద్యమ నేపథ్యంలో మళ్లీ ఎన్నికైనటువంటి సందర్భం. ఏదేమైనప్పటికీ, మా పార్టీ సభ్యులు ఎందుకు పోయారో? లేకపోతే తెలంగాణ అభివృద్ధి గురించి వెళ్లారో నాకు తెలియదు. కారణం ఏమైనప్పటికి నేను దానిలోకి పోకుండా, మన ప్రతిపక్షనాయకుడు చెప్పినట్లు ప్రభుత్వం అందరితో మాట్లాడితే బాగుండేది. శ్రీ కె. స్వామి గౌడ్ గారు సకలజనుల సమ్మె ఉద్యమ నేపథ్యం ఉన్నటువంటి వ్యక్తి. మనమంతా పవిత్ర హృదయంతో శాసనమండలి సభ్యులుగా పనిచేస్తామని ప్రమాణం చేశాం. కాబట్టి, మా పార్టీ తరఫున ఫారూక్ హుస్సేన్ గారికి పవిత్ర హృదయంతో ఓటేయండి. ప్రస్తుతం రంజాన్ మాసం నడుస్తోంది. హుస్సేన్ గారు శ్రీ కె.చంద్రశేఖర రావు గారి సమకాలీకుడు.

ఈరోజు గురుకుల ట్రస్టులో ఆక్రమణలను బుల్డోజ్ చేస్తున్నారు. అటువంటి ఆక్రమణలను మేము కూడా సమర్థించడం లేదు. కాని, అధికార పార్టీ, అధికారం ఉందని కాంగ్రెస్ పార్టీని ఈ రకంగా ఆక్రమించడం అన్యాయమని చెప్పడానికి మేము ప్రయత్నం చేస్తున్నాం. గెలుపు, ఓటములు ఉంటాయి. అది వేరే విషయం. గౌరవ శాసనసభ వ్యవహారాల మంత్రి గారు మమ్మల్ని మీరు ఎందుకు నామినేషన్ వేశారని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో మేము మహాత్మాగాంధీ గారి విగ్రహం వద్దకు వెళ్లడానికి అనుమతినివ్వరు, మేం ప్రొటెస్ట్ చేస్తున్నాం. కాని, ఇది కూడా ప్రొటెస్ట్‌లో భాగమే. నామినేషన్ వేసినప్పటకీ, ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉన్న వ్యక్తులుగా మా గొంతు వినిపియడం కొరకు నామినేషన్ వేశాం. అంతరాత్మ ప్రబోధంతో ముస్లీం సోదరుడైన శ్రీ ఫారూక్ హుస్సేన్ గారిని గెలిపిస్తారనే నమ్మకంతో నామినేషన్ వేయడం జరిగింది.

పోలవరం, విద్యుత్తు వంటి విషయాలు ఉన్నాయి. ఈ విషయాల మీద మాట్లాడండి. ఎవరో స్వర్గీయ నేత చేశారని, ప్రక్క రాష్ట్రం అతను చేశారని ఇక్కడ కూడా చేస్తే ఎలా? మీకంటే ఎక్కువ హక్కు తెలంగాణ బిడ్డలుగా మాకు కూడా ఉంది. తెలంగాణ అభివృద్ధిలో కలసి వస్తామని మా నాయకుడు చెప్పారు. ఈ రకంగా కాంగ్రెస్ శాసనమండలి సభ్యుల్ని బుల్డోజ్ చేసి ఈ రకంగా ఆక్రమించడమనేది అక్రమ చర్య. శ్రీ అరవింద్ కేజ్రివాల్ గారి లాగానే భవిష్యత్తులో ప్రజలే మిమ్మల్ని సీజ్ చేస్తారు. ఇది అప్రజాస్వామికం, అనైతికం కాబట్టి మేము ప్రొటెస్ట్ చేస్తున్నాం. నైతికంగా తెలంగాణ సమాజానికి మీరు సమాధానం చెప్పాలి.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ః మంత్రి గారు మాట్లాడండి. దయచేసి అందరూ కూర్చోండి.

శ్రీ టి.హరీష్ రావు (మైకు లేకుండా) ః సార్, సార్..................

(అంతరాయం)

శ్రీ పాతూరి సుధాకర రెడ్డి(మైకు లేకుండా) ః సార్, ఉపన్యాసం ఇవ్వడానికా మీరు సమయమిచ్చింది?

**11.30 ఉ.** మిస్టర్ ఛైర్మన్ః దయచేసి అందరూ కూర్చోండి. ఇప్పుడు ఎలక్షన్‌ను ప్రారంభిద్దాము. Now, we will proceed. సెక్రటరీ గారూ... వరుసగా సభ్యుల పేర్లను పిలవండి. ఎలక్షన్ ప్రారంభించండి.

శ్రీ డి. శ్రీనివాస్ ః అధ్యక్షా, ఒక్క నిముషం నాకు అవకాశం ఇవ్వండి. దయచేసి ముందు మాకు జవాబు చెప్పాలి. ఎందుకంటే, ఆయన మాట్లాడేదాని గురించే అడుగుతాము. ఎల్‌ఓపిగా సభలో మాట్లాడడానికి నిలబడినప్పుడు మాకు సహకరించాలి..

(అంతరాయం)

శ్రీ ఈటెల రాజేందర్ ః (హుజూరాబాదు) అధ్యక్షా, ప్రతిపక్షనాయకులు శ్రీ డి. శ్రీనివాస్ గారు మరియు మన గౌరవ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు మాట్లాడినదానిలో రెండు విషయాలు తమ ద్వారా చెప్పాలి. అందులో ఒకటి, ఇది అప్రజాస్వామికమని శ్రీ డి. శ్రీనివాస్‌గారు అన్నారు. వారు అపారమైన అనుభవం ఉన్నవారు....

శ్రీ మహ్మద్ ఆలీ షబ్బీర్ ః (అసెంబ్లీ) అధ్యక్షా, ఎలక్షన్ అన్నప్పుడు, when Sri E. Rajendar is not a member of this House, ఇలా ఎలా ఇస్తారు మీరు, ఆయన ఒక మంత్రి. ఎలెక్షన్ అయిన తరువాత మాట్లాడమనండి. అధ్యక్షా, మొదట మాకు క్లారిఫికేషన్ ఇవ్వాలి.

(అంతరాయం)

శ్రీ ఈటెల రాజేందర్ ః అధ్యక్షా, మీ ద్వారా ఒకటే అడుగుతున్నాను – నాలుగుకోట్ల తెలంగాణా ప్రజానీకం ఆత్మను ఆవిష్కరించి, తెలంగాణా ఉద్యమానికి నాయకత్వం వహించిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారిని గెలిపించి ప్రభుత్వాన్ని నెలకొల్పి సభలకు పంపేలా చేశారు. ఇది ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించడమే అధ్యక్షా. మా మిత్రులు శ్రీ పొంగులేటి. సుధాకర్ రెడ్డిగారు ఇది పవిత్రమైన మాసం, పెద్దల సభ, దీని ఔన్నత్యాన్ని, గౌరవాన్ని కాపాడాలని మాట్లాడుతున్నారు. అధ్యక్షా, ఈ రంజాన్ పవిత్రమైన మాసం, కాబట్టి, ప్రజాసభ ...

శ్రీ ఫారూక్ హుస్సేన్ : (నామినేటెడ్) అధ్యక్షా, మంత్రులు ఇక్కడ ఉండి, ప్రభావం చూపిస్తున్నారు కాబట్టి, సభ్యులు ఇక్కడ ఉన్నారని చెప్పి నేను గౌరవిస్తున్నాను...

(అంతరాయం)

శ్రీ ఈటెల రాజేందర్ : అధ్యక్షా, ఈ మాసం పవిత్రమైన మాసం కాబట్టి, ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే పద్ధతిలో పెద్దల సభ ఉంది. పెద్దల సభ అంటే, ప్రజాభిప్రాయానికి భిన్నమైన వాళ్ళు కాదు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేవారు, 60 సంవత్సరాలుగా యావత్ తెలంగాణా జాతికి జాతి, మూడు తరాలుగా, మూడు దఫాలుగా, తెలంగాణా కోసం అనేక ఉద్యమాలు చేసి, త్యాగాలు చేసి, సాధించుకున్న తెలంగాణా గొప్పగా నిర్మాణం కావాలని యావత్ తెలంగాణా ప్రజలు ఆలోచన చేసి, ఆ ఉద్యమాలకి నాయకత్వం వహించిన టిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారు. అలాగే పెద్దల సభలో ఉన్న పెద్దలందరూ, సభ్యులందరూ కూడా ఆ ప్రజాక్షేత్రంలో ఉన్న అభిప్రాయాన్ని గౌరవించి, ఈ రోజు ఐక్యమైన విషయాన్ని మరచిపోకూడదని తమ ద్వారా మనవిచేస్తున్నాను. వారు తీసుకున్న నిర్ణయం సముచితమైనది, న్యాయమైంది, ధర్మమైంది...

శ్రీ ఫారూక్ హుస్సేన్ : (మైకు లేకుండా) అధ్యక్షా, ఇది ప్రజాస్వామ్యమా, ఇది పెద్దల సభేనా అని నేను గౌరవ మంత్రివర్యులనే అడుగుతున్నాను...

శ్రీ ఈటెల రాజేందర్ : అధ్యక్షా, పెద్దల సభ కూడా హుందాగా ఉండేవిధంగా ఉందామని మేము భావిస్తున్నాము. రేపటి బంగారు తెలంగాణా నిర్మాణంలో పెద్దల సభ గొప్పగా ఉండాలని, గొప్ప నిర్ణయాలు తీసుకోవాలని చెప్పి, ఈరోజు మన పెద్దల సభలో ఉన్న సభ్యులందరూ కూడా ఆ నిర్ణయం తీసుకున్నందుకు అభినందిస్తున్నాను. ఇప్పటికే ఎల్.ఓ.పి. గారు అనేక విషయాలు చెప్పారు. అధ్యక్షా, నేను ఒకటే వారిని కోరుతున్నాను. గత 60 సంవత్సరముల కాలంలో ఏమి జరిగిందో మీకు తెలుసు. సమైక్య రాష్ట్రంలో మీ లాంటి అనుభవజ్ఞులకు ఏ చేదు అనుభవం ఎదురైందో మర్చిపోయారా అని అడుగుతున్నాను. ఆనాడు మన ప్రజాస్వామ్యం, మన వ్యవస్థ ఎక్కడికి పోయాయని మీ ద్వారా అడుగుతున్నాను. కాబట్టి, అటువంటి మాటలు మాట్లాడడం సమంజసంగా లేదని మనవిచేస్తున్నాను.

శ్రీ ఫారూక్ హుస్సేన్ : (మైకు లేకుండా) అధ్యక్షా, బంగారు తెలంగాణా ఎప్పుడు వస్తుంది? ఈ రోజు బంగారు తెలంగాణా ఎలా ఇస్తారు?

శ్రీ మహ్మద్ అలీ షబ్బీర్ : (మైకు లేకుండా) అధ్యక్షా, సభలో ఎలెక్షన్ శాన్క్టిటీ లేదండి. ఇది కరెక్టు కాదు. అధ్యక్షా, మాకు క్లారిఫికేషన్ ఇవ్వండి. నా పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఆయన మాట్లాడిన దాని మీదే ఉంది.

శ్రీ ఈటెల రాజేందర్ ః అధ్యక్షా, సభ్యులు శ్రీ డి. శ్రీనివాస్‌గారికి, శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిగారికి తమద్వారా మనవిచేసేదేమిటంటే, పవిత్రమైన రంజాన్ మాసంలో పవిత్రమైన నిర్ణయం ఈ రోజు మా పార్టీవారు తీసుకున్నారు. ఈరోజు ఎన్నికలు జరగబోతున్నాయి. గతంలో శ్రీమతి ఇందిరాగాంధీగారు అనేకసార్లు చెప్పినట్లుగా అంతరాత్మ సాక్షిగా ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ రోజు మా గౌరవ సభ్యులు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే పద్ధతిలో నిర్ణయం తీసుకున్నారు కాబట్టి, ఆ నిర్ణయానికి అనుగుణంగా, ఎటువంటి అన్యాయం జరగకుండా, ఈ రోజు ఎన్నికలు జరిపించాలని తమరిని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్ ః అధ్యక్షా, తమరు మాకు పంపించిన మెంబర్స్ నోటీసులో ఈ రోజు ఎలక్షన్స్ జరుగుతాయని అన్నారు. అలాగే ఛైర్ నుంచి కూడా ఎలెక్షన్ ప్రక్రియ ప్రారంభమైందని అనౌన్స్ చేశారు. అలాంటిది పర్పస్ ఆఫ్ ఎలక్షన్ విషయం గురించి మాట్లాడినప్పుడు, గౌరవ మంత్రులు సభలో కూర్చుంటే కూర్చోవచ్చు. కానీ, ఇక్కడ జరిగే డిబేట్‌లో లెజిస్లేటివ్ ఎఫైర్స్ మినిస్టర్ మాట్లాడారంటే, ఎస్. ఆయన ఏ సభలో సభ్యులైనా కూడా మాట్లాడవచ్చు. కానీ, హౌస్‌లో మెంబర్లు కాని వాళ్లు వచ్చి, మీ హౌస్‌లో మాట్లాడతామంటే, మీరు ఇచ్చిన రూల్స్ పుస్తకంలో ఎక్కడా దీనికి సంబంధించిన క్లారిఫికేషన్ లేదు. లెజిస్లేచర్ సెక్రటరీ గారు మమ్మల్ని మభ్యపెడుతున్నారు. ఇది తప్పు. ఇంత కూడా హైజాక్ చేసుకోకండి. నేను చెప్పిన అంశాలను వినండి.

(అంతరాయం)

అధ్యక్షా, ఇది కంప్లైంట్ కాదు, నేను చెప్పేది దయచేసి వినండి. నేను రెయిజ్ చేసిన అంశానికి సంబంధించి డైరెక్టుగా ఛైర్ నుంచి డైరెక్షన్ రావాలి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన తరువాత సభలో ఉన్న సభ్యులు, అదనంగా లెజిస్లేటివ్ ఎఫైర్స్ మినిస్టర్‌కే సభలో మాట్లాడే హక్కు ఉంటుందని నాకు తెలుసు. (రూల్స్ పుస్తకం సభలో చూపిస్తూ,) ఈ పుస్తకంలో కూడా నేను చదివింది అదేవిధంగా ఉంది. లేదంటే, మీరు ఒక డైరెక్షన్ ఇవ్వండి. ఇంతకుముందు గౌరవ మంత్రి శ్రీ ఈటెల రాజేందర్ గారు మాట్లాడుతూ, ఇది పవిత్రమైన మాసమని అన్నారు. ఈరోజు నేను పత్రికలో చదివినది ఏమిటంటే, రంజాన్ మాసం అన్నా కరెంటు లేదు, ఇఫ్తార్ అయినా కరెంటు లేదు. మేము ఆయనకి చెప్పేదేమిటంటే, పవిత్రమైన ఈ రంజాన్ మాసంలో పవిత్రమైన మోసం చేస్తున్నారు. మేము తెలంగాణాను తీసుకువచ్చినందుకు ఇందులో మా కృషి కూడా ఉంది. మేము కూడా ఈ తెలంగాణా కోసం కృషి చేస్తున్నాం. మా ప్రభుత్వాన్ని మేము ...

శ్రీ టి. హరీష్‌రావు ః మీ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క ....

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి ః అధ్యక్షా, ప్రజాస్వామ్యం అని వారే అన్నారు. ఆ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిర్వహిస్తామంటే...

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ః దయచేసి ఎటువంటి డిస్కషన్స్ వద్దు, మీరందరూ కూర్చుంటే, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. Now, we will take-up election process.

శ్రీ డి. శ్రీనివాస్ ః అధ్యక్షా, మీరు ఎలెక్షన్ ప్రాసెస్ మొదలుపెట్టే ముందు ఒకటి, రెండు విషయాలు క్లారిఫై చేయవలసిందిగా కోరుతున్నాను. ఈ రూల్స్ పుస్తకంలో ఏమి ఉందంటే – provided that the minister who is not a member and the Advocate-General shall be deemed to be members for the purpose of speaking in moving motions and or otherwise taking part in the proceedings of the House and for the purpose of speaking in, and / or otherwise taking part in the proceedings. It is specifically a regular precedence and practice in the House for any specific purpose that a Minister who is not a member of the House can not participate in the debate relating to a motion like this. Therefore, he does not have any right to participate in the debate. At the same time, we don’t have any objection for his sitting in this House. We have every objection for their participation in the current debate. ఇందులో దీని ప్రకారం వారికి అధికారం లేదు. న్యాయంగా అయితే, మేమందరం గౌరవం గల వ్యక్తులం కనుక న్యాయంగా అయితే, సభలో మంత్రులు ఉండకూడదు కానీ, దానికి మేము ఏమీ అభ్యంతరం పెట్టలేదు. ఇక మీరు ఎలక్షన్ ప్రక్రియ ప్రారంభించబోయే ముందు మేము మిమ్మల్ని ఒక రిక్వెస్ట్ చేశాము. ఉదాహరణకు లెజిస్లేటివ్ మినిస్టర్‌గారు మమ్మల్ని నామినేషన్ ఫైల్ చేశారా అంటే, మేము గవర్నరుగారిని రెక్వెస్టు చేసిన తరువాత మాకు ఏమీ జనాబు రాలేదు. ప్రాసెస్ మొదలైంది. ప్రాసెస్ మొదలైన తరువాత, ఎలెక్షన్‌కు సంబంధించి మేము మిమ్మల్ని ప్రశ్నించాలంటే, మేము సీట్లలో ఉండాలి కదా ! ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోతే ఎలా, అందుకే ఉన్నాము. మీరు ఏమైనా కన్సిడర్ చేస్తారేమోనని అనుకున్నాం, ఇప్పటికీ ఆశిస్తున్నాం. అంతేగానీ, క్రిందటి సమావేశాలలో ఇంత చక్కగా మాట్లాడుకుని, ఎంతో మ్యానేజ్ చేసుకుని, ఇంత చర్చ జరిగిన తరువాత ఈ విధంగా చేయడం వల్ల లోకల్ బాడీస్‌కి ఓటర్ల మీద ప్రభావం చూపించడానికి కారణం అవుతుంది. ఇది వాస్తవం కూడా. మేము నామినేషన్ వేయడానికి కారణం కూడా అదే. So, keeping the issue alive, we are appealing to the Hon’ble Chairman to postpone this issue. కనుక మంత్రులకు సంబంధించిన

అంశాలలో ఈ రూల్స్ పుస్తకంలో ఉన్న అంశాలు క్లారిటీతోనే ఉన్నాయి కాబట్టి, ఇందులో పార్టిసిపేట్ చేయడానికి వీలు లేదు. మాట్లాడడం మొదలు పెడితే అందరూ మాట్లాడవచ్చు. అది పద్ధతి కాదు. మేము ఎలెక్షన్స్‌ను పోస్ట్‌పోన్ చేయమని అప్పీల్ చేశాము. అలాగే, లెజిస్లేటివ్ ఎఫైర్స్ మినిష్టరుగారికి కూడా అప్పీల్ చేస్తున్నాము. ముఖ్యమంత్రిగారు, గవర్నరుగారికి వందనం సమర్పించే సమయంలో ఆయన మాట్లాడి, ఏవిధంగానైతే ముందుకు వెడదామని అన్నారో, అలాగే తెలంగాణా తేవడంలో మా నాయకురాలు పాత్ర కూడా ఉంది. అయితే, నేను చెప్పేది వినండి. I am on my legs. అధ్యక్షా, మేము కలిసి పోరాడాము. నేను మీ ద్వారా ఒక విషయం తెలియజేస్తున్నాను. It is my right to express my views.

శ్రీ టి. హరీష్‌రావు : అధ్యక్షా, ఎలక్షన్ గురించి, సబ్జక్టు గురించి మాట్లాడమనండి..

(అంతరాయం)

శ్రీ డి. శీనివాస్ : అధ్యక్షా, నేను మంచిమాటలే చెపుతున్నాను. ఏ వాతావరణాన్ని క్రియేట్ చేయాలన్న భావనతో ఆ రోజున ముఖ్యమంత్రిగారు చెప్పారో, అలాగే ప్రజలలోకి పంపాలన్న మెసేజ్‌ను ట్రాన్స్‌పరెంట్‌గా పంపితేనే న్యాయం చేసిన వాళ్ళమవుతాము. కానీ, ఇకనైనా మా చేతిలో అధికారం ఉందని ముందుకు వెడతామంటే, కరెక్టు కాదు అధ్యక్షా. ఇక చివరగా, మేము ఏమనాలనే మాట మీ డైరెక్షన్ మీద ఆధారపడి ఉంది. So, we are waiting for your direction.

శ్రీ హరీష్‌రావు : అధ్యక్షా, దయచేసి ఈ పెద్దల సభ యొక్క గౌరవాన్ని కాపాడదాం. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతిపక్షనాయకులు దయచేసి సహకరించాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి సభ్యులందరూ సహకరించి ఈ సభయొక్క గౌరవాన్ని కాపాడండి. ఈ ఎన్నికలని సజావుగా, ప్రజాస్వామ్య పద్ధతులలో జరిగే విధంగా సహకరించాలని కోరుతున్నాను.

**11.45 ఉ.** శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః ఆల్‌రెడీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఇలా ఉపన్యాసాలు ఇస్తామంటే ఎలా? మేము కూడా ఉపన్యాసాలు ఇస్తాము.

శ్రీ ఎమ్.ఎస్. ప్రభాకర్‌రావుః ముందు మాకు క్లారిఫికేషన్ ఇవ్వండి.

(INTERRUPTIONS)

MR. CHAIRMAN: I request you to please resume your seats. Please cooperate with the Chair in conducting the election. Now, I will initiate the election process.

శ్రీ డి. శ్రీనివాస్ః మాకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వకపోతే ఎలా?

శ్రీ ఎమ్.ఎస్. ప్రభాకర్‌రావుః (స్థానిక సంస్థలు) ఏ సెక్షన్ క్రిందనో చెప్పండి. You have already commenced the election process. But, before that, we would like to know under which rule?

MR.CHAIRMAN: Secretary garu, please call the Members to vote.

SECRETARY: Sri Md. Mahmood Ali (Hon'ble Deputy Chief Minister)

శ్రీ ఎమ్.ఎస్. ప్రభాకర్‌రావుఃఒకవైపు మాట్లాడుతుంటే ఓటు వేస్తే ఎలా? ఇదేమి అన్యాయం? ఎలక్షన్ ఎందుకు? ఇదేమిటి సర్? మాట్లాడడానికి అవకాశం ఇవ్వరా? ఒక పద్ధతి లేదా?

శ్రీ డి. శ్రీనివాస్ః మైకు ఇవ్వండి.

(ఈ దశలో సెక్రటరీగారు ఓటు వేయడం కోసం శ్రీ డి. శ్రీనివాస్ పేరు పిలిచారు. )

SRI D.SRINIVAS: No, No, I want clarification from the Chair.

(ఈ దశలో కాంగ్రెస్ సభ్యులు పోడియం వద్దకు వచ్చి సభకు అంతరాయం కలిగించసాగారు.)

(అప్పటికే పోడియం వద్దనున్న సభ్యులు అప్రజాస్వామిక ఎన్నిక ఆపాలి, మా హక్కులను కాలరాసే ఎన్నికను ఆపాలి అని నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు.)

(ఈ దశలో సెక్రటరీగారి టేబుల్ వద్దనున్న పేపర్స్‌ను షబ్బీర్ అలీగారు చించి సభలో పైకి ఎగురవేసి తన నిరసన వ్యక్తం చేశారు.)

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిః ఇలా చేస్తే ఎన్నిక కాదు. ఈ అప్రజాస్వామిక ఎన్నికను నిరసిస్తున్నాము. పద్ధతిగా చేయండి. పెద్దల సభ చాలా బ్రహ్మాండంగా ఉండాలి.

శ్రీ ఎమ్.ఎస్. ప్రభాకర్‌రావుః అపోజిషన్ వద్దు ఏమీ వద్దు, అంతా మీరే చేసుకోండి. మా స్టాండ్ చెప్పడానికి మైకు ఇవ్వండి. ఎలక్షన్నుకు అంత తొందర ఏమి ఉంది?

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిః ఈ ఎలక్షన్నుకు అర్థం లేదు.

శ్రీ డి. శ్రీనివాస్ః ఈ రోజు జరుగుతున్న పరిణామం చూస్తుంటే చాలా బాధగా ఉంది. ఒకవైపు మాట్లాడుతుంటే, ఇంకొకవైపు ఓటింగ్ మొదలైంది. దీనిని బట్టి చూస్తుంటే సభ ఏ రకంగా జరుగుతుందో చాలా క్లియర్‌గా తెలుస్తుంది.

శ్రీ టి. హరీష్ రావు: మీరు ముందు క్షమాపణ చెప్పండి. మీ (కాంగ్రెస్) సభ్యుల అనుచిత వైఖరికి క్షమాపణ చెప్పండి.

శ్రీ డి. శ్రీనివాస్ : ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించడం లేదు. In protest against the undemocratic method of holding the election, our Party is withdrawing our candidate from the election. We are not going to participate in the election process. మేము సభ నుండి వాకౌట్ చేస్తున్నాము.

(ఈ దశలో కాంగ్రెస్ సభ్యులు కొంతమంది పేపర్లు చింపి పైకి విసరటం జరిగింది.)

(ఈ దశలో కాంగ్రెస్ సభ్యులు షేమ్ షేమ్ అంటూ సభ నుండి నిష్క్రమించారు. )

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: (నామినేటెడ్) కాంగ్రెస్ పార్టీ బండారం బయటపడుతుందనే వాళ్లు పారిపోతున్నారు. వాళ్లు ఎలక్షన్సులో కాంటెస్ట్ చేశారు. మీరు కౌన్సిల్‌లో పెద్ద మనుష్యులుగా వ్యవహరించకుండా కాగితాలు చింపి వేయడం, గొడవ చేయడం పద్ధతి కాదు. గతంలో డి. శ్రీనివాస్‌గారు, షబ్బీర్ అలీగారు మంత్రులుగా పని చేశారు. సభలో కాగితాలు చింపి గందరగోళం సృష్టించినందుకు సభకు క్షమాపణ చెప్పాలి. చిన్న పిల్లవాళ్లు చేసిన విధంగా చేస్తున్నారు. చిన్న పిల్ల చేష్టలను మానుకోవాలని కాంగ్రెస్ సభ్యులను కోరుతున్నాను. మీరు ఈ రోజు ఎలక్షన్ బాయ్‌కాట్ చేసి, ఓటింగ్‌లో పాల్గొనకుండా వెళ్లిపోయారు. అలాంటప్పుడు యునానిమస్‌గా ఎన్నుకుంటే ఎంత బాగుండేది. దానికి వారు సిద్ధంగా లేరు. నానా రబస చేసి పెద్దల సభను అవమానపరిచే విధంగా ప్రవర్తించారు. దానికి వారు క్షమాపణ చెప్పకుండా వెళ్లి పోయారు. ఆ విధంగా చేయడం వల్ల పెద్దల సభ క్షమించదని మనవి చేస్తున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు : గౌరవ సభ్యులు పెద్దల సభ యొక్క గౌరవాన్ని పెంచే విధంగా ప్రవర్తించాలి. మంత్రులుగా పని చేసిన వారు కూడా సభలో వ్యవహరించిన తీరు చాలా అప్రజాస్వామికంగా ఉంది. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ రోజు ఛైర్ పట్ల, మీ పట్ల కనీస మర్యాద లేకుండా అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. సెక్రటరీగారి టేబుల్ వద్ద నున్న పేపర్స్‌ను చించి వేయడం చాలా బాధాకరము. ఏళ్లతరబడి మంత్రులుగా పని చేసి, అపారమైన అనుభవం గల వారు, ప్రతిపక్ష నాయకులుగా ఉండి ఈ విధంగా ప్రవర్తించడం చాలా బాధాకరము. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. ఎన్నికలలో గెలవలేమోననే బాధతో , సంఖ్యాబలం లేదు కాబట్టి హాజరైన సభ్యులలో ఎన్ని ఓట్లు పడతాయో తెలియదు కాబట్టి వారి మీద వారికి నమ్మకం, విశ్వాసం లేక వాకౌట్ చేసిన పరిస్థితిని చూశాము. కనీసం వారి

సభ్యులను కాపాడుకోలేని పరిస్థితి. వారికి ఉన్న సభ్యులలో ఎంతమంది ఓటు వేస్తారో కూడా తెలియదు. ఎన్నికలను ఎదుర్కోలేక కుంటిసాకులు చెప్పి సభ నుండి వాకౌట్ చేస్తున్నామని, క్యాండిడేట్‌ను విత్‌డ్రా చేస్తున్నామని అన్నారు. తెలంగాణా రాష్ట్రం కొత్తగా ఏర్పడింది. కొత్త ప్రభుత్వం వచ్చింది. కెసిఆర్ నాయకత్వంలో బంగారు తెలంగాణా సాధ్యమవుతుందని ప్రజలు తీర్పు ఇచ్చారు. రీఆర్గనైజేషన్ సెక్షన్ –25 ప్రకారం చాలా స్పష్టంగా ఛైర్మన్ ఎన్నిక జరుపుకోవాలని ఉంది. పోటీ పెట్టండి సంతోషం, ఎన్నిక జరుపుకుందాం, దానికి మేము వ్యతిరేకం కాదు. ఎన్నిక ఎందుకు పెట్టాలని మేము అనలేదు. వారి మెజారిటీ ఏమిటనేది ప్రజాస్వామ్యబద్ధంగా తేలేది. కాని మీ సభ్యులలో ఎంతమంది ఓటు వేస్తారో తెలియక ఎన్నిక ఆపాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయబద్ధంగా శాసనసభ ప్రొసీజర్స్ ప్రకారం జరుగుతున్న ఎన్నిక ఇది. గౌరవ డిప్యూటీ ముఖ్యమంత్రి, హోమ్ మినిస్టర్‌గారు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని కోరుతున్నాను. వారు భేషరతుగా క్షమాపణ చెప్పాలి. వారు చెప్పకపోయినా అది వారి విజ్ఞతకే వదలి వేస్తున్నాను. వారు బయటకు వెళ్లారు కాబట్టి బయట అయినా క్షమాపణ చెబితే బాగుంటుంది.

Mr. CHAIRMAN: Now I request the Secretary to call the Members to Vote.

SECRETARY :

Sri K. Dilip Kumar .. absent

Sri Farooq Hussain .. absent

Sri V. Gangadhar Goud .. absent

Sri S. Jagadeeswar Reddy .. absent

12.00 మ. Members that abstained from voting and those who have participated in voting through secret ballot;

| MEMBERS ABSTAINED | | MEMBERS VOTED | |
|---|---|---|---|
| 1 | Sri Balasani Lakshminarayana | 1 | Sri Mohd.Mahmood Ali |
| 2 | Sri Potla Nageshwar | 2 | Sri Sabavat Ramulu Nayak |
| 3 | Sri Arikala Narsa Reddy | 3 | Dr K. Nageshwar |
| 4 | Sri Farooq Hussain | 4 | Sri Nagapuri Rajalingam |
| 5 | Sri M.S. Prabhakar Rao | 5 | Sri Poola Ravinder |
| 6 | Sri Gangadhar Goud Vollula | 6 | Sri Mohammed Saleem |
| 7 | Sri M. Ranga Reddy | 7 | Sri Paturi Sudhakar Reddy |
| 8 | Sri T. Santosh Kumar | 8 | Sri Syed Altaf Hyder Razvi |
| 9 | Sri Peer Shabbir Ahmed | 9 | Sri K. Swamy Goud |
| 10 | Sri Ponguleti Sudhakar Reddy | 10 | Sri Bodakunti Venkateshwarlu |

11 Sri B. Venkata Rao
12 Sri D. Srinivas
13 Sri Mohammed Ali Shabbir
14 Sri Kapilavai Dileep Kumar

11 Sri Nethi Vidya Sagar
12 Sri Kompally Yadava Reddy
13 Sri T.Bhanu Prasad Rao
14 Sri V. Bhoopal Reddy
15 Sri S. Jagadeeswar Reddy
16 Sri D. Rajeshwar Rao
17 Sri K.Janardhan Reddy
18 Sri K.R.Amos
19 Sri Naini Narsimha Reddy
20 Sri Syed Aminul Hasan Jafri
21 Sri Patnam Narender Reddy

MR. CHAIRMAN: Voting is closed. Now, I request the Secretary, Legislature Secretariat to count the votes.

| | | |
|---|---|---|
| Total number of votes polled | : | 21 |
| Invalid votes | : | Nil |
| Votes polled in favour of Sri Farooq Hussain | : | Nil |
| Votes polled in favour of Sri K. Swamy Goud | : | 21 |

Now, I declare Sri K. Swamy Goud elected as "**CHAIRMAN**"

Now, I request Sri K. Swamy Goud, Chairman, to please come and occupy the Chair.

I also request Sri Mohd.Mahmood Ali, Deputy Chief Minister, Sri T. Harish Rao, Minister for Legislative Affairs and other Floor Leaders to escort Sri K. Swamy Goud to the Chair.

**12.35 మ.** మిస్టర్ చైర్మన్ ః సభకు నమస్కారం. శ్రీ మహమూద్ ఆలీ గారూ.

جناب محمد محمود علی (Sri Mohd.Mahmood Ali): آج ہمارے لئے بڑی خوشی کی بات ہے کہ ہمارے ایم ایل سی، جناب سوامی گوڑ صاحب کو تلنگانہ قانون ساز کونسل کا چیرمین بنایا گیا ہے۔ کونسل کے ممبران کی طرف سے، اسمبلی کے ممبران کی طرف سے اور تلنگانہ کے سارے چار کروڑ عوام کی طرف سے آپ کو مبارک باد پیش کی جاتی ہے۔ یقیناً سوامی گوڑ صاحب کی زندگی شروع سے ہمیشہ ایک ایسی زندگی رہی کہ وہ لوگوں کے لئے لڑتے رہے، عوامی مسائل کے لئے لڑتے رہے، ملازمین کے لئے لڑتے رہے، اور خاص طور سے جب سے تلنگانہ تحریک شروع ہوئی تب ہی سے یہ اس سے وابستہ رہے۔ آج تلنگانہ حاصل کرنے میں سوامی گوڑ صاحب نے بہت بڑے کارنامے انجام دئے۔ خاص طور سے سکلا جنانے میں 42/43 دن کی جو ملازمین کی ہڑتال تھی، اس وقت وہ ٹی این جی اوز کے President تھے انہوں نے leading کرتے ہوئے ہمیں تلنگانہ حاصل کرنے میں بڑی مدد کی ہے۔ یقیناً تلنگانہ کی عوام ہمیشہ ان کو یاد کرتی رہے گی۔ آج تلنگانہ بڑی محنت کے بعد ہمیں ملا اور اس کے بعد ٹی آر ایس پارٹی کو اقتدار حاصل ہوا۔ آج سوامی گوڑ صاحب کو جو چیرمین منتخب کیا گیا اس کے لئے میں ان کو بہت بہت مبارک باد پیش کرتا ہوں۔ جئے تلنگانہ۔

శ్రీ కె. యాదవరెడ్డిః (అసెంబ్లీ) అధ్యక్షా, కొత్తగా ఎన్నికైన అధ్యక్షులకు స్వాగతం పలికే అవకాశం కల్పించినందుకు నేను మొట్టమొదటగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పెద్దలు స్వామిగౌడ్ గారి గురించి చెప్పాలంటే ఎన్నో విషయాలున్నప్పటికీ సభలో చాలా మంది సభ్యులు అభినందనలు తెలియజేయాల్సి ఉంది కాబట్టి నేను కొన్ని ముఖ్యమైన అంశాలను మాత్రమే సభ ముందు ఉంచదల్చాను. స్వామిగౌడ్ గారు మా జిల్లాకు చెందిన వ్యక్తి. వారికి అధ్యక్ష పదవికి ఎన్నుకున్నందుకు అధికార పార్టీకి, సహకరించినందుకు ఇతర పార్టీల సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. స్వామిగౌడ్ గారు ఒక సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ ఈరోజు ఈ స్థాయికి రావడానికి, పూవు పుట్టగానే పరిమళించినట్లు వారు అతి చిన్న స్థాయి ఉద్యోగంలో చేరినప్పటికీ తెలంగాణ ఎన్.జి.ఓ. అధ్యక్షునిగా ఎదిగి ఉద్యోగులను ఒక తాటిపైకి తెచ్చారు. మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో వారు చేసిన కృషి మన తెలంగాణ ప్రజలు ఎవరూ మరవలేరు.

1969లోనే వారు ఉద్యమంలో పాల్గొన్నప్పుడు బుల్లెట్‌తో గాయపడిన విషయం ఈరోజు పత్రికలలో వచ్చింది. బహుశా ఈ విషయం చాలా మందికి తెలిసుండకపోవచ్చు. తెలంగాణ రాష్ట్రసాధన కోసం సకల జనుల సమ్మె చేసి యావత్ ప్రపంచానికి తెలిసే విధంగా చేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఇది పెద్దల సభ అయినప్పటికీ అప్పుడప్పుడు కొన్ని ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి కాబట్టి మీకున్న అనుభవంతో ఈ సభను చక్కటి రీతిలో నడుపుతారని ఆశిస్తూ, మీకు ఎల్లప్పుడూ మేమందరం అన్ని విధాలుగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాను. మీరు ఈ రోజు అధ్యక్షులుగా ఎన్నికైనందుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో మనకు ఎదురవుతున్న సమస్యల గురించి ఒకసారి నెమరువేసుకోవాలనే ఉద్దేశంతో నేను రెండు మూడు విషయాలను మీ ముందు ఉంచదలచాను.

ఒకటి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత మనకు కొన్ని ఇబ్బందులు కల్గుతున్న మాట వాస్తవం. ముఖ్యంగా పవర్ సెక్టార్‌లో పవర్ షార్టేజ్ ఉన్నందువల్ల కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి కొన్ని ఇబ్బందులున్నప్పటికీ వాటిని అధిగమించేందుకు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సమస్యను పరిష్కరించడానికి ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది కాబట్టి అందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇంకా కొన్ని విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉన్నది కనుక ఈ ప్రభుత్వ పెద్దలకు నేను చేసే మనవి ఏమిటంటే విద్యుత్‌రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నాను.

రెండోది, తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పడింది కాబట్టి మనకు ఇరుగుపొరుగున ఉన్న నాలుగు రాష్ట్రాల వలన ఇంతకుముందే కొన్ని సమస్యలుండేవి, ఇప్పుడు ఇంకా కొన్ని కొత్త సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నది, వస్తున్నాయి కాబట్టి వాటిని ఏ రకంగా అధిగమించాలనే దానిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నాను.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన తెలంగాణ రాష్ట్రం నుంచి విడిపోయిన తరువాత కృష్ణా నదీజలాల గురించి మనకు కొన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు సృష్టిస్తున్నారు. వాటి గురించి కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన తరువాత కేంద్ర ప్రభుత్వం స్పందించి కొంత నీటిని విడుదల చేయడం జరిగింది. ఇవ్వాళ పత్రికలలో చూసిన ప్రకారం రెండు, మూడు టిఎంసీల నీరు ఇవ్వాల్సిన బాధ్యత మనపైన ఉన్నది. ఇటువంటి పరిస్థితులు ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు వారి పరిపాలన ఉండేది కాబట్టి మన తెలంగాణ రాష్ట్రనాయకులకు తెలియకుండా వారి ప్రాంతాకు నీటిని వదిలినందున అప్పట్లో మన తెలంగాణ ప్రాంతానికి నీటి కొరత ఏర్పడింది. వాటిని ఏ రకంగా అధిగమించాలనేది కూడా ఈ ప్రభుత్వం ఆలోచన చేయాలి.

తెలంగాణ రాష్ట్రసాధనకు ముందు ప్రజలకు అనేక రకాల వాగ్దానాలు చేశాం. వాటిని నిలబెట్టుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తున్న సందర్భంలో కొన్ని కొత్త సమస్యలు కూడా మన ముందు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంటు గురించి ఏదో ఒక సందర్భంలో కె.సి.ఆర్ గారు చెప్పిన ఒక సామెత నాకు గుర్తుకొచ్చింది. "పుట్టిన బిడ్డ చచ్చినా పురిటికంపే పోలేదు కానీ మన ఇబ్బందులన్నీ పెరుగుతున్నాయని అన్నారు". అది ఎందుకన్నారంటే మన తెలంగాణ రాష్ట్రవిద్యార్థులకిచ్చే ఫీజు రీయింబర్స్‌మెంటుతోబాటు ఆంధ్ర విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంటు చేశామంటే భవిష్యత్తులో మన విద్యార్థులకు ఆంధ్ర ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఉద్యోగాలలో పోటీగా వస్తారు కాబట్టి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వ్యతిరేకించడంతోబాటు కచ్చితమైన నిర్ణయం తీసుకోవలసిన అవసరమున్నదని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల విషయానికొస్తే ఈ మధ్య కాలంలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రూ.1100 కోట్లు కేటాయించి వాటిని ట్రాన్స్‌ఫర్ చేసినప్పుడు పొరపాటున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖజానాకు ట్రాన్స్‌ఫర్ అయింది. దాని గురించి ఎన్ని సార్లు రిమైండ్ చేసినప్పటికీ ఆంధ్ర ప్రభుత్వం స్పందించకపోతే మన తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రేమండ్ పీటర్ గారు చాలా గట్టిగా కృషి చేసి ఆ నిధులను మన తెలంగాణ ఖజానాకు తీసుకరావడానికి వారు చేసిన ప్రయత్నానికి మనందరం అభినందించాల్సిన అవసరమున్నది.

12.50 మ. అటువంటి అధికారులు ఇంకా ఎంతోమంది మనకు కావలసిన అవసరం ఉంది. మరొక అంశం ఏమంటే – కేంద్ర ప్రభుత్వంలో Compensatory Afforestation Fund Management and Planning Authority అనే సంస్థ ఒకటుంది. దీన్ని 'కంపా' అంటారు. ఈ సంస్థలో మన ప్రభుత్వం ద్వారా రూ.2500కోట్లు డిపాజిట్ చేయబడి ఉన్నాయి. ఒక ప్రాజెక్టు నిర్మించడానికి , లేదా ఒక పరిశ్రమను ఏర్పాటు చేయడానికి అటవీ భూమిని వినియోగించుకున్న సందర్భంలో దానికి నష్టపరిహారంగా కొంత సొమ్మును కట్టవలసి ఉంటుంది. దానికి సంబంధించి మన ప్రభుత్వం ద్వారా డిపాజిట్ చేయబడిన రూ.2500కోట్ల ఫండ్ ఒకటి కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉండిపోయింది. అందులో 30శాతం వరకు మాకు ఇవ్వాలని మన ప్రభుత్వం ఎన్నిసార్లు అడిగినా, ఇప్పటికీ కేవలం 11శాతం మాత్రమే వచ్చింది. అటువంటి దాని పట్ల శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ విషయంలో నేను ముఖ్యమంత్రి కెసిఆర్ గారిని అభినందిస్తున్నాను. ఈ విషయం వారి దృష్టికి రాగానే వెంటనే దానిపై స్పందించి ఒక లేఖ రాసి దాని మీద చలనం కలిగించిన విషయం మనకి తెలుసు . అటువంటి అనేక కార్యక్రమాలు మనం చేయవలసిన అవసరం ఉంది. మేము కాంగ్రెస్ పార్టీ సభ్యులుగా ఎలెక్ట్ అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ కూడా ఈ తెలంగాణ ఉద్యమంలో చాలా గట్టిగా పని చేసిన మిత్రులుగా మేమంతా స్పందించి, ఎంతో కష్టపడి 60 సంవత్సరాలుగా ఉద్యమించి రాష్ట్రాన్ని ఒక బంగారు తెలంగాణాగా మార్చాలనే తపన, కమిట్మెంటు ఉన్న ప్రభుత్వానికి అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతో మా మిత్రులమంతా కలిసి ఒక ప్రయత్నం చేశాం . తెలంగాణా అంశం ఒక్కటే ముఖ్యం కాదు, తెలంగాణ ప్రజలు కూడా ముఖ్యం . పార్టీలకు అతీతంగా ఈరోజు ఎన్నికల గురించి చర్చించాలనుకుంటే నాకు తెలిసినంత వరకు ఇప్పటి వరకూ పోటీ జరగలేదు. రూలింగ్ పార్టీ ఏ అభ్యర్థిని నిలబెట్టినా ఆ అభ్యర్థికి అన్ని పార్టీలు సపోర్టు చేసి యునానిమస్‌గా ఎలెక్ట్ చేసిన సాంప్రదాయం సభలో ఉండేది. ఈరోజు యల్ఓపి గారు గానీ, ఇతర మిత్రులు గానీ ఇంత రచ్చ చేయడానికి గల కారణాల గురించి మనం మాట్లాడుకోవలసిన అవసరం ఉంది. యల్ఓపి గారు మాట్లాడుతూ – ఇది దుష్టసాంప్రదాయం, ఏదో ప్రలోభాలకు లోబడి పార్టీలను డివైడ్ చేస్తున్నారని అన్నారు, ఈవిధంగా వారు మాట్లాడడం మంచి పద్ధతి కాదు. కొంత కాలం క్రితం జరిగిన యల్ఓపి ఎలక్షన్స్ గురించి ఒకసారి నెమరు వేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఈ సభా గౌరవాన్ని తగ్గించదలుచుకోలేదు కాబట్టి ప్రస్తుతం నేను ఆ విషయం గురించి మాట్లాడదలుచుకోలేదు. అది వారి విజ్ఞతకే వదలిపెడుతున్నాను. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం అంటారా లేక బంగారు తెలంగాణ అంటారా, ఏదన్నా సరే, ఎంతో కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని దేశంలోనే ఒక అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టే కమిట్మెంట్ మనందరిలో

రావాలి. అందుకు మేమందరమూ ఈ ప్రభుత్వానికి తప్పకుండా అండగా నిలిచి మా శాయశక్తులా కృషి చేయాలని, ఈ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావడానికి, దీన్ని నిలబెట్టడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మేము ఈ నిర్ణయం తీసుకుని ఈ ప్రభుత్వానికి అండగా నిలబడాలనే ప్రయత్నం చేశాం .

రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన విషయాల గురించి నెమరు వేసుకుంటే – పండగ ఉంది, విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే వ్యాఖ్యలను మనం విన్నాం . స్వయంగా విద్యుత్ శాఖను నిర్వహించిన వ్యక్తి గతంలో జరిగిన అన్ని విషయాలను మరచి పోయి ఈరోజు కేవలం నెల రోజుల ప్రభుత్వంపై నిందలు వేయడం సబబు కాదు. ఈ సభలో మనం ఏదైనా చర్చించేటప్పుడు గతాన్ని దృష్టిలో ఉంచుకుని మాట్లాడితే చాలా బాగుంటుందని అందరికీ కావలసిన మిత్రునిగా నేను చెప్పదలుచుకున్నాను.

చివరగా – ఈ ఎన్నికల సందర్భంగా, అంటే జనరల్ ఎలక్షన్స్ గానీ తర్వాత జరిగిన ఎన్నికలు గానీ మాకు చాలా ఇబ్బందులు కలిగిన మాట వాస్తవమే. కానీ ఈ ఇబ్బందులకు కారణం ఈ రాష్ట్ర ప్రభుత్వం కాదు. రాష్ట్ర విభజనకి ముందు జరిగిన కొన్ని విషయాల వల్లే మాకు ఈ ఎన్నికలలో ఇబ్బంది కలిగింది. కలిగిన ఇబ్బందులకు ఈ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పడం సబబు కాదు. ఇది వ్యవస్థలో వచ్చిన మార్పు . దానికి దీనికి లింకు పెడుతూ దీని ప్రభావం వారి మీద పడుతుందని చెప్పడం చాలా శోచనీయం . అటువంటి వ్యాఖ్యలు చేసిన వారందరికీ మరొకసారి విన్నవిస్తున్నాను. ఇవి వ్యవస్థపరంగా వచ్చిన ఇబ్బందులే గానీ ఎవ్వరూ సృష్టించినవి కావు. ఇటువంటివి ఇక ముందు రాకుండా ప్రభుత్వాలు జాగ్రత్త పడాలని కోరుతున్నాను. కౌన్సిల్ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు స్వామిగౌడ్ గారికి మరొకసారి నా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పూల రవీందర్‌ః (వరంగల్, ఖమ్మం & నల్గొండ) అధ్యక్షా, ఈరోజు శుభదినం . తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి నాయకత్వంలో 14 సంవత్సరాలు జరిగిన అలుపెరగని పోరాటంలో పాలు పంచుకుని, ఉద్యోగ సంఘం నాయకులుగా ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం కోసం తమరు చేసిన కృషి ఈనాడు ఫలించింది. ఈ సందర్భంగా తమరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఏదైతే నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి కష్టపడి పని చేస్తామో , దానికి ఫలితం భగవంతుడు కల్పిస్తాడు. ఆరోజు జరిగిన ఉద్యమంలో, సకల జనుల సమ్మెలో పెద్దలు, మన గౌరవ ముఖ్యమంత్రిగారితో , ఇక్కడ ఉన్న మంత్రివర్యులు, పెద్దలతో కలిసి నేను కూడా ఉపాధ్యాయ సంఘాల పక్షాన పని చేసే అవకాశం కలిగినందుకు అదృష్టంగా భావిస్తూ, ఉద్యోగసంఘం నాయకులుగా క్రింది స్థాయిలో

ఉండే ఇబ్బందులు, కష్టసుఖాలు తెలిసిన తమరికి ఈ అవకాశం కల్పించినందుకు పెద్దలు గౌరవ ముఖ్యమంత్రిగారికి, గౌరవ మంత్రివర్యులు హరీష్‌రావు గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ, తమరికి మరొకసారి తెలంగాణ ఉద్యమాభినందనలు తెలియజేస్తున్నాను, థ్యాంక్యూ .

**1.05 ప.** శ్రీ అరికెల నర్సారెడ్డి : అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర తొలి శాసనపరిషత్ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మొట్టమొదటగా మీకు శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. రాబోయే రోజుల్లో మీ నాయకత్వంలో సభని గౌరవంగా నడిపిస్తారని ఆశిస్తున్నాను. సామాన్య కుటుంబంలో పుట్టినటువంటి వారు తమరు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో శాసనసభ కంటే శాసన పరిషత్‌కే మొట్టమొదటి స్థానం ఉంటుంది. కాబట్టి ఈ రాష్ట్రంలో గవర్నరు గారి తరువాత స్థానం మీకే వస్తుందని నేను అనుకుంటున్నాను. ఈ రాష్ట్ర ప్రజల పట్ల 60 సంవత్సరాలుగా అనేక విధాలుగా అన్యాయాలు జరుగుతున్నాయని పోరాటం చేసి కొత్త రాష్ట్రం సాధించుకున్నటువంటి సందర్భం ఇది. గడిచిన ఉద్యమంలో తమరు ఎన్జీఓ ఆర్గనైజేషన్‌లో అధ్యక్షుడిగా పనిచేస్తూ, నా రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యోగులకు అన్యాయం జరుగుతోంది కాబట్టి నా ఉద్యోగులకు న్యాయం జరగాలని పోరాటం చేసినటువంటి వ్యక్తిగా, రాష్ట్రం సాధించుకుంటే తప్ప మనకు న్యాయం జరగదని భావించినటువంటి వ్యక్తిగా ఇన్ని రోజులు పోరాటం చేసి ఈరోజు ప్రజా సంఘంలో ఒక ప్రజాప్రతినిధిగా అడుగుపెట్టి ముఖ్య స్థానమైన ఛైర్మన్ స్థానంలో ఈరోజు కూర్చున్న తమరిని నేను మనసారా అభినందిస్తున్నాను. ఎవరైతే ప్రజల సమస్యల్ని సభ దృష్టికి తీసుకురావాలనుకుంటున్న వ్యక్తులకు పూర్తిగా నిష్పక్షపాతంగా మాట్లాడేందుకు మొదటగా సమయం ఇస్తారని భావిస్తున్నాను. అటు అధికార పక్షానికి, ఇటు ప్రతిపక్షానికి వారధిగా మీరు ఉంటారు. మీరు ఒక రాజకీయ పార్టీనుండి వచ్చినప్పటికీ కూడా మన రాజ్యాంగంలో, మన వ్యవస్థలో ఇది కరెక్ట్ కాదేమో కాని, ఇప్పుడు మనకు ఉన్నటువంటి వ్యవస్థలో ఒక పార్టీనుండి వచ్చినటువంటి వ్యక్తిని శాసన సభాపతిగా కాని, శాసన మండలి ఛైర్మన్‌గా గాని ఎన్నుకునేటువంటి పద్ధతి మనకుంది. దానిని మనందరమూ గౌరవిస్తున్నాం. అదే ప్రక్రియలో మనం చేసుకుంటున్నాం. ఎప్పుడైతే తమరు ఆ స్థానంలో కూర్చున్నారో, అప్పుడే మీరు అన్నీ మర్చిపోవాల్సిన అవసరం ఉంటుందని నేను అనుకుంటున్నాను. అదే విధంగా సభను కూడా నడిపిస్తారని నేను భావిస్తున్నాను.

పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి సభ్యునికి చెప్పుకునే సమయం, అవకాశం కల్పించాలని కోరుతున్నాను. అధికార పక్షానికి ఐదు నిమిషాలు ఎక్కువ సమయం ఇచ్చి, ప్రతిపక్షముని నాలుగు నిమిషాలు తక్కువ సమయం ఇచ్చేటువంటి అవకాశం ఉండకుండా

ప్రతి సభ్యుడు ఈ సభలో సభ్యుడని భావించి ప్రజలకు జరుగుతున్నటువంటి కష్టనష్టాలు చెప్పుకునేటువంటి వేదిక కాబట్టి నిష్పక్షపాతంగా అందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తారని నేను భావిస్తున్నాను. రాష్ట్రంలో శాసనసభ కంటే కూడా శాసన పరిషత్‌కు ఒక ప్రాధాన్యత ఉంది. శాసన పరిషత్‌లో మంచి విషయాల మీద చర్చ జరుగుతుంది. అధికార, ప్రతిపక్షం అనే భేదం లేకుండా చర్చ జరిగేటువంటి హుందాతనాన్ని కొనసాగిస్తారని నేను భావిస్తున్నాను. ఖచ్చితంగా అధికారంలో ఉన్నటువంటి సభ్యులు కొద్దిగా మీ మీద ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నటువంటి సభ్యుల నోర్లు నొక్కేటువంటి అవకాశం కూడా ఉంటుంది. తమరు అటువంటివాటికి లొంగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారనే విశ్వాసం మాకుంది. అటువంటి మీరు ఈ సభ యొక్క హుందాతనాన్ని ప్రజలకు చాటి చెబుతారని అనుకుంటున్నాను. శాసనసభ సభ్యులు కూడా మన సభ యొక్క హుందాతనాన్ని ఆదర్శంగా తీసుకునే విధంగా కొనసాగిస్తారనే పూర్తి విశ్వాసం మాకు ఉంది. ప్రజల సమస్యలు శాసన మండలిలో పూర్తిస్థాయిలో చర్చకు వస్తాయని ఆశిస్తూ, ప్రతిపక్ష పార్టీగా తెలుగుదేశం పార్టీ తరఫున మా పూర్తి సహాయసహకారాలు అందిస్తామని తెలియజేస్తున్నాను. ఈ గౌరవాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా ఈ ఛైర్‌కు గౌరవాన్నిస్తూ సహకరించడానికి సిద్ధంగా ఉంటామని మరొక్కసారి తెలియజేస్తూ, మీరు సభను సజావుగా, గౌరవంగా నడిపియాలని మనసార కోరుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

SRI SYED AMINUL HASAN JAFRI: (LOCAL AUTHORITIES) on behalf of the AIMIM, I congratulate the Hon'ble Chairman on his election today. This legislative Council is unique, in the sense that two of its Members had been associated with the Telangana movement. The 1st is Sri K.R. Amos, who was associated with Telangana movement during the year 1968 to 1971 and the 2nd is the Hon'ble Chairman himself, who was also associated with the movement for separate Telangana.

We have seen that the Telangana Bill that was introduced in the Parliament contained several aspects, which went against the interest of Telangana. Our party had suggested number of amendments to the Andhra Pradesh Reorganisation Bill, 2013 on order to secure and protect the interest of Telangana State. But, unfortunately, those amendments were not carried out and Telangana State which has been formed, has got certain infirmities, which need to be removed, for instance, the issue of transfer of 7 Mandals of Khammam District to the residuary State of Andhra Pradesh. This is a key issue. Then the sharing of

water resources, sharing of power generation and so many other issues are there, which are causing problems between the two States.

Another important issue is, as many as 85% of Telangana's population consists of Backward Classes, Scheduled Castes, Scheduled Tribes and Minorities. So, these sections are facing numerous problems and the TRS Government has announced, in the Governor's address to earmark allocation of Rs. 1 Lakh Crores for these sections over next five years. We hope that the issue of BCs, Minorities, Dalits and Girijans would be highlighted in this House and the Members of all the parties would be given equal opportunity to highlight the grievances of their constituencies, highlight the issues concerning the newly formed State and also the various programs which have to be effectively implemented to see that these sections are benefited and the Telangana State progresses.

جناب محمد سلیم (Sri Mohd.Salim): سب کو نمسکارم، سب کو السلام علیکم۔ سب سے پہلے ہمارے چیرمین صاحب کو دل و جان سے میں مبارک باد دیتا ہوں کہ بہت خوشی کی بات ہے کہ آج کا دن بہت اچھا دن ہے، کیونکہ چیرمین صاحب سے میری اپیل ہے کہ ہمارا کونسل ایسا چلنا چاہئے کہ discipline کے دائرہ میں ہو۔ Discipline کو جو بھی توڑتا ہو تو میرے حساب سے اس کو suspend کرنا چاہئے۔ میں ہو یا اور کوئی کو، اگر میں بھی discipline کو توڑتا ہوں تو suspend کرنے کا قانون اپنے پاس لے کر آتا ہے اور اس کو strictly follow کرتا ہے۔ یہاں پر discipline سے ایک دوسری کا respect کرنا ضروری ہے، کیونکہ یہ کونسل ہے، کونسل میں discipline سے بات کریں کیونکہ یہ live ہوتا ہے اور عوام بھی دیکھتی ہے۔ ہم لوگ آپس میں ایک دوسری کو کچھ بولیں گے تو باہر پبلک میں یہ چیز جائے گی، ہم صحیح رہیں تو عام پبلک کو بھی سدھار سکتے۔ دوسری بات یہ ہے کہ ہمارے ساتھی سریتو اس صاحب کرنٹ کے بارے میں بات کر رہے تھے۔ دس سال سے کانگریس کی حکومت ہے، کانگریس نے کیا کیا؟ دس سال سے کرنٹ اور پانی سے سلسلہ میں کانگریس حکومت بدعنوانی میں لت پت ہے۔ شبیر علی صاحب بھی بہت کچھ کہے ہیں، میں بولنا نہیں چاہتا میرے پاس اس کا پورا ریکارڈ ہے۔ جب وقت آئے گا تو ہم بتائیں گے کہ ہم کو کیا کرنا ہے، کیونکہ ایک دوسرے پر کیچڑ اچھالنا اچھی بات نہیں ہے۔ یہ لوگ دس سال سے آج تک حج ہاؤز کو کنٹرول نہیں کروائے، دس سال تک ان کی حکومت تھی، بول رہے ہیں کہ افطار اور نماز کے وقت کرنٹ چلا جا رہا ہے۔ اب تو کے سی آر صاحب نے جیسی میٹنگ بلوائی، آج تک ویسی میٹنگ کسی نے بھی نہیں بلوائی۔ کے سی آر صاحب نے بونال اور رمضان کے لئے میٹنگ بلوا کر ایک اچھا کام کیا۔ ان چیزوں کو strictly follow کیا جا رہا ہے، پورے اچھے طریقہ سے صاف صفائی بھی چل رہی ہے۔ کانگریس والوں نے دس سال میں حیدرآباد کو پچاس سال پیچھے کر دیا۔ کانگریس جب بھی آتی، یہ لوگ corruption سے ہٹ کر کوئی کام ہی نہیں کرتے۔ دوسری بات یہ ہے کہ میری آپ سے ایک ہی گزارش ہے کہ discipline کے دائرہ میں چلیں، کونسل discipline کے دائرہ میں چلنا چاہئے، جو بھی discipline توڑتا ہے، میں ہوں یا کوئی اور ہو، جو بھی discipline توڑتا ہے، تو آپ اس کو suspend کر دیں، کیونکہ discipline نہیں توڑنا چاہئے، discipline کے دائرہ میں رہ کر کام کرنا چاہئے۔ اور سب کو میری طرف سے مبارک باد۔

డా. కె.నాగేశ్వర్ : (రంగారెడ్డి, మహబూబ్‌నగర్ & హైదరాబాదు) అధ్యక్షా, మీరు తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్‌కు తొలి అధ్యక్షునిగా ఎన్నికైనందుకు తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్తులో ఏకైక స్వతంత్ర్య సభ్యుడిగా తమరిని హృదయపూర్వకముగా అభినందిస్తున్నాను. మీ నాయకత్వంలో తెలంగాణ శాసన పరిషత్తు కొత్త ఒరవడిని, కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పి దేశంలోనే ఈ పెద్దల సభ ఆదర్శం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

అధ్యక్షా, మీకు తెలుసు. మీతో ఉన్న వ్యక్తిగత మైత్రి, మీతో ఉన్న వ్యక్తిగత అనుబంధం కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. 2009వ సంవత్సరంలోనే నేను శాసన పరిషత్తుకి పోటీ చేసినప్పుడు తెలంగాణ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడిగా మిగతా అనేక ఉద్యోగ సంఘాలతోపాటు మీరు నాకు మద్దతునిచ్చి నా గెలుపులో సహకరించారు. అందువల్ల సహజంగానే మీ ఎన్నిక వ్యక్తిగతంగా కూడా నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మీరు ఆ ఉద్యమ పర్యవసానంగా వచ్చిన ఈ రాష్ట్ర శాసన పరిషత్తుకు ఛైర్మన్ కావడమనేది ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కూడా గౌరవాన్ని ఇచ్చినట్లు అవుతుంది. అందువల్ల ఆ రకంగా చూసినా మీ ఎన్నిక చాలా సంతోషకరం. మీ నాయకత్వంలో నేను ఒక విషయాన్ని కోరదలచుకున్నాను. మన భారత రాజ్యాంగంలో ఉన్నటువంటి మూడు స్థంభాలైన Executive, Legislature and Judiciary. Executiveని, Legislatureకి accountable చేయాలి. Accountable చేయడం అంటే నిలదీయడమని కాదు. జవాబుదారీగా ఉంచడం. Theory of separation of powers అని అంటాం. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, దీనిని basic structural constitution అని అన్నది. అంటే భారత పార్లమెంటు కూడా సవరించడానికి వీలు లేని రాజ్యాంగ మౌలిక స్వరూపంలో ఒక భాగంగా చేర్చారు. ఎందుకంటే.. చాలా కాలంగా గత ఏడేళ్లుగా చూశాను. Executiveని పూర్తి స్థాయిలో accountability చేయడంలో Legislature ఆ పాత్రను నూటికి నూరు శాతం నిర్వహించలేకపోతోంది. అందువల్ల మీ నాయకత్వంలోనైనా ఆ Executiveకు Legislatureకు ఉండే Constitutional responsibility నిలబడాలని ఆశిస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు నీటి పారుదల శాఖ గురించి మాట్లాడుతూ ఒక మంచి మాట చెప్పారు. We have to reinvent Telangana.

నా కోరిక ఏమిటంటే.. మీ నాయకత్వంలో We have to reinvent Telangana Legislature Procedures. ఒక చిన్న ఉదాహరణ. నేను చాలా కాలంగా అడుగుతున్నాను. ప్రపంచమంతా Information Technologyతో అభివృద్ధి

చెందుతోంది. Information Technologyతో అభివృద్ధి చెందుతూ, ప్రపంచమంతా ఇ-ప్రభుత్వాలుగా మారుతున్నప్పటికీ, మన శాసన పరిషత్తు మాత్రం ఇంకా పాత పద్ధతిలోనే నడుస్తోంది. వాయిదా తీర్మానం ఇవ్వాలంటే ఉ.8.30 గంటలకంటే ముందు అంటే ఉదయం ఎనిమిది గంటలకు వచ్చి తీర్మానం ఇవ్వాలి. ఏమి? ఇ-మెయిల్ లేదా? మెయిల్ పంపరాదా? ప్రశ్నలు నేరుగా అడుగరాదా? అధ్యక్షా. దీనిని మార్చండి. మీ నాయకత్వంలో తొలి ప్రయత్నంగా పూర్తిగా e-legislatureగా తెలంగాణ శాసన పరిషత్‌మండలి procedures నడవాలనేది నా మొదటి కోరిక. దీంతో ఒక Progressive రాష్ట్రంగా, తెలంగాణాని భారత దేశంలో project చేయడానికి ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్ర తొలి శాసనపరిషత్ కంప్లీట్‌గా ఇ-లెజిస్లేచర్‌గా రూపాంతరం చెందాలి. దీనికి వారం, పది రోజులకన్నా ఎక్కువ సమయం పట్టదు.

రెండవది, నేను గత ఏడేళ్లుగా శాసన పరిషత్తులో ఉన్నాను. చర్చల నాణ్యత విషయంలో కొంత సంతృప్తి ఉన్నా చాలా అసంతృప్తి మిగిలింది. అందువల్ల చర్చల విషయంలో నాణ్యత పెంచడానికి సభ్యులకు ఒక రకమైనటువంటి శిక్షణ అవసరం. అందరికి అవకాశం ఉండకపోవచ్చు. నా కొరకు అడగడం లేదు. నేను చదువుకోగలుగుతాను, అధ్యయనం చేయగలుగుతాను. చాలా మంది సభ్యులు కూడా చేయగలుగుతారు. కాని అదే సమయంలో, ఒక రీసెర్చ్ సపోర్టు కూడా ఉండాలి. విచిత్రం ఏమంటే, ఒక ఉపాధ్యాయుడికి శిక్షణ ఉంటుంది, ఒక నర్సుకి శిక్షణ ఉంటుంది, ఒక డాక్టరుకు శిక్షణ ఉంటుంది. దేశంలో శిక్షణా లేనిదంటే కేవలం ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకే. అందువల్ల Telangana Legislative Knowledge Network లేదా Telangana Legislative Knowledge Research Serviceతో ప్రారంభించండి. ఒక చట్టంపైన గాని, ఒక సబ్జెక్ట్‌పైన గాని సభ్యులకు కావాల్సిన సమగ్రమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచే సర్వీస్ కావచ్చు. నాకున్న అనుభవంతో మీకు సహకారాన్ని అందజేస్తాను. రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చులో ఇది చాలా negligible. కాని, లెజిస్లేటీవ్ స్టాండర్డ్స్ చాలా గణనీయంగా పెరుగుతాయి. అనేక చట్టాలు వచ్చాయి. Property Tax చట్టం వచ్చింది. Property Tax బోర్డును పెట్టాలని చట్టం వచ్చింది. దీనిపై ఎంతమందికి అవగాహన ఉంది? అందరికి అవగాహన ఉండాలనే రూల్ ఏమి లేదు కదా. ఆ చట్టం ఎందుకు వచ్చింది అనే విషయంపై దేశ, విదేశాల్లోని అనుభవాలు, సమగ్ర సమాచారం సభ్యులకు మనం అందజేస్తే, సభ్యులు తమ దృక్పథంతో ఏమైనా మాట్లాడుకుంటారు. అందువల్ల Telangana Legislative Knowledge Network లేదా Telangana Legislative Knowledge Research Serviceను ప్రారంభించాలి. దీనికి తక్షణం మీరు చర్యలు తీసుకోవాలి.

చివరగా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు. గత శాసనసభ, శాసన పరిషత్తులో గత సంవత్సరం ఆదరాబాదరాగా పెట్టారు. పార్లమెంటరీ కమిటీలు ఒక మంచి సంప్రదాయం. Parliamentary Standing Committees వల్ల మరింత effective గా, అంటే శాసనసభ, శాసన పరిషత్తు Scrutiny ఉంటుంది. పొలిటికల్ సభలుగా నడుస్తాయి. స్టాండింగ్ కమిటిల్లో సబ్జెక్ట్ పరంగా చర్చ జరుగుతుంది. అందువల్ల తెలంగాణ రాష్ట్రంలో కూడా స్థాయి సంఘాలు, Standing Committeesను మీరు పునరుద్ధరించాలి, వాటిని కొనసాగించాలి. శాసన సభాపతి గారితో కూడా తమరు మాట్లాడి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఒక రకంగా తెలంగాణ లెజిస్లేచర్ అనేది భారత దేశంలోనే ఒక ఆదర్శ సభగా, భారతదేశంలోనే ఒక ప్రొగ్రేసీవ్ లెజిస్లేచర్‌గా, భారతదేశంలోనే ఒక Reinvent అయినటువంటి లెజిస్లేచర్‌గా ఉండాలి. ఆ రకమైనటువంటి లెజిస్లేచర్ స్టాండర్డ్స్ మీ నాయకత్వంలో జరగాలని, పెద్దల సభ ఔన్నత్యం ఇనుమడించాలని కోరుకుంటూ మరొక్కసారి మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

1.20 మ. శ్రీ ఈటెల రాజేందర్ : అధ్యక్షా, తెలంగాణా రాష్ట్రంలో పెద్దల సభకు మొట్టమొదటి ఛైర్మన్‌గా ఎన్నికయినందుకు సంతోషంగా, సంబురంగా మనస్ఫూర్తిగా మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ గురించి చెప్పాలంటే సమయం సరిపోదు, అంత గొప్ప చరిత్ర కలిగినవారు మీరు. బాల్యంలోనే 1969వ సంవత్సరంలో ఉద్యోమంలో పాల్గొని, తుపాకి తూటా శరీరంలో దూసుకుపోయిన చరిత్ర కల వ్యక్తి మీరు. ప్రపంచంలోనే ఒక గొప్ప ప్రజా ఉద్యమం కేసిఆర్ గారి నాయకత్వంలో కొనసాగితే, ఆ ఉద్యమంలో కేసిఆర్‌గారికి కుడి భుజంగా ఉండి, ఆయనను ముందుకు వెళ్ళమని, ఆయన వెంట మేమంతా ఉంటామని చెప్పి, గొప్ప స్ఫూర్తినిచ్చి, ఆ ప్రజాఉద్యమాన్ని, సకల జనుల సమ్మెను నడిపించిన గొప్ప ఉద్యమకారులు మీరు. ఆ ఉద్యమంలో సమైక్యాంధ్ర రాష్ట్రం కుట్రపన్ని మిమ్మల్ని చంపే ప్రయత్నం చేసిన సందర్భం కూడా మేము ఇప్పటికీ మరచిపోలేము. ఈరోజు సరిగ్గా ఈ రాష్ట్రం ఏర్పడి నెలరోజులు కావస్తోంది. గౌరవ ముఖ్యమంత్రిగారు బాధ్యతలు తీసుకుని కూడా సరిగ్గా నెలరోజులవుతోంది. ఒక మాటలో చెప్పాలంటే, ఈ ప్రభుత్వం ఒక ఉద్యమ నెలబాలుడిలా ఉంది. కేసిఆర్‌గారు ఒక ముఖ్యమంత్రిగా తెలంగాణా ప్రజానీకాన్ని చూశారు. కానీ, కేసిఆర్‌గారిలో ఉన్న మరో కోణం ఆయన మాటకు, ఆచరణకు ఎంత పోలిక ఉంటుందో, ఎంత దగ్గరగా ఉంటుందో, ఆలోచించినటువంటి సందర్భం గడచిన నెలరోజులలోపే ఏమిటనేది ఈరోజునే అర్థమయింది. తెలంగాణా రాష్ట్రమనేది అణగారిన వర్గాలకు అండగా ఉంటుంది. అణగారిన వర్గాలను నిలబెట్టడంలో వాస్తవం ఉంటుందనే అంశాన్ని నిలబెట్టినటువంటి వ్యక్తి కేసిఆర్‌గారే. దానికి అనుగుణంగా మొట్టమొదటగా తెలంగాణా రాష్ట్రంలో శాసనసభలో

తొలి స్పీకర్‌గా బలహీనవర్గాలకు సంబంధించిన వ్యక్తిని, అలాగే, శాసనపరిషత్‌లో కూడా బలహీనవర్గాలకు సంబంధించిన వ్యక్తినే మొట్టమొదటగా ఛైర్మన్‌గా నిలబెట్టి తన మాటను ఆచరణలో పెట్టిన ఘనత కూడా గౌరవ ముఖ్య మంత్రివర్యులు శ్రీ కె. చంద్రశేఖరరావు గారే అధ్యక్ష.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఒకరోజు, అనేక డిపార్టుమెంట్ల వారీగా సమీక్షలు జరుగుతున్నప్పుడు సంక్షేమం మీద వారు సమీక్ష చేసినప్పుడు నేను కూడా అక్కడ ఉన్నాను. ఆ సంక్షేమాల విషయంలో వారు నా ప్రభుత్వం యొక్క మొట్టమొదటి ఎజెండా పేద ప్రజానీకానికి న్యాయం చేసేవిధంగా, 66 సంవత్సరాల ఈ స్వతంత్ర్య దేశంలో 57 సంవత్సరముల సమైక్య రాష్ట్రంలోని ఆ ప్రజానీకానికి చెందింది చాలా తక్కువని అన్నారు. అందుకే, నేను ఖచ్చితంగా ఆ ప్రజలకు సంక్షేమాన్ని తీసుకువస్తానని చెప్పి వారు సమీక్ష పెట్టినప్పుడు అధికారులు పాత పద్ధతిలో ఇది ఇలా కాదు, అలా కాదని మాట్లాడుతున్నప్పుడు వారు ఒకటే చెప్పారు – ఈ సభ, ఈ చట్టాలు ఉన్నవి కేవలం ప్రజా సంక్షేమం కోసమేనని, అవసరమైతే, ఎన్నిసార్లయినా శాసనసభను కానీ, శాసనమండలిని కానీ మేము సమావేశపరుస్తాము. ప్రజావసరాలకోసం చట్టాలను కూడా మారుస్తామని ఆయన చెప్పినప్పుడు ఈ ప్రభుత్వాన్ని, మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రిగారికి పేదప్రజల సంక్షేమం పట్ల ఏ కమిట్‌మెంట్ ఉందో మనకర్థమవుతుంది. తెలంగాణా ఉద్యమంలో మీరు కానీ, మేము కానీ, సమైక్యరాష్ట్రంలో అన్యాయం జరుగుతోందని చెప్పాము. కానీ, ఈ రోజు పరిపాలనకు వచ్చిన తరువాత ఆనాడు చెప్పినదానికన్నా కూడా మన తెలంగాణా రాష్ట్రానికి, తెలంగాణా ప్రజానీకానికి ఇంకా ఎక్కువ అన్యాయం జరిగిందని మనకర్థమవుతోంది. కనుక శాసన పరిషత్‌లో ఉన్నటువంటి గౌరవ సభ్యులు శ్రీ కె.ఆర్. అమోస్‌లాంటి గొప్ప అనుభవజ్ఞులు, తెలంగాణ ఉద్యమ బిడ్డ శ్రీ కొంపల్లి యాదవరెడ్డిలాంటి అనేకమంది ఇక్కడ సభ్యులుగా ఈ పెద్దల సభలో ఉన్నవారు ప్రజాభిప్రాయాన్ని అనుసరించాలి. ప్రజాభిప్రాయలకు అనుగుణంగా రాజకీయ వ్యవస్థ ఉండాలని గొప్ప ఆలోచనతో ఉండాలి. రేపు అనేక రకాల ఇబ్బందులు, సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది. ఇల్లు అలకగానే పండగ కాదు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుతోనే అన్ని సమస్యలు పరిష్కారం కావు. ఇంకా అనేక సమస్యలు దాగి ఉన్నాయి. వాటన్నింటినీ పూర్తిస్థాయిలో ప్రజలకు మాత్రమే కాకుండా, ప్రజలకు నాయకత్వం వహిస్తున్నటువంటి శాసన పరిషత్‌కు, శాసనసభకు కూడా ఉంది కాబట్టి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఆ కుట్రలన్నింటినీ తిప్పికొడదామనే ఒక గొప్ప నిర్ణయంతో ఈరోజు మిమ్మల్ని ఆ కుర్చీలో కూర్చోబెట్టినట్లుగా మేము భావిస్తున్నాము.

ఈరోజు సుదీర్ఘమైన చర్చ జరిగింది. మనమందరం రేపటి బంగారు తెలంగాణా నిర్మాణంలో శాసనసభ, శాసనపరిషత్‌లు ప్రజాస్వామ్య వేదికగా, ప్రజాభిప్రాయాన్ని, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా గొప్పగా ఉపయోగపడతాయని భావిస్తున్నాను. అంతేగాకుండా, ఈ వేదిక ఒక గొప్ప దిక్సూచిలా ఉంటుందని, ఆ దిక్సూచిలు ఉన్న ఈ శాసనపరిషత్‌కి మీరు గొప్ప న్యాయం చేకూరుస్తారని చెప్పి, ప్రభుత్వ ఆలోచనలు, గౌరవ ముఖ్యమంత్రిగారి ఆలోచనలు కూడా ప్రతిబింబించే పద్ధతిలో మీరు ఈ సభను నడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈరోజు తెలంగాణా రాష్ట్రంలో శాసనపరిషత్‌కి తొలి ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మనసారా అభినందిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. వెంకటేశ్వర్లు : (అసెంబ్లీ) అధ్యక్షా, ఈరోజు చాలా శుభదినం. ప్రధానంగా ఈ తెలంగాణా రాష్ట్రంలో తొలి శాసనపరిషత్ ఛైర్మన్‌గా మీరు ఎన్నిక కావడం, బడుగు బలహీనవర్గాలకు ఒక సంతోషకరమైన విషయమని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈరోజు శాసనసభలో కూడా స్పీకర్‌గా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి ఉండడం, అలాగే తరువాత జరిగిన ఈ శాసనపరిషత్ ఛైర్మన్ ఎంపికలో కూడా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తినే ఎన్నుకోవడం చాలా సంతోషం. ఒక సామాన్యకుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి, ఉద్యోగం చేసుకుంటూ ఎన్నో పోరాటాలు చేశారు. ఈరోజు తెలంగాణా పోరాటంలో ఒక ఉద్యమకారుడిగా మీరు పనిచేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో త్యాగాలు, అవమానాలను భరించిన వ్యకి మీరు. ఎందుకంటే, మీరు ఈ తెలంగాణా కావాలనే కాంక్షతోనే కేసిఆర్‌గారి నాయకత్వంలో పనిచేసినటువంటి వ్యక్తి. ప్రధానంగా, ఈ శాసనమండలికి చాలా గౌరవం ఉంది. గతంలో శాసనసభలో కొన్ని రోజులపాటు అవాంతరాలు వచ్చి సభ వాయిదా పడ్డా, శాసనమండలిలో చర్చలు ఫలప్రదంగా చాలా చక్కగా నడిచాయి. ఒకరోజు ముఖ్యమంత్రిగారు ఇదే సభలో కూర్చుని మాట్లాడారు. ఆ తరువాత ఆయన బయట కూడా మాట్లాడారు. నేను ఈ కౌన్సిల్ సమావేశాలు చూడడమే కాకుండా, విద్యార్థిగా ఉన్నప్పుడు కూడా ఈ కౌన్సిల్ యొక్క చర్చలను వింటూ ఉండేవాడిని. గతంలో ఈ సభలో శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారి లాంటి వ్యక్తులు కూడా గంటలు గంటలు మాట్లాడిన సందర్భాలలో మొత్తం ఈ సభ అంతా నిండిపోయేది. అటువంటి ఘన చరిత్ర కలిగినది ఈ కౌన్సిల్. గత కొంతకాలంగా ఈ కౌన్సిల్ ఉండదనే దుష్ప్రచారం కూడా జరిగింది. అయినప్పటికీ కూడా ఈ తెలంగాణా రాష్ట్రంలో కౌన్సిల్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. ఇది చాలా చక్కగా జరగవలసినవసరం ఎంతైనా ఉంది. చర్చలు జరగడానికి కూడా అవకాశం ఉంది. ఇంతకుముందే పెద్దలు చెప్పినట్లుగా ఎవరైనా ఈ రూల్సుకు వ్యతిరేకంగాను మరియు సభను అవమానపరచే విధంగా చేస్తే, సహించవద్దని కూడా తమరికి నేను విన్నవించుకుంటున్నాను.

ఇక ప్రధానంగా చూసినట్లయితే, కౌన్సిల్ ద్వారా కూడా ఎన్నో బిల్సు వస్తూ ఉంటాయి. కానీ, ఎక్కువశాతం శాసనసభ నుంచే శాసనమండలికి వస్తాయి. గతంలో న్యాయ విశ్వవిద్యాలయానికి సంబంధించి మనం బిల్లును శాసనమండలి ద్వారానే పాస్ చేసుకోవడం జరిగింది. అలాంటి సాంప్రదాయాన్ని కొనసాగించవలసిందిగా నేను ఈ సందర్భంగా మీకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. అలాగే, ఈ విషయాన్ని మీ ద్వారా గౌరవ శాసనసభ వ్యవహారాల మంత్రికి కూడా తెలియజేస్తున్నాను. ఈ సభ ద్వారా బిల్లులు పాస్ అయితే ఈ సభకు కూడా గౌరవం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత మనం బంగారు తెలంగాణాను ఏర్పరచుకోవలసినవసరం ఉంది. ఈ తెలంగాణా కోసం ఎంతోమంది అమరులయ్యారు. ఈ తెలంగాణా రాష్ట్రం రావడం కోసం అన్ని రాజకీయపార్టీలు ఉద్యమాలు చేశాయి కానీ, ఆ ఉద్యమ ఫలితాలు కొంతమందికి దక్కలేదు. ఈరోజు తెలంగాణా పోరాటం చేసిన నిజమైన వ్యక్తి కేసిఆర్‌గారేనని చెప్పడం వలననే అందరూ కూడా ఆయనను ఆహ్వానించడం జరిగింది.

(సభ్యులు బల్లలు చరిచారు.)

అందరూ కూడా ఆయనను హర్షించడం జరిగిందని తెలియజేస్తూ, ఈ బంగారు తెలంగాణా ఏర్పాటు కొరకు మనం ఎలాంటి అరమరికలు లేకుండా, బంగారు తెలంగాణాను ఏర్పాటు చేసుకోవలసినవసరం ఎంతైనా ఉంది. ఈరోజు పెద్దలు శ్రీ డి. శ్రీనివాస్‌గారు మాట్లాడుతూ, ఎందుకు ఇంత తొందరగా ఎలెక్షన్ అని అన్నారు. అయ్యా! ఛైర్మన్ ఎన్నిక కొరకు ఎన్నిక గురించి ఇలా మాట్లాడుతుంటే ఏమైనా అర్థం ఉందా అని అడుగుతున్నాను. ఒక బడుగు, బలహీనవర్గానికి చెందిన వ్యక్తి ఈరోజున ఛైర్మన్‌గా ఎన్నుకోబడితే మీరు వాళ్ళని అభినందించాలి.

(సభ్యుల హర్షధ్వానాలు)

అటువంటి వ్యక్తులను మీరు హర్షించవలసిందిపోయి ఆ రకంగా ఎందుకు తొందర, ఎందుకు తొందర అని అన్నారు. ఈరోజు తెలంగాణా రాష్ట్రంలో మంచి పరిపాలన చేసుకోవలసినవసరం ఉంది. అలాగే మనకు డెప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న వారే ఇన్‌ఛార్జ్ ఛైర్మన్‌గా ఉన్నారు కాబట్టి, ఈరోజున ఛైర్మన్‌ను ఎన్నిక చేసుకోవలసిన బాధ్యత మనపైన ఉన్నది. అంతేగాకుండా, ఒక గౌరవప్రదమైన సీటును భర్తీ చేసుకోవడం ఒక మంచి సాంప్రదాయం. అటువంటి సాంప్రదాయాన్ని ఈనాడు తుంగలో తొక్కినట్లుగా ఎందుకు తొందర అంటున్నారు. అసలు ఈ శాసనమండలిలో తమరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే గతంలో ఉన్న సాంప్రదాయాల గురించి

కూడా చాలామంది మాట్లాడారు. గతంలో ఛైర్మన్ ఎన్నిక జరిగినప్పుడు ప్రభుత్వం ఎవరి పేరు చెపితే, వారే ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మేము కూడా చూశాం. ఎన్నికలు ఎక్కడా జరగలేదు. మేము చూస్తుండగానే ఆంధ్రప్రదేశ్‌లో ఛైర్మన్‌గారు దిగిపోయి, తిరిగి మళ్ళీ ఆయనే ఛైర్మన్‌గా వచ్చి ఆ కుర్చీలో కూర్చున్నారు. ఏ ఎన్నిక జరగలేదు. అప్పుడు ఈ ప్రశ్న ఏమైందని నేను మీ ద్వారా గౌరవ సభ్యులు శ్రీ డి. శ్రీనివాస్‌గారిని అడుగుతున్నాను. మీరు ఉన్నప్పుడు రూల్సు ఏమీ లేవు. ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చింది. ఈరోజు బంగారు తెలంగాణాను సాధించుకునే ప్రయత్నంలో భాగంగా, ఇటువంటి చక్కటి కార్యక్రమాలు చేసినప్పుడు మనం హర్షించాలి. మీరు హుందాగా వ్యవహరించి యునానిమస్‌గా ఛైర్మన్‌గా ఎనుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిమీద ఉందని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎప్పుడు కూడా ఎన్నికలు జరగలేదు. ఎందుకంటే, బలహీనవర్గాలకు సంబంధించి వ్యక్తి శ్రీ కె. స్వామిగౌడ్‌గారిని ఛైర్మన్‌గా ఎన్నుకుంటున్నారనే విషయం ఈరోజున అందరికీ తెలిసిపోయింది. అలాగే మన దగ్గర స్పీకర్‌గారిని, డెప్యూటీ స్పీకర్‌గారిని కూడా యునానిమస్‌గా ఎన్నుకున్నాం. అంతకంటే, ఉత్తమమైన కౌన్సిల్‌లో కూడా యునానిమస్‌గా ఎన్నుకుంటే ఎన్నుకుని, ఆయనను కుర్చీలో కూర్చోపెడితే మీకు ఎంతో సంతోషంగాను, గౌరవంగా ఉండేది. అలాగే ఈ శాసనసభకు కూడా హుందాగా ఉండేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే అధికార పార్టీకి శాసనసభలో మెజారిటీ ఉంది, అలాగే శాసనమండలిలో కూడా ఉండవలసినవసరం ఉంది. అలాగే, ఈ బంగారు తెలంగాణా కోసం టిఆర్ఎస్ రాష్ట్రం ఏర్పడింది. అందుకొరకు పరిపాలనలో ఎటువంటి అడ్డంకులు లేకుండా ఉండాలని ఈరోజు మేము మద్దతు తెలియజేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. కాబట్టి, ఇప్పటికి కూడా మనకు కొన్ని సమస్యలున్నాయి. ఈరోజు ఎన్నో అవసరాలు ఉన్నాయి, అలాగే మనకున్న విద్యుత్ కొరతకు సంబంధించి ఎన్నో ఆటంకాలను సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 80 శాతం మందివరకూ బడుగు, బలహీనవర్గాలకు సంబంధించినవారున్నారు. అందుకనే ముఖ్యమంత్రిగారు వెల్ఫేర్ శాఖలన్నీ కూడా తన దగ్గరే పెట్టుకున్నానని, ప్రత్యేకంగా వాటినన్నింటిని అమలుచేసే బాధ్యత తీసుకుని, వాటిని అమలుచేస్తానని చెప్పడం జరగడంతో ఆ రోజు మేము హర్షం వ్యక్తం చేయడం కూడా జరిగింది.

**1.35 మ.** ఎందుకంటే, ఈ రోజు చాలా మంది అవస్థల్లో ఉన్నారు. తెలంగాణా రాష్ట్రంలో సమస్యలు చూస్తే, వర్షాలు లేవు. ఇంకా తీవ్రమైన ఇబ్బందులున్నాయి. ఎన్నో కష్టనష్టాలున్నాయి కాబట్టి మనం ప్రభుత్వానికి సహకరించాలి. ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఏ విషయం వచ్చినా కూడా రండి, అఖిలపక్షం కూర్చుందాం. అఖిలపక్ష భేటీలో చర్చిద్దాం.

మంత్రి వర్గమే కాదు, అఖిలపక్షాలను కూడా ఇవాళ అన్ని విషయాల్లో సంప్రదించడం జరుగుతోంది. కాబట్టి, అటువంటి సత్‌సంప్రదాయానికి నెల రోజుల్లోనే శ్రీకారం చుట్టారు. నిన్నటితో నెలయ్యింది. వారు ప్రమాణ స్వీకారం చేసింది జూన్, 2 వ తేదీన. మళ్లీ ఇవ్వాళ 2 వ తేదీనే ఛైర్మన్‌గా మీ ఎన్నిక జరిగింది. అది యాధృచ్ఛికంగానైనా ఒక శుభ సూచకమని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆ రకంగా ఇవాళ వారు అన్ని పార్టీలను కాన్ఫిడెన్స్‌లోకి తీసుకుని, పరిపాలన చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రతిపక్షాల ఆలోచనల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి, వారి మాటల్ని కూడా వినాలి. ఫీజు రీఇంబర్స్‌మెంట్ విషయంలో కూడా ఆల్‌పార్టీ మీటింగ్‌కు పిలవడం జరిగింది. అందరూ కూడా మాట్లాడటం జరిగింది. డి.శ్రీనివాస్ గారు కూడా వచ్చారు. వారు కూడా మాట్లాడటం జరిగింది. నేను కూడా అక్కడ ఉండి మాట్లాడాను. అంటే ఒక మంచి సాంప్రదాయాన్ని ముఖ్యమంత్రి గారు అవలంభిస్తున్నారు. ఆ రకంగా మనమందరం కూడా ఇప్పటికైనా విభేదాలు మరచిపోయి, తెలంగాణాను సాధించుకున్నాం. ఈ తెలంగాణా కొరకు పకడ్బందీగా ఎవ్వరూ కూడా భేషజాలకు పోకుండా, ఒక మంచి తెలంగాణా నిర్మాణం కొరకు పాటుపడాల్సిందిగా ప్రతిఒక్కరికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు చెబుతూ, ఒక బడుగు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులుగా అక్కడ శాసన సభాపతికి, ఇక్కడ ఛైర్మన్‌గా మీకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, మిమ్మల్ని అభినందిస్తున్నాను. జైహింద్.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డిః అధ్యక్షా, అనేక పోరాటాల అనంతరం తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక, ఈ రాష్ట్రంలో అత్యున్నతమైనటువంటి స్థానం శాసనపరిషత్తు ఛైర్మన్. ఈ రోజు మీరు శాసనపరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంలో మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నాను. మరొక గొప్ప విషయమేమిటంటే, తెలంగాణా ప్రజలు కోల్పోయినటువంటి అంశాలను ముఖ్యమంత్రి గారు పునర్నిర్మాణమనే అంశంతో ముందుకు వెళుతుంటే, ఈ రోజు నిండు సభ పెద్దల సభ అందరూ కలిసి పునర్నిర్మాణమనేది కేసీఆర్ వల్లనే సాధ్యపడుతుంది. వారు సంపూర్ణ మద్దతు ఇస్తేనే న్యాయం జరుగుతుందనే మంచి సహృదయంతో తమర్ని ఎన్నుకోవడానికి నిండు మనస్సుతో సహకరించిన ప్రతిఒక్కరికీ నేను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే, మంచి సాంప్రదాయం. రాఘవ రెడ్డి గారు మాట్లాడారు, ఇంకా అనేకమంది పెద్దలు మాట్లాడారు. ఇదొక మంచి సాంప్రదాయం. ఇక్కడ గాని, అక్కడ గాని, రాష్ట్రంలో గాని మిగతా సభ్యులు కూడా తెలంగాణా రాష్ట్రాభివృద్ధిలో మనమందరం సహకరించుకుని, తెలంగాణా ప్రజల రుణాన్ని తీర్చుకుందాం. తెలంగాణా

తల్లి ఎంతో సంతోషపడుతోంది. నా బిడ్డలు అందరూ ఏకమై నా కోసం పాటుపడుతున్నారని మన తల్లి ఎంతో ఆనందపడుతోంది. ఈ శుభ సందర్భంలో తమరు అత్యున్నత స్థానంలో మీరు కూర్చోవడం తెలంగాణా ప్రజలకే గర్వకారణం. అందులోనూ మీరు తెలంగాణా ఉద్యమ నేత. ఉద్యోగ సంఘాలకు నాయకత్వం వహించిన వ్యక్తి. మీరు చిన్న మనిషి కాదు. తెలంగాణాలోని నాలుగు కోట్లమందికి, అందులోనూ నాలుగు లక్షల మంది తెలంగాణా ఉద్యోగులకు నాయకత్వం వహించారు. ఒక్కపిలుపుతో, ఒక్క స్టేట్‌మెంట్‌తో నాలుగు లక్షల మంది స్వామిగౌడ్ గారు ఏం చెబితే అది చేశారు. ఆ ఘనత మీకే దక్కింది. అలాంటి వ్యక్తి అయిన మీరు ఈ స్థానంలో కూర్చోవడం ఎంతో గర్వకారణం, ఆనందదాయకం. ఆనాడు మీరు ప్రభుత్వ ఉద్యోగిగా యాచించారు. ఇప్పుడు మీరు శాసించే స్థానానికి వచ్చారు. యాచించే స్థానం నుండి శాసించే స్థానానికి వచ్చారు. ఇది ప్రజాస్వామ్యం యొక్క గొప్పతనం. కాబట్టి, ఈ విషయంలో సహకరించిన ప్రతిఒక్కరికీ, ముమ్ముందు కూడా ఎంతో సహృదయంతో అన్ని పక్షాల నాయకులు, ఏ రకంగానైతే ఈనాడు సహకరించారో, అదేవిధంగా రేపు కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణా పునర్నిర్మాణంలోనూ సహకరించాలని కోరుకుంటూ, మరొక్క సారి మా తరఫున, సభ్యుల తరఫున అభినందనలు, శుభాకాంక్షలు తెలియపరుచుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి: అధ్యక్షా, తెలంగాణా రాష్ట్ర శాసన పరిషత్‌కు ప్రథమ అధ్యక్షునిగా ఎన్నికైనందుకు మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలంగాణా రాష్ట్రశాసన పరిషత్ ప్రథమ ఛైర్మన్‌గా ఏవిధంగా చరిత్రలో స్థిరస్థాయిగా ఉంటారో, మీ ఎన్నిక కూడా అదే విదంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. ఓటింగ్ ద్వారా ఏకగ్రీవంగా మీరు అధ్యక్షునిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గారు, సమాజానికి ఒక మెసేజ్ పంపే విధంగా మీ ఎన్నిక జరిగిందని కూడా నేను భావిస్తున్నాను. తెలంగాణా ఉద్యమంలో కీలకపాత్ర వహించి, తెలంగాణా రాష్ట్రంలో ఎలాంటి రాజకీయ నేపథ్యం లేనటువంటి వ్యక్తి, తెలంగాణాలో చిరుద్యోగిగా ఉండి, తెలంగాణా ఉద్యమంలో ఒక కీలకపాత్ర వహించిన వ్యక్తి ఈ విధంగా ఒక సామాన్య వ్యక్తి కూడా శాసన సభలో ఉన్నత స్థానాన్ని చేపట్టగలడనే మెసేజ్‌ని మీ ఎన్నికద్వారా ఈ సమాజానికి పంపినందుకు కేసీఆర్ గారికి కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఏది ఏమైనా 1969 తెలంగాణా ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పాలుపంచుకుని, బుల్లెట్ గాయాలు తిని, తదుపరి ఒక చిరుద్యోగిగా రాష్ట్రప్రభుత్వంలో చేరి, ఆ విధంగా తెలంగాణా ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని వెలికితీసే విధంగా టిఎన్‌జీఓల ఉద్యమ నాయకుడిగా ఉద్యోగుల హక్కుల గురించి పోరాటం చేసి, ఆ విధంగా సకల జనుల సమ్మెలో కూడా తెలంగాణా ఉద్యమంలో

కీలకపాత్ర వహించి, ఒక ఉద్యోగి ఈనాడు శాసన పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికైనందుకు ఒక ఉపాధ్యాయ ప్రతినిధిగా నేను కూడా సంతోషిస్తున్న విషయాన్ని మీకు తెలియజేస్తున్నాను అధ్యక్షా. ఈనాడు ఈ సమాజంలో ఉద్యోగి అయినాసరే, రాజకీయ నేపథ్యం లేనటువంటి ఒక సామాన్యుడు కూడా ఈ శాసన మండలి గర్వించే వ్యక్తిగా ఎదగగలుగుతాడు, ఎదుగుతాడనేది మీ ఎన్నికద్వారా ఈ సమాజానికి నిరూపితమయ్యిందని నేను భావిస్తున్నాను.

ఏది ఏమైనా, ఈనాడు తెలంగాణా ఉద్యమంలో కీలకపాత్ర వహించి, ఈనాడు ఒక ఉద్యోగస్తుడైనా, ఉద్యోగసంఘ నాయకుడైనా ఉద్యోగస్తుల హక్కుల గురించే పోరాటం చెయ్యాలి గానీ, రాజకీయ పరంగా మార్పు తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డప్పుడు మాత్రమే తెలంగాణాలోని ప్రజలకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని, ఆ విధంగా ఉద్యోగ నాయకుడిగా కాకుండా, ఉద్యమ నాయకుడిగా మీరు చేసిన సేవల్ని తెలంగాణా ప్రజలు ఎన్నటికీ మరువలేరు. దానికి తార్కాణం శాసన పరిషత్తు అధ్యక్షునిగా ఈ నాటి మీ ఎన్నిక. ఈనాడు తెలంగాణా ఉద్యమంలో కీలక పాత్ర వహించిన వ్యక్తైన మీరు శాసన పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికైనందుకు నిజంగా మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఏదేమైనా ఈనాడు చట్టసభల్లో మనది పెద్దల సభ. తప్పకుండా, ఆ పెద్దల సభ గౌరవాన్ని కాపాడుకునే విధంగా మన ప్రవర్తన కూడా ఉండాలనే విషయాన్ని తెలియజేస్తున్నాను. ఈ రోజు ఎన్నిక సందర్భంగా కొంతవరకు ఇబ్బందికర పరిస్థితులేర్పడ్డాయనేది వాస్తవం. అది తెలుసో, తెలియదో గానీ... పెద్దలు పెళ్లి నిర్ణయిస్తారు. పురోహితుడు ముహూర్తం నిర్ణయిస్తాడు. ఆ క్రమంలో పెద్దలు పెళ్లి నిర్ణయించారు, పురోహితుడు ముహూర్తం పెట్టాడు. ఎంగేజ్‌మెంట్ అయిపోయింది. ఈనాడు పెళ్లికొడుకైన తరువాత, పెళ్లి పీటల దాకా వచ్చాక పెళ్లి వాయిదా వేయమని అనడం ఎంతవరకు సమంజసమో ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరముంది. అందరికీ పెళ్లని తెలుసు. పెద్దలందర్నీ పిలిచుకున్నాము. కానీ, ఇక్కడి దాకా వచ్చాకవాయిదా వేయమని అనడం సబబు కాదు. ఏది ఏమైనప్పటికీ ఈనాడు ఒక సామాన్య వక్తి, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేనటువంటి వ్యక్తి కుటుంబానికి చెందిన వ్యక్తి చట్టసభల్ని శాసించే స్థానంలో కూర్చున్నందుకు నిజంగా నేను సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, మీ నేతృత్వంలో పెద్దల సభ గౌరవాన్ని పెంచే విధంగా, ఇంకా పెద్దల సభలో ప్రజా సమస్యలపై సవివరంగా చర్చించే విధంగా ఈ సభ నిర్వహింపబడుతుందని ఆశిస్తూ, మరొక్కసారి శాసన పరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నికైన మీకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి : అధ్యక్షా, మీరు శాసన పరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు. నిజంగా చాలా సంతోషంగా ఉంది. ఈనాడు టీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తారని చెప్పడానికి ఇది నిదర్శనం. అసెంబ్లీలో స్పీకర్‌గా ఒక బీసీ

నాయకుణ్ణి, శాసన పరిషత్తులో కూడా మిమ్మల్ని ఛైర్మన్‌గా ఎన్నుకోవడం టీఆర్ఎస్ ప్రభుత్వం యొక్క ఉనికి బయటపడుతోంది. ఎంతో చక్కగా మనం ఎన్నికల్లో కూడా చెప్పాము. టీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల వారికి ప్రాధాన్యతనిస్తామని చెప్పింది. ఈ రాష్ట్రంలో 85 శాతం బడుగుబలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలున్నారు. వాళ్ల ఇళ్లలో వెలుతురు రావాలి, వాళ్ల మొహంలో కళ రావాలి. అప్పుడే నిజమైన తెలంగాణా వచ్చినట్టుగా మేం భావిస్తామని కేసీఆర్ గారు ఎన్నో మీటింగ్‌ల్లో చెప్పారు. నిజంగా మేమైతే విశ్వసిస్తాము. మీరైతే ఉద్యమ నాయకులు. ఉద్యోగ సంఘాల్ని ఏకం చేసి, విద్యార్థి దశ నుండే 1969 నాటి ఉద్యమంలో పోరాటంలో పాల్గొని, బుల్లెట్ తూటాలకు గురయ్యారు. ఆనాడు పోలీసు కాల్పులకు గురయ్యారు. అప్పటి నుండి ఇప్పటి వరకు మీరు తెలంగాణా ఉద్యమానికి అంకితభావంతో పనిచేస్తూ, తెలంగాణా ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు, తెలంగాణా రాష్ట్ర సాధనకై మీరు అంకితభావంతో పని చేస్తూ, ఈనాడు ఉద్యోగ సంఘ నాయకుడు, శాసన పరిషత్తుకు ఛైర్మన్ అయ్యారు. అందరికీ మార్గదర్శనం చేసేందుకు ఛైర్మన్ అయినందుకు నేను చాలా సంతోషపడుతున్నాను. సకల జనుల సమ్మె ప్రపంచ చరిత్రలో నిలిచి పోయింది. దానికి మీరు అధ్యక్షుడిగా ఉండి ప్రపంచానికి ఒక మెసేజ్ పంపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు అందరూ కలిసి బ్రహ్మాండమైన ఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోవడం జరిగింది. ఆ రోజు ప్రధానమంత్రిగారిని కలిసినప్పుడు మీ మీద హత్యా ప్రయత్నం జరిగింది. ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ కార్యాలయంలో కూడా మీపై హత్యా ప్రయత్నం జరిగింది. అయినా మీరు వెనుకంజ వేయకుండా ధైర్యంతో ఉద్యమంలో పాల్గొని, కెసిఆర్‌గారికి కుడిభుజంగా ఉండి, ప్రభుత్వోద్యోగులను ఏకం చేసి అందరికీ మార్గదర్శకంగా పని చేసినందుకు, మీకు సముచిత స్థానం దొరికిందని భావిస్తున్నాము. తమరు రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలంలో జన్మించారు. రంగారెడ్డి జిల్లా లాంటి పది జిల్లాలకు చెందిన శాసనపరిషత్తులో బంగారు తెలంగాణా తెచ్చే కార్యక్రమంలో మీరు భాగస్వామ్యులయ్యారు. పెద్దల సభలో ఛైర్మన్‌గా వ్యవహరించే అవకాశం దొరికింది. మా అందరికీ మార్గ నిర్దేశాన్ని ఇచ్చి తెలంగాణా శాసనపరిషత్తును నడిపిస్తారని మాకు నమ్మకం ఉంది. నిజంగా మీరు ఉద్యమంలో చేసిన త్యాగం చొరవ తెలంగాణా ప్రజలకు కూడా మార్గదర్శకం అయింది.

**11.50 ఉ.** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ఉద్యమంలో మీరు చూపిన చొరవ, తెగువ మరువరానిది. మీరు తెలంగాణ రాష్ట్రసమితి అధ్యక్షుడికి, ఉద్యమ సమయంలో చేదోడు, వాదోడుగా నిలవడం జరిగింది. అదే విధంగా భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్ర శాసనపరిషత్‌ను పారదర్శకంగా, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా తీర్చిదిద్దుతారనే నమ్మకం, విశ్వాసం మాకుంది. శాసనపరిషత్‌లో మీ పాత్రను చక్కగా నిర్వహించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి: (సూర్యాపేట) అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర తొలి శాసనమండలికి తొలి అధ్యక్షుడిగా ఎన్నికైన మీకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చినటువంటి మీరు, తొలి శాసన పరిషత్ తొలి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం నిజంగా సంతోషదాయకం. తెలంగాణ రాష్ట్రసమితి అధ్యక్షుడైన శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారికి తెలంగాణ రాష్ట్ర ప్రజలు అధికారం ఇచ్చారు. ఈమధ్యే జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్ తొలి సమావేశాల సందర్భంగా శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు, మొట్టమొదట, ఈ సభలో తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా పునర్నిర్మించాలనే విషయమై అద్భుతంగా తెలియజెప్పడం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మేమంతా కూడా ఆ దిశగా ఆలోచన చేయడం జరిగింది. శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు గౌరవ ముఖ్యమంత్రి హోదాలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పయనింపజేయాలనే విషయాన్ని చెప్పారు. అభివృద్ధి జరగదని చాలా మంది సంశయిస్తున్నారనే విషయాన్ని గమనించాల్సిన అవసరముంది. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను కేంద్రప్రభుత్వం తీసుకురావడం జరిగింది. అదే విధంగా విద్యుత్ పంపిణీ విషయంలో కూడా చాలా ఇబ్బందులు తెలంగాణ రాష్ట్రానికి ఎదురయ్యే పరిస్థితులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించడానికి సమాయత్తమవుతున్నట్టుగా కనబడుతోంది. ఈరోజున చంద్రశేఖర్ రావు గారిచ్చిన పిలుపు మేరకు, తెలంగాణ రాష్ట్రం యొక్క అభివృద్ధిని కాంక్షించి, మేం కూడా పార్టీలకతీతంగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అండగా నిలవాలని నిర్ణయించుకోవడం జరిగింది. పార్టీలకతీతంగా తెలంగాణ రాష్ట్రపునర్నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని, మీ గెలుపుకు దోహదపడటం జరిగింది. ఈ సభ పెద్దల సభ. సభ యొక్క ఔనత్యాన్ని మీరు పెంపొందించగలరనే విశ్వాసం మాకుంది. నేను ఈ సభలో 1980వ సంవత్సరం నుంచి సభ్యుడిగా ఉన్నాను. సభకున్న గౌరవం, ఔన్నత్యం ఎనలేనిది. కానీ ఈ మధ్య సభ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని దిగజార్చే ప్రయత్నం కొంతవరకూ జరిగింది. ఈ సందర్భంగా శాసన పరిషత్ సభ్యులందరం మీకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాం. పెద్దల సభ ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు మీరు పూర్తిగా పరపతిని, అధికారాలను వినియోగించి సభ్యుల యొక్క ఔన్నత్యాన్ని కాపాడే ప్రయత్నం చేయాలని సభాముఖంగా మీకు తెలియజేస్తున్నాను. ఈరోజున చాలా విషయాలను మీ దృష్టికి తీసుకురావల్సిన అవసరముంది కానీ కాలతీతమైంది కాబట్టి మరో సందర్భంలో చాలా విషయాలను సభ దృష్టికి తీసుకురావడం జరుగుతుంది. తొలి శాసనపరిషత్ తొలి అధ్యక్షుడిగా మీరు ఎన్నికైనందుకు మరోసారి శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, సభను సజావుగా నడపాలని కోరుకుంటున్నాను. ప్రజా సమస్యల పైన, మరెన్నో విషయాలను సభలో చర్చించేందుకు కృషిచేసి ఆ సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా మీరు ఈ సభ నిర్వహణకై బాధ్యతను చేపట్టాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

శ్రీ ఎస్.రాజలింగం: (అసెంబ్లీ) అధ్యక్షా, నవ తెలంగాణ రాష్ట్రానికి తొలి అధ్యక్షుడిగా ఎన్నికైన మీకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. గవర్నర్ స్థానం తరువాతి స్థానం శాసనపరిషత్ ఛైర్మన్ స్థానానికి ఉంటుందని నేను భావిస్తున్నాను. అంతటి స్థానానికి ఎన్నికైన మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. అదే విధంగా శాసనపరిషత్ అధ్యక్ష స్థానానికి తగిన అభ్యర్థిగా మిమ్మల్ని ఎంపిక చేసిన నవ తెలంగాణ రాష్ట్ర నిర్మాత, గౌరవ ముఖ్యమంత్రిగారైన శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. నూతన తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ సభాపతిగా వరంగల్ జిల్లాకు చెందిన శ్రీ ఎస్.మదుసూధనాచారి గారిని ఎంపిక చేయడం కూడా ముదావహం. ముస్లీమ్ మైనారిటీకి చెందిన ఎమ్మెల్సీ శ్రీ మహముద్ అలీ గారిని ఉప ముఖ్యమంత్రిగా ఎంపికచేయడమే గాకుండా కీలకమైన రెవెన్యూ శాఖను కట్టబెట్టడం జరిగింది. అదే విధంగా మా వరంగల్ జిల్లాకు చెందిన డా.టి.రాజయ్య గారిని కూడా ఉప ముఖ్యమంత్రిగా నియమించి, వైద్య, ఆరోగ్య శాఖను అప్పగించడం సంతోషదాయకం. తద్వారా శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో అందరికీ పాలుపంచుకునే భాగ్యం కల్గిందని నేను భావిస్తున్నాను. నూతన ప్రభుత్వం ద్వారా నవ తెలంగాణ అభివృద్ధి సత్వరమే జరుగుతుందనే ధృడమైన విశ్వాసం మాకుంది. 1969వ సంవత్సరం నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలక భూమికను పోషించి దాదాపు నాలుగు దశాబ్ధాలుగా జరిపిన పోరాట ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని అందరూ భావిస్తున్నారు. శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు తెలంగాణ రాష్ట్రసమితి పేరున ఉద్యమ పార్టీని స్థాపించిన తరువాతే ఉద్యమానికి ఊపు రావడం, కేంద్ర ప్రభుత్వ పెద్దల కళ్లు తెరవడం జరిగింది. శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారి పోరాట స్పూర్తికి చిహ్నంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని అందరూ భావించకతప్పదు. పుష్కలమైన వనరులు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి గురించి ఎవరూ సంశయించాల్సిన అవసరం లేదు. సహజ సంపద విస్తారంగా ఉంది. అదే విధంగా జల వనరులు, ఉపాధి అవకాశాలు కూడా తెలంగాణ రాష్ట్రంలో మెండుగా ఉన్నాయి, తద్వారా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కచ్చితంగా జరుగుతుందని నేను భావిస్తున్నాను. 2000వ సంవత్సరం సెప్టెంబర్ 3వ తేదీన తెలంగాణ ప్రాంతంలో జరిగిన అనేక అవకతవకలపైన, ప్రభుత్వ పథకాల పైన ప్రత్యేకమైన నోట్ తయారుచేసి అప్పటి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఆనాడు ఏ విధంగా తెలంగాణ ప్రాంతం వివక్షకు గురయ్యింది అనే విషయాన్ని స్పష్టం చేస్తూ యుపిఏ చైర్ పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ గారి దృష్టికి మరియు కోర్ కమిటీ మెంబర్స్‌కు మెమోరాండం ఇస్తూ, ఒక కాపీని అప్పటి భారత రాష్ట్రపతి గారి దృష్టికి కూడా ఇవ్వడం జరిగింది. శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు 2001వ సంవత్సరంలో ఉద్యమ స్పూర్తితో పార్టీని స్థాపించి,

దిన దిన ప్రవర్ధమానంగా వృద్ధి చెందడంతో, తెలంగాణ ప్రజల కల సాకారమై, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. ఎంతో మంది ఆత్మ బలిదానాల వల్ల, విద్యార్థుల పోరాటం వల్ల ఈ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని చెప్పక తప్పదు. తెలంగాణ ఉద్యమంలో కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల ప్రజల తోడ్పాటు, స్ఫూర్తి భాగమేనని కూడా అభివర్ణించక తప్పదు.

అధ్యక్షా, సకల జనుల సమ్మె కూడా మీ నాయకత్వంలో జరగడం వల్ల, కేంద్ర ప్రభుత్వ దృష్టికి రాష్ట్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచంలోనే ఒక కొత్త వచనానికి తెలంగాణ ఉద్యమం నాంది పలికిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఉద్యమంలో శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారికి చేదోడు వాదోడుగా నిలిచి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కీలక భూమిక పోషించిన మీరు తొలి శాసన పరిషత్ తొలి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో సంతోషదాయకం. 2009వ సంవత్సరం డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి వెలువడిన తొలి ప్రకటన తరువాత కూడా ఎన్నో అరాచక శక్తులు, రాజకీయ నాయకులు తమ స్వలాభాపేక్షతో అడ్డుకునే ప్రయత్నం చేశాయి. కానీ ఎక్కడా ఉద్యమం నీరుగారకుండా ముందుకు వెళ్లింది. సుమారు 1,200 మంది విద్యార్థులు చేసుకున్న ఆత్మ బలిదానాల ఫలితం వల్ల, శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారి ఆమరణ నిరాహారదీక్ష ప్రకటన చేసి దీక్షకు పూనుకోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి తొలి ప్రకటనకు కట్టుబడి, మరో అడుగువేసి ఆ దిశగా పయనించడం జరిగింది. ఎన్నో పరిణామాలానంతరం చివరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం జరిగింది. గతంలో తెలంగాణ ప్రాంతంలోని సంపద దోపిడికి గురికాబడింది. రాజకీయ నాయకులు తెలంగాణ ప్రాంత సంపదను దోచుకొని లక్షల కోట్లు గడించడం జరిగింది. సీమాంధ్రుల వల్ల హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికావడం జరిగింది. సీమాంధ్రులు తమ ఆస్తులను కాపాడుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డుపడటం వల్లే రాష్ట్రం ఏర్పాటు ఆలస్యం జరిగింది.

అధ్యక్షా, ప్రతి పౌరుడు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాల్సిన అవసరముంది. గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచనలు చూస్తే నవ తెలంగాణ పునర్నిర్మాణం త్వరలోనే రూపుదాల్చడానికి అవకాశం ఉంది. వారి ఆలోచనలు, కార్యదక్షతను ఎవరూ తప్పుపట్టనవసరం లేదు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు త్వరలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేరువ కావడం తథ్యం. చాలా ముందు చూపుతో గౌరవ ముఖ్యమంత్రి గారి ఆలోచనలున్నాయి. మంచి ఫలితాలు రావడానికి ఎంతో కాలం పట్టదు. త్వరలోనే నవ తెలంగాణ అభివృద్ధి జరిగితీరుతుంది. గతంలో శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు తెలుగు

దేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, పంచాయతీరాజ్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని గ్రహించి పార్టీకి, పదవికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్రసమితి పార్టీలో చేరి ఎమ్మెల్యేగా ఎన్నికకావడం జరిగింది. రైతాంగ సమస్యలు తెలిసిన వ్యక్తి కాబట్టి వ్యవసాయ శాఖ మంత్రిగా నూతన రాష్ట్రంలో పగ్గాలు చేపట్టడం సంతోషదాయకం.

2.05 మ. అలాగే డా.టి రాజయ్య గారు కూడా కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టి తెలంగాణ రాష్ట్ర సాధనకోసం చేసిన ఉద్యమంలో పాల్గొన్నారు. జూపల్లి కృష్ణారావు గారు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టి.ఆర్.ఎస్. పార్టీలో చేరి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. చాలా మంది త్యాగాల ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్రఏర్పాటు. తెలంగాణ ప్రజల బాధను అర్థం చేసుకొని సోనియా గాంధీ గారు తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు సహకరించారు. తెలంగాణ రాష్ట్రఏర్పాటు బిల్లు పార్లమెంటులో పాసైన తరవాత కె.సిఆర్.గారు సకుటుంబ సమేతంగా ఢిల్లీకి వెళ్లి సోనియాగాంధీ గారిని కలిసి ధన్యవాదాలు తెలిపిన సంగతి మనకందరికీ తెలిసిందే. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునే శక్తి కె.సి.ఆర్ గారి దగ్గర ఉన్నది కాబట్టే మేం కాంగ్రెస్ పార్టీని వదిలి టి.ఆర్.ఎస్.లోకి రావడం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో కొంత మంది దుష్టశక్తులున్నారు. మేం పార్టీ మారినందుకు మమ్మల్ని పార్టీ నుంచి డిస్క్వాలిఫై చేయాలని ప్రయత్నం చేశారు. కానీ మేం భయపడేది లేదు. తెలంగాణ రాష్ట్రప్రజానీకం కె.సిఆర్. గారిని నమ్మారు కాబట్టే వారికి అధికారమిచ్చారు. శాసనపరిషత్‌లో అత్యున్నతమైన పదవి మీకు లభించినందుకు మీరు సభను సజావుగా నడిపే శక్తి, కె.సిఆర్ గారి ప్రతిభను ఇనుమడింపజేసే పద్ధతిలో మీరు ఉండాలని సకల దేవుళ్లను, దేవతలను కోరుతున్నాను. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధనకై కృషి చేసిన కె.సి.ఆర్.గారు నిండు నూరేళ్లు చల్లగా ఉండి తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలని కోరుకుంటూ, అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతాపూర్వక అభినందనలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్.రాములు నాయక్: (నామినేటెడ్) అధ్యక్షా, ఈరోజు మరువలేని, మరపురాని రోజు. ఇవ్వాళ మీరు సభాపతిగా ఎన్నికైన రోజు. నేను మొదటిసారి కౌన్సిల్‌కు వస్తానని అనుకున్నప్పటికీ నేను ఎలక్ట్ అవుతాను కానీ సెలక్ట్ కానని అనుకున్నాను. గౌరవ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. గారు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీలపైన ఉంచిన గౌరవం చూస్తుంటే దీపావళి పండుగ సందర్భంలో కాల్చే టపాసులు ఈ రోజు కాల్చుకోవాలని అనిపిస్తున్నది. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. జూలై 2వ తేదీన మీరు శాసన మండలి ఛైర్మన్‌గా ఎన్నిక కావడం ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీలకు ఎంతో గౌరవప్రదంగా ఉన్నది. కె.సి.ఆర్.

చేసిన వాగ్దానాలను నూరు శాతం అమలుచేస్తారు. నేనొక గిరిజన నాయకుడిని. కొత్త ప్రభుత్వం వచ్చి పట్టున పది రోజులు కాకముందే నాకు గవర్నర్ కోటాలో శాసనపరిషత్ సభ్యుడిగా అవకాశమిచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. డా.బాబా సాహెబ్ అంబేద్కర్ గారు బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పదని చెప్పినట్లుగా, మీరు ఓటింగ్ ద్వారా శాసనపరిషత్ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు పార్టీ తరపున, గౌరవ ముఖ్యమంత్రి గారి తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇందాక చాలా మంది ప్రతిపక్షపార్టీలకు చెందిన సీనియర్ సభ్యులు మాట్లాడుతూ మేం పది పదిహేను సంవత్సరాల నుంచి ఈ సభలో సభ్యులుగా ఉన్నామని చెప్పారు. కానీ ఇవ్వాళ శాసనపరిషత్ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి వారు వ్యక్తం చేసిన అభ్యంతరాలను ప్రజలు క్షమించరు. ఎందుకంటే గతంలో ఎన్నడూ లేని విధంగా అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి సీక్రెట్ బ్యాలెట్ ఓటింగ్ సిస్టం అని చెప్పగానే వాళ్లకు జ్వరం వచ్చినట్లుగా ఫీలయ్యారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు డి. శ్రీనివాస్ గారు కాని, షబ్బీర్ ఆలీ గారు కాని ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలలో గెలవలేదు. మీరు మొదటి తెలంగాణ శాసనపరిషత్‌కు మొదటి ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మరొక్కసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి. భానుప్రసాదరావుః (స్థానిక సంస్థలు) అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర శాసనపరిషత్ మొట్టమొదటి ఛైర్మన్‌గా ఎన్నికైన మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఎందరో మహానుభావులు ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. తెలంగాణ ప్రాంత ప్రజలు కలలు గన్నటువంటి తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించుకునే ఉద్దేశంతో ప్రజలు విశ్వసించి కె.సి.ఆర్ గారిని అధికారంలోకి తీసుకొచ్చారు. వారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ఈ ప్రభుత్వం ముందు ప్రస్తుతమున్నటువంటి ఎన్నో ఇబ్బందికరమైన పరిస్థితులు మనకందరికీ తెలుసు. టి.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సాగు తాగునీరు అందుతుందని, ఎప్పటినుంచో పెండింగులో ఉన్న ప్రాజెక్టులు పూర్తవుతాయని ఆశించారు. ముఖ్యంగా మా కరీంనగర్ జిల్లాకు సంబంధించి ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు ఫ్రెంచి వారి పాలనా కాలంలోనే డిజైన్‌లు పూర్తి చేసి నిర్మాణాన్ని మొదలుపెట్టేందుకు మెటీరియల్ కూడా మొబిలైజ్ చేయడం జరిగింది. ఇప్పటికి కూడా ప్రాజెక్టు దగ్గర వారు మొబిలైజ్ చేసిన మెటీరియల్ మనకు ప్రత్యక్షంగా కనబడుతున్నది. కానీ ఆనాటి నుంచి ఈనాటి వరకు ఉన్న ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో ఒక ప్రాంతానికి మొత్తానికి గ్రావిటీ ద్వారా నీరందించిన ఏకైక ప్రాజెక్టు ఇచ్చంపల్లి ప్రాజెక్టు. అటువంటి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఇంకొక ప్రాంతానికి ఎక్కడ అన్యాయం జరుగుతుందోనన్న ఉద్దేశంతో ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపేశారు.

అందువల్ల తెలంగాణ ప్రజలు కె.సి.ఆర్. గారి నాయకత్వంలో తప్పనిసరిగా పెండింగు ప్రాజెక్టులు పూర్తి చేస్తారనే నమ్మకం, విశ్వాసంతో వారికి అధికారమిచ్చారు. ఇటువంటి పెండింగులో ఉన్న ప్రాజెక్టులను ప్రారంభించుకోవాలంటే మన ఇరుగుపొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, కర్ణాటకలతో, అలాగే కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోకూడా కొన్ని ఇబ్బందులున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగానైనా ఇబ్బందులకు గురిచేయాలని చంద్రబాబునాయుడి గారి ప్రయత్నాన్ని తెలంగాణ ప్రజలందరూ గమనిస్తున్నారు.

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వానికి అభ్యంతరాలుండాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. రేపు పొద్దున తెలంగాణ ప్రాంతంలో ఉండే గిరిజనులు ఆ ప్రాజెక్టు వల్ల పెద్దఎత్తున నష్టపోతారనే విచక్షణ లేకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు తెలంగాణ ప్రాంతానికి అభ్యంతరాలుండాల్సిన అవసరం లేదనే విధంగా చెబుతున్నారు. అదే విధంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దు చేస్తూ తెలంగాణను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీటన్నింటిని అధిగమించి ముందుకు వెళ్లాలంటే తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన మొట్టమొదటి ప్రభుత్వం ఒక సుస్థిరమైన ప్రభుత్వంగా ఉండాల్సిన అవసరమున్నది. ప్రతి అయిదు సంవత్సరాలకొకసారి శాసనసభకు ఎన్నికలు జరుగుతుంటాయి. ఒకవేళ ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తరువాత ఆ ప్రభుత్వం సరైన పద్ధతిలో పరిపాలన సాగించలేదని ప్రజలు భావిస్తే మళ్లీ అయిదు సంవత్సరాల తరువాత వచ్చే ఎన్నికలలో ఇంకొక పార్టీకి అధికారాన్ని అప్పగిస్తారు. ఈసారి తెలంగాణలో ఏర్పడిన ప్రభుత్వం ఈ అయిదు సంవత్సరాలు సుస్థిరమైన, సమర్థవంతమైన పాలనను అందించాలి. మిమ్మల్ని అధ్యక్షులుగా ఎన్నుకునే ప్రయత్నంలో భాగంగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ సభ్యులు మా గురించి చిలువలు పలువలుగా మాట్లాడుతున్నారు. ఎందుకంటే వీళ్లు కూడా నిన్నటి వరకు సీమాంధ్ర ప్రాంత నాయకుల అడుగులకు మడుగులొత్తిన వారే. ఒక్క రోజు కూడా తెలంగాణ ఉద్యమంలో మాకంటూ ఒక పాత్ర ఉన్నదని ముందుకొచ్చిన నాయకులు కాదు కాబట్టే ఈ రోజు మా గురించి చిలువలు పలువలుగా మాట్లాడుతున్నారు.

మా ఆరుగురి సభ్యుల గురించి కేవలం రాజకీయ లబ్ధి కోసమే టి.ఆర్.ఎస్. ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్నామని, నిన్నటి వరకు పదవులు అనుభవించినవారే మేం ఈ ప్రభుత్వానికి మద్దతివ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెద్దలు కె.ఆర్.ఆమోస్ గారు తెలంగాణ ఉద్యమంలో ఒక ప్రధానమైన భూమిక వహించిన వ్యక్తి. కాంగ్రెస్ పార్టీలో నలభై సంవత్సరాలపాటు అహర్నిశలు కృషి చేసిన వ్యక్తికి సంబంధించిన

లబ్ధి గురించా వీరు మాట్లాడేది? మా జగదీశ్వర్ రెడ్డి గారికి కూడా నలభై సంవత్సరాల సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉండటమే కాకుండా 1980లోనే వారు శాసనపరిషత్ సభ్యునిగా ఉన్నారు. ఇప్పుడు కూడా శాసనపరిషత్ సభ్యునిగా ఉన్నారు. రెండు సార్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసి పి.సి.సి. ఏర్పాటులో ప్రధాన భూమికను వహించారు. ఇటువంటి వ్యక్తుల గురించా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ సభ్యులు విమర్శించేది? పెద్దలు కె.యాదవరెడ్డి గారు విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. రెండు సార్లు శాసనపరిషత్ సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో రకాల బాధ్యతలను నిర్వహించారు. పెద్దలు నాగపురి రాజలింగం గారు కూడా 1969 నుంచి తెలంగాణ ఉద్యమానికి మద్దతు పలికామని ఇందాకే వారు చెప్పారు. పెద్దలు వి.భూపాల్‌రెడ్డి గారు పంచాయతీ సమితి సభ్యులుగా, మండలాధ్యక్షునిగా, జిల్లాపరిషత్ ఫ్లోర్ లీడర్‌గా, రెండు సార్లు శాసనపరిషత్ సభ్యులుగా పనిచేసిన వ్యక్తి. నేను గత పదిహేను సంవత్సరాలుగా యూత్ కాంగ్రెస్‌లో పనిచేస్తూ వచ్చాను. ఈరోజు శాసనపరిషత్ సభ్యునిగా ఉంటూ గత అయిదు సంవత్సరాలుగా తెలంగాణ విషయంలో ఏ రోజూ వెనక్కి పోకుండా ఉన్నటువంటి మేం ఆరుగురు సభ్యులం ఇదే సభలో మేం తెలంగాణ రాష్ట్రఏర్పాటు కోసం పోరాడిన సంగతి పాత రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుంది. మా జిల్లాకు సంబంధించి టి.ఆర్.ఎస్. పార్టీ తరఫున నారదాసు లక్ష్మణ్‌రావు గారు ఒక్కరే ఉండేవారు. శాసనపరిషత్‌లో నారదాసు లక్ష్మణ్‌రావుగారికి తెలంగాణ అంశంపై అవసరమైనపుడు మేం ఆరుగురం వారికి మద్దతు తెలిపేవాళ్లం.

**2.20 మ.** ఆరోజు నేను కరీంనగర్ జిల్లాలోని నేదునూరు ప్రాజెక్టు గురించి మాట్లాడాను. 2010సంవత్సరంలో అన్ని పత్రికలలో ప్రధానంగా మొదటి పేజీలలో ఈ విషయం వచ్చింది. ' కాంగ్రెస్ పార్టీలో నేదునూరు చిచ్చు, కాంగ్రెస్ పార్టీలో నేదునూరు దుమారం, సొంత నేతలపై భాను ఫైర్, ప్రతిగా మండిపడ్డ ఆరేపల్లి, గులాబీయింగే కారణమా '. ఇది ఆనాడు పత్రికలలో వచ్చిన అంశం . నేదునూరు ప్రాజెక్టుకి జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడిన అంశం . ఆ తర్వాత – త్వరలో నేదునూరు పనులు ప్రారంభం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారు. ఆరోజు భానుప్రసాద్‌కి అవగాహన లేదని చెప్పారు. 2010లోనే నేను ఆ ప్రాజెక్టు గురించి చెప్పాను. తర్వాత అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు దానికి ఆగమేఘాల మీద ఫౌండేషన్ స్టోన్ వేశారు గానీ ఎటువంటి పనులు జరగలేదు.

అధ్యక్షా, 2010లో ఆమోస్ గారు, జగదీశ్వర్ రెడ్డి గారు, నేను ఇదే లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఒక ప్రశ్న అడిగాం . హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలోని ప్రభుత్వ భూముల వివరాలు

అడిగాం . అసలు ఈ రాష్ట్రం ఏర్పడే నాటికి ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి, అందులో ఏఏ అవసరాలకు ఎంతెంత ఇచ్చారో చెప్పాలని ఫిబ్రవరి 02, 2010 నాడు ఇదే సభలో ఒక ప్రశ్న అడిగాం . దానికి ఆరోజున్న సంబంధిత మంత్రివర్యులు ఏమి సమాధానం చెప్పారంటే – వాటికి సంబంధించి మాదగ్గర రికార్డులు లేవని చెప్పారు. కానీ ఈరోజు తెలంగాణాపై చిత్తశుద్ధి ఉన్న వాళ్లు వచ్చిన నెల రోజుల్లోనే తెలంగాణాలో ఎన్ని భూములున్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి తదితర వివరాలను ప్రజల ముందు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈరోజు తెలంగాణా ప్రాంతంలో 35.80లక్షల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయనే వివరాలను ముఖ్యమంత్రి అయిన నెల రోజులకె కె.సి.ఆర్ గారు రికార్డులను తీయగలిగారంటే ఆనాటి ప్రభుత్వం ఏ రకంగా ఈ ప్రాంతాన్ని అణగదొక్కాలనే ప్రయత్నం చేసిందో, ఏవిధంగా రికార్డులు లేవని చెప్పే ప్రయత్నం చేసిందో మనం చూశాం.

ఇక్కడ ఉన్న ఆరుగురు శాసన మండలి సభ్యుల గురించి మాట్లాడుతూ – రాజకీయాలలో లబ్ధి పొందారని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టిఆర్‌యస్‌కి శాసనమండలిలో మద్దతు తెలిపినవాళ్లలో ఏ ఒక్కరైనా రాజకీయాలలోకి వచ్చిన తర్వాత బౌల్డర్‌హిల్స్‌లో ఇళ్లు కట్టుకున్నామా, లేకపోతే రోడ్ నెం.10, జూబ్లీహిల్స్‌లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టామా, హైదరాబాదు సిటీలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టామా, ఏ రకమైన లబ్ధి పొందామో చెప్పాలి. లబ్ధి పొందడానికి రాజకీయాలలోకి వచ్చిన వాళ్లం కాదు. ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేయడానికి వచ్చిన వాళ్లమే కానీ ఎటువంటి లబ్ధి పొందడానికి కాదు. మాట్లాడిన వాళ్లకి తెలుసు. గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ సభలో మాట్లాడిన రోజు – గతంలో చెన్నారెడ్డి గారిని చూశాం, చెన్నారెడ్డి గారి కంటే రెట్టింపు అవగాహన కెసిఆర్ గారికి ఉందని ఆనాడు కొనియాడిన యల్‌ఓపి గారు ఈరోజు ఏమి మాట్లాడుతున్నారో మనం చూశాం . దానికి కారణం ఏమంటే – ఏదో విధంగా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఎక్కడో ఉన్న రిమోట్‌కి అనుగుణంగా నడుచుకునే వ్యక్తులు వీళ్లు కాబట్టి, ఈరోజు మేము తీసుకున్న నిర్ణయం వల్ల వాళ్లలో భయం ఏర్పడే పరిస్థితి ఉంది. కేవలం తెలంగాణా ప్రజలకు మంచి జరగాలనే సదుద్దేశ్యంతోటే మేము ఈవిధంగా సమిష్టిగా నిర్ణయం తీసుకున్నాం . ప్రభుత్వం ప్రజలకు మేలు చేకూర్చే విధంగా వ్యవహరించాలని, ప్రభుత్వానికి ఉభయ సభలలో ఎలాంటి అవాంతరాలు రాకూడదని, పార్టీల వల్ల ప్రభుత్వానికి ఇబ్బంది ఉండకూడదని, ప్రజలు ఇచ్చిన నిర్ణయాన్ని శిరసావహించి, ప్రజాభిప్రాయానికి కట్టుబడి ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వానికి మద్దతు తెలపడానికి మేము ముందుకి రావడం జరిగింది. అంతేగానీ ఎవరో ఏదో చెప్పినట్లు కాదు. తెలంగాణ ప్రజల హితం కోరి ఈ పదవులను ఏ నిముషంలోనైనా వదులుకోవడానికి, త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాం .

తెలంగాణ రాష్ట్ర శాసనమండలి మొట్టమొదటి ఛైర్మన్‌గా మీరు ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీలాంటి ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమంలో ఒక ప్రధానమైన భూమిక పోషించి, ఈ స్థానానికి ఎన్నిక కావడం నిజంగా తెలంగాణ అభిమానిగా చాలా సంతోషిస్తున్నాను. మీ నేతృత్వంలో తప్పకుండా ఈ శాసన మండలి ఔన్నత్యం పెంపొందుతుందని, ఈ శాసన మండలి వ్యవహారాలు ఆ మేరకు కొనసాగుతాయని నేను పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాను. మీకున్న అనుభవం పూర్తి స్థాయిలో ఈ సభకి ఉపయోగపడుతుందని, మీ ఆధ్వర్యంలో ఈ సభ గౌరవం పెంపొందుతుందని ఆశిస్తూ మరొకసారి మీకు హార్థిక శుభాభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పోట్ల నాగేశ్వరరావు: (స్థానిక సంస్థలు) అధ్యక్షా, ఈ తెలంగాణ రాష్ట్రశాసనమండలికి మొదటి ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మిమ్ములను మనస్ఫూర్తిగా అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ శాసన మండలి గౌరవం, ఉన్నతిని ఇంకా పెంచే విధంగా, ఇప్పటి వరకు నడుస్తున్న విధానాన్ని పాటిస్తూ సభా గౌరవం పెరిగే విధంగా మీరు వ్యవహరిస్తారని నేను ఆశిస్తున్నాను. నాకున్నటువంటి విశ్వాసం ఏమంటే – ఈ చట్ట సభలలో సభ్యులు చట్టాలు తయారు చేస్తున్నారని బయట అందరూ అనుకుంటున్నారు. కానీ మనకి తెలిసి ఏ చట్టం కూడా మనం చేయడం లేదు. అధికారులే తయారుచేసి తీసుకొస్తున్నారు, దాన్ని ఇక్కడ ఆమోదిస్తున్నారు. నా ఐదు సంవత్సరాల కాలంలో నేను చూసింది – చట్టంలో ఎక్కువ అవకాశాలను అధికారులు కల్పించుకునే విధంగా, విచక్షణాపరమైన అధికారాలు వారికే ఉండే విధంగా చట్టాలను అధికారులు తయారు చేసి తీసుకొస్తే, వాటిని మనం ఆమోదిస్తున్నాం . ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇటీవల జరిగిన అయ్యప్ప సొసైటీలో జరిగిన సంఘటనలో ఈ విషయం రుజువైంది. అధికారులకు ఉన్నటువంటి విచక్షణాధికారాల వల్ల ఇది జరిగింది. అక్కడ సక్రమమా, అక్రమమా అన్నది చూడకుండా నిర్మాణాలు జరిగాయి. ఇప్పుడు ప్రజలు నష్టపోతున్నారు. లంచగొండి అధికారుల వల్ల, అధికారులకుండే విచక్షణాధికారాల వల్ల జరిగిన లోపాలకు ప్రజలు నష్టపోతుంటే ప్రజాప్రతినిధులుగా మనం ఏమీ చేయలేక ప్రేక్షక పాత్ర వహించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందంటే – మనం చట్టాలు చేయడం లేదు కాబట్టి .

ఈరోజు చట్టసభల గౌరవం కూడా కొంచెం తగ్గిపోతోంది. ఇప్పటి వరకు చాలామంది పెద్దలు మాట్లాడారు, తాము ఎందుకు ఈ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారో చెప్పారు. ఎక్కడో లోపం ఉంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి శాసన మండలిలో ప్రాతినిథ్యం లభించడం లేదు. దాని వల్ల జరిగిన లోపమే ఈరోజు ప్రజాప్రతినిధులందరికీ ఒక మచ్చ వచ్చే విధంగా

ఈ కొత్త ప్రభుత్వం చేసిందనే భావన ప్రజల్లో కలుగుతోంది. దీనికి ఏదైనా ఒక మార్గం ఉండవలసిన అవసరం ఉంది. ఇక్కడ ఏదో తప్పు చేసినట్లు, లేకపోతే అవకాశాలు వెతుక్కుంటూ పార్టీలు మారినట్లు, లేకపోతే ఎన్నికైన ప్రభుత్వానికి అనుకూలమైన ధోరణితో అవకాశాల కోసం, పదవుల కోసం వీళ్లంతా మారిపోయారనే అపవాదు వీళ్లందరికీ వస్తోంది. ఆమోస్‌గారిని చూసిన తర్వాత, నాకు తెలిసి వారు అవకాశాల కోసం వెళ్లారని నేను అనుకోవడం లేదు. ఈ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి ఆయన వెనకాడలేదంటే ఆయన ఏదో ఆశించి వెళ్లారని నేను అనుకోవడం లేదు. ప్రభుత్వం ఒక ప్రయత్నం చేసింది, శాసన మండలిలో మనకున్న సంఖ్య సరిపోవడం లేదు, అవసరమైన సంఖ్యా బలం లేదు, దీన్ని ఏవిధంగానైనా అధిగమించాలని చేసిన ప్రయత్నంలో భాగంగా ఇదంతా జరిగింది. అంటే ఇక్కడ ఒక లోపం ఉంది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి శాసన సభలో మెజారిటీ ఉంటుంది, కానీ వాళ్లంతా ఇక్కడికి వచ్చి శాసన మండలిలో ఒట్టిగా కూర్చుని, చేతులు కట్టుకుని, నోరు లేకుండా కూర్చోలేరు. సంఖ్యా బలం లేకుంటే ప్రతిపక్షాలు చేసే విమర్శలను ఎదుర్కొనే పరిస్థితి ప్రభుత్వానికి శాసన మండలిలో లేదు కాబట్టి ఇంత మంది మీకు మద్దతు ఇస్తామని చెప్పే పరిస్థితులున్నాయంటే ఎక్కడో లోపం ఉందని, దాన్ని సరిజేసుకోవలసిన అవసరం ఉందని నేను వ్యక్తిగతంగా భావిస్తున్నాను.

గౌరవ మంత్రి వర్యులు శ్రీ రాజేందర్ గారు మాట్లాడుతూ – నెల బాలుడు ఈ ప్రభుత్వం అని చెప్పారు. ఈ నెల బాలుడికి పాలు పట్టడానికి మేము సిద్ధం. కానీ తొందరగా నడవాలి, తొందరగా పరుగులు పెట్టాలని ఈ ప్రభుత్వాన్ని మేము కోరుతున్నాం . ఆ శక్తి వచ్చేలా మేము చేస్తాం . బంగారు తెలంగాణాని ఆవిష్కరించడానికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టడానికి మీకు కావలసిన శక్తిని, బలాన్ని మేము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం . ప్రతిపక్షం ఎప్పుడూ ఉంటుంది. తెలంగాణాలో చిలక జోస్యం కూడా నమ్ముతున్నాం . అది వచ్చి ఒక కార్డు తీస్తుంది. మీ పనులు అయిపోతాయి, పైసలు ఇవ్వమని అడుగుతారు. ఇంతలో కాకి విని కావ్ కావ్ అని అంటుంది. ప్రతిపక్షం ఎలాగూ ఉంటుంది, కావ్ కావ్ అని అరుస్తూనే ఉంటాం . ఎదురు చూస్తున్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది. కాబట్టి మీరు చేయవలసిందే. ఈ తెలంగాణ రాష్ట్ర పురోగతి కోసం మీరు ఉద్యమించవలసిందే. అధ్యక్షా, మాకేమీ ఇక్కడ కొత్తగా కనబడడం లేదు. వాళ్లంతా పూర్వాశ్రమంలో మా పార్టీ వాళ్లే కాబట్టి , వాళ్లను చూసినా మా వాళ్లేననిపిస్తోంది. కొత్తగా తేడా ఏమీ కనిపించడం లేదు. కొత్త శాసన మండలికి మీరు మొట్టమొదటి ఛైర్మన్‌గా ఎన్నిక కావడం మాకందరికీ సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర సాధనలో మీరు కూడా కొంత భారం మోశారు కాబట్టి దీనికి మీరు అర్హులే. ఖచ్చితంగా శాసన మండలి గౌరవాన్ని,

సభ్యుల హక్కులను కాపాడుతారని ఆశిస్తూ, మీకు అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వి. భూపాల్ రెడ్డిః (స్థానిక సంస్థలు) అధ్యక్షా, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర శాసన మండలి మొదటి ఛైర్మన్‌గా మిమ్ములను ఎన్నుకున్నందుకు ఈ సభకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఆ స్థానంపై కూర్చునే అవకాశం మీకు కలిగినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నిజానికి ఈ స్థానం మీకు రావడానికి మీ కృషే కారణమని చెప్పవలసిన బాధ్యత మామీద ఉంది. ఒక ఉద్యమ నాయకునిగా ఉద్యమకారులను కూడగట్టుకొని తెలంగాణ సాధనలో గౌరవ ముఖ్యమంత్రిగారికి ఇచ్చిన సహకారం, సకల జనుల సమ్మె, ఆ సమ్మెలో మీ పాత్ర, ఇవన్నీ గమనించి ముఖ్యమంత్రి గారు మిమ్ములను ఈ సభాపతిగా కూర్చోబెట్టారనే భావన నాకు కలిగింది. చిన్న స్థాయి నుంచి ఈ స్థాయికి రావడానికి మీకృషేకారణం తప్ప మరొకటి కాదని మనవి చేస్తున్నాను. ఎవరైనా సరే పది మందికి మేలు కలిగే విధంగా, సమాజానికి మేలు జరిగే విధంగా, సమాజంలో వ్యక్తిగా గుర్తించబడే విధంగా పని చేసినప్పుడే ఇటువంటి అవకాశాలు కలుగుతాయనే అభిప్రాయం ఉన్న వ్యక్తులలో నేను ఒకణ్ణి.

**2.35 మ.** అధ్యక్షా, మీరు కూడా గ్రామస్థాయి నుంచి వచ్చారు. కొందరు మిత్రులు మాట్లాడుతూ, వారు మిమ్మల్ని తమ జిల్లావాసి అని అన్నారు, మీరు మా జిల్లా అల్లుడని నేనంటున్నాను. అల్లుడికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని భావించేవారిలో నేనూ ఒకడిని. ఏది ఏమైనా, 60 సంవత్సరాల పోరాటం తర్వాత వచ్చిన తెలంగాణాను ఏ విధంగా నిలుపుకోవాలనే భావన ప్రజల్లో ఉంది. ఈ తెలంగాణా "బంగారు తెలంగాణా" కావాలనే ప్రజల ఆశయాన్ని నెరవేర్చవలసిన బాధ్యత మనందరిపై ఉంది.

శాసనపరిషత్తులో తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీకి మెజార్టీ లేదు కదా, ఛైర్మన్‌ను ఏ విధంగా ఆ పార్టీనుంచి ఎన్నుకుంటారనే అభిప్రాయాన్ని చాలామంది మిత్రులు వెలిబుచ్చారు. ఆంధ్రప్రాంతంలో అధికారంలోకి వచ్చిన పార్టీని బలపరిచి, ఆ ప్రభుత్వం ద్వారా ఆంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆంధ్రప్రాంత శాసనపరిషత్ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని ఆసరాగా తీసుకుని ఈరోజు మేము కూడా ఈ నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తమరి ద్వారా మనవిచేస్తున్నాను. ఇది పదవులకోసం లేక మరొకదాని కోసం ఆశకు పోయి తీసుకున్న నిర్ణయం కాదు. ప్రజలు కోరుకుంటున్న తెలంగాణాను మేము బలపరచాలి, మేము బలపరిచినందుకు ఎవరికీ నష్టం లేదనే భావనతో ఈనాడు అధ్యక్షునిగా మిమ్మల్ని ఎన్నుకోవడంలో మీకు మేము సహకరించాము. ముఖ్యంగా, గౌరవసభ్యులు

శ్రీ కె.ఆర్.ఆమోస్, శ్రీ కొంపల్లి యాదవరెడ్డి, శ్రీ టి. భాను ప్రసాదరావు, శ్రీ ఎస్. జగదీశ్వర్‌రెడ్డి, శ్రీ ఎన్.రాజలింగం, మేమంతా "రాబోయే ఐదు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీయే అధికారంలో ఉంటుంది, తెలంగాణా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వానికి తోడ్పడవలసిన బాధ్యత మనపై ఉందని, రాబోయే తరాలు కూడా తెలంగాణా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు వస్తారనే భావనతో" ఈ నిర్ణయం తీసుకుని నేడు మీరు అధ్యక్షస్థానం వహించడానికి మేము సహకరించడం జరిగింది. ఈ అవకాశం కల్పించిన గౌరవ ముఖ్యమంత్రిగారికి, సభలో ఉన్న పెద్దలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీకు మరొకసారి అభినందనలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి: అధ్యక్షా, తెలంగాణా రాష్ట్రశాసనపరిషత్‌కు ప్రప్రథమంగా ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మా తరపున శుభాకాంక్షలు అందజేస్తున్నాను. ఇది మాకెంతో గర్వంగా ఉంది. ఒక ఉద్యమకారుడు నేడు శాసనపరిషత్‌కు ఛైర్మన్‌గా ఎన్నిక కావడం తెలంగాణా రాష్ట్రానికే గర్వకారణమనే విషయాన్ని మనవిచేస్తున్నాను.

రెండవ విషయం మీకూ, మాకూ కొంత అవినాభావ సంబంధం ఉంది. మీరు ఉత్తర తెలంగాణా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనపరిషత్ సభ్యునిగా, అదే నియోజకవర్గం నుంచి నేను ఉపాధ్యాయ శాసనపరిషత్ సభ్యునిగా ఎన్నిక కావడం ఎంతో ముదావహమైన విషయం. కాబట్టి ఇదే ఒరవడిని మన ముఖ్యమంత్రి గారు చెబుతూ ఉంటారు. కొత్త రాష్ట్రంలో, కొత్త ఒరవడిలో పరిపాలన సాగుతుందనే మాటను నిజం చేసిన విషయం నేడు మీ ఎన్నిక ద్వారా రుజువైంది. ఎందుకంటే, మొదటి నుంచి కూడా తెలంగాణా రాష్ట్రం సాధించటంలో శ్రీ కె. చంద్రశేఖర రావు గారు ఉద్యమసారథిగా ఉద్యమాన్ని నిర్వహిస్తుంటే, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులందరినీ కూడా సమైక్యపరిచి ఉద్యోగ జె.ఏ.సీ. ద్వారా భుజం, భుజం కలిపి నేడు తెలంగాణా రాష్ట్రం సాధించడంలో తెగించి పోరాటం చేసిన పోరాట యోధులు మీరు. అందుకొరకే, నేడు ఉపాధ్యాయ శాసనపరిషత్ సభ్యునిగా నేనెంతో గర్వపడుతున్నాము.

గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా, ఈ ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహభావంతో ఉండే ప్రభుత్వమని నేను మనవిచేస్తున్నాను. మీ ఎన్నికే ఆ మాటను రుజువు చేస్తోందని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. గతంలో మా ఆమోస్‌గారు శాసన పరిషత్‌కు ఎన్నికైన సమయంలో కూడా ఇది ప్రస్తావనకు రాలేదు. చాలా రోజులనుంచి నేను గమనిస్తున్నాను. కాంపోజిషన్ ఆఫ్ ది లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు, స్థానిక సంస్థలకు, శాసనసభ్యులద్వారా ఎన్నుకునే అవకాశం మరియు గవర్నరు గారి ద్వారా

నామినేట్ చేసుకునే అవకాశం ఉన్నది. నాలుగు లక్షల మంది ఉద్యోగులం ఉన్నా, మాకు అవకాశం లేదనే భావన గతంలో ఉండేది. కానీ, నేడు మా స్వామిగౌడ్ అన్న కుర్చీలో కూర్చున్న తర్వాత మాకెంతో భరోసా కలగడంతోపాటు ఉద్యోగులంతా కూడా ఎంతో సంతోషాన్ని వెలుబుచ్చుతున్న మాటను నేను మనవిచేస్తున్నాను. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రతినిధినే ఛైర్మన్‌గా చేసి చెప్పిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర రావు గారి నాయకత్వంలో నూతన ఒరవడితో ఈ ప్రభుత్వం పయనిస్తోందని చెప్పడానికి ఇదొక మంచి నిదర్శనమనే మాటను ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఎప్పుడైనా అధికారపక్షంలో కూర్చున్న సభ్యులకు సభలో మాట్లాడడానికి పెద్దగా అవకాశం రాదనే విషయాన్ని మేము గతంలో కూడా చూస్తూ వచ్చాము. మీ చూపంతా ఎడమవైపునే ఉంటుంది. అందరికీ సభలో సమానావకాశాలుండాలి. ప్రతిపక్షం నోరు నొక్కుతున్నారనే మాట రాకూడదు. ప్రతిపక్షనాయకునికే సభలో ఎక్కువ సమయాన్ని కేటాయించడం గతంలో మేము గమనించడం జరిగింది. కాబట్టి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలుచేయడంలో ఏ విధంగా చట్టాలు తీసుకువచ్చాము, ఆ చట్టాన్ని సపోర్ట్ చేస్తూ మాట్లాడే అవకాశం కల్పించవలసిందిగా, అందరికీ సమన్యాయం కల్పించే విధంగా మీరు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. సభ్యులందరికీ సరైన న్యాయం చేకూర్చి, సభను సజావుగా నడిపించే శక్తియుక్తులు భగవంతుడు తమకు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. రాజేశ్వరరావు: (నామినేటెడ్) తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారి శాసనపరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మీకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ రోజు నవ తెలంగాణా నిర్మాణం గురించి, ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విషయంలో ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావుగారు ఈ సభలో చాలా చక్కగా మాట్లాడడం జరిగింది. రైతులకు సాగునీరు అందించడం కోసం, బలహీనవర్గాల సంక్షేమం కోసం ఆయన కంకణం కట్టుకొని ఆయా శాఖలను ఆయనే స్వయంగా పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. ఎస్.సి.వర్గాలకు రూ.50 కోట్లను కేటాయించడం జరిగింది. అదే విధంగా, ఎస్.టి.వర్గాలకు 12 శాతం రిజర్వేషన్లను కల్పించి, వారికి ప్రత్యేక గ్రామపంచాయితీలను ఏర్పాటుచేస్తామని ఆయన చెప్పడం జరిగింది. మైనారిటీల సంక్షేమం, విద్య, భూముల కేటాయింపు మొదలైన విషయాల్లో ముఖ్యమంత్రిగారి విధానాలు చాలా బాగున్నాయి. అభివృద్ధిలో భారతదేశంలోనే తెలంగాణా రాష్ట్రం ప్రథమస్థానంలో ఉండే విధంగా ముఖ్యమంత్రిగారు కృషిచేయగలరనే పూర్తి విశ్వాసం నాకు ఉంది.

ఇంతకుముందే సభ్యులు డా. కె.నాగేశ్వర్‌గారు మాట్లాడుతూ, "చట్టాలు చేసేటపుడు అవి ప్రజలందరికీ అందుబాటులో ఉండాలే తప్ప అవి కొంతమందికే పరిమితం కాకూడదని" చెప్పారు. సమాజంలో ఉన్న బడుగు, బలహీన, అట్టడుగు వర్గాలందరికీ సమానంగా వర్తించే విధంగా చట్టాలను తీసుకురావలసిన అవసరముందని తమరి ద్వారా మనవిచేస్తున్నాను. రైతులకు కరెంటు, సాగునీరు ప్రాజెక్టులు, ఐ.టి.రంగం, పరిశ్రమలు, విద్యార్థుల సంక్షేమం మొదలైన విషయాలలో సరైన దృక్పథంతో ముఖ్యమంత్రిగారు ముందుకు వెళ్తున్నారు. ఈ ఉద్యమపార్టీ ప్రభుత్వాన్ని సరిగా నడుపుతుందా, లేదా అని కొందరు ఆలోచిస్తున్న పరిస్థితుల్లో, ఆయన మంచి ప్రణాళికలతో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనింపజేయగలరనే పూర్తి నమ్మకముంది. ఈ రాష్ట్రం దేశంలో అన్ని రాష్ట్రాలకంటే అభివృద్ధి చెందుతుంది. మీరు తెలంగాణా ఉద్యమంలో ఎన్నో కష్టాలను అనుభవించి, ఆ స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చి, ఈ సభకు అధ్యక్షత వహించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రిగారు అన్ని వర్గాల సంక్షేమం గురించి ఆలోచించి, మంత్రులు, స్పీకర్, ఛైర్మన్ల ఎన్నిక విషయంలో అనేక జాగ్రత్తలు వహించడం వల్ల ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ చాలా సంతోషంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. మీరు కూడా ఈ సభను సజావుగా నడుపుతూ, పాలకపక్షాన్ని, ప్రతిపక్షాలను కూడా కలుపుకుంటూ ముందుకు వెళ్లి, ఈ సభ గౌరవాన్ని మరింత పెంచగలరని ఆశిస్తూ, భగవంతుడు మీకు మంచి ఆరోగ్యం, మంచి ఆలోచనలివ్వాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి. హరీష్‌రావు: అధ్యక్షా, 1954 వ సంవత్సరం, జూలై 5 వ తేదీన రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, కిస్మత్‌పూర్ గ్రామంలో శ్రీ కనకమామిడి లక్షయ్య, నర్సమ్మ పుణ్యదంపతులకు జన్మించిన మీరు తెలంగాణా తొలి శాసనపరిషత్తులో తొలి ఛైర్మన్‌గా ఎన్నిక కావడం చాలా సంతోషం. మీకు నా హృదయపూర్వక అభినందనలను తెలియజేస్తున్నాను. మీరు టి.ఎన్.జి.ఓ. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, తెలంగాణ రాష్ట్రసమితి పార్టీలో చేరిన తర్వాత శాసనపరిషత్ సభ్యునిగా పనిచేసిన సమయంలో మరియు తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న సమయంలో ఇంకా అనేక సందర్భాలలో కొన్ని వందల గంటలపాటు మీతో కలసి పనిచేసే అవకాశం మాకు దొరికింది. ఆనాడు "హైదరాబాదు ఫ్రీజోన్‌కాదు, 14 ఎఫ్‌ను రద్దు చేయాలని" ఒక నిర్ణయం తీసుకునే సందర్భంలో జరిగిన ఉద్యోగ గర్జన నా నియోజకవర్గమైన సిద్ధిపేటలో జరిగే అవకాశం మీరు నాకు కల్పించారు. లక్షలాది మందితో ఆనాడు ఉద్యోగ గర్జనను నిర్వహించి, రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి 14 ఎఫ్‌ను రద్దు చేయించడంలో మీ కృషి ఎవరూ మర్చిపోలేరు. ముఖ్యంగా, మీకు వచ్చిన అవకాశం చాలా

తక్కువ మందికి దొరుకుతుంది. మీరు పదవ తరగతి చదువుకునే సందర్భంలో, తొలిదశలో 1969 వ సంవత్సరంలో తెలంగాణా ఉద్యమంలో పాల్గొని, మలిదశ ఉద్యమంలో కూడా మళ్లీ క్రియాశీలక పాత్రను పోషించి తెలంగాణా పునర్నిర్మాణంలో కూడా అత్యంత కీలక స్థానం చేరుకోవడం చాలా అరుదుగా, చాలా తక్కువ మందికి దొరికే అదృష్టం ఇది. అటువంటి గొప్ప అవకాశం మీకు రావడం నిజంగా చాలా సంతోషం. ఆ రోజుల్లోనే, పుత్లిబౌలీలోని వివేకవర్ధిని కళాశాలలో 1969 వ సంవత్సరం తెలంగాణా ఉద్యమంలో ఆనాడు జరిగిన కాల్పుల్లో మీ భుజంలో తుపాకీ బుల్లెట్ దూసుకుపోయిన సంఘటన జరిగింది. ఆ స్ఫూర్తిని మీరు ఎప్పుడూ కోల్పోలేదు. ఆ తరువాత రాజేంద్రనగర్ పంచాయితీలో సేవక్ ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా ఆనాడు ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్యాంగ్‌మెన్లకు అన్యాయం జరుగుతుందంటే, వారి పక్షాన పోరాటం చేసి మీ ఉద్యోగాన్ని పోగొట్టుకోవడం జరిగింది. అయినా మీలో పోరాటపటిమ తగ్గలేదు. ఆ తరువాత మీరు తార్నాకలో ఫుడ్ అండ్ డ్రగ్ కంట్రోల్‌కార్యాలయంలో చేరిన తర్వాత అక్కడ కూడా తెలంగాణా ఉద్యోగుల కోసం పోరాటం చేసిన చరిత్ర ఉంది. ఇటువంటివి అనేకసందర్భాలున్నాయి. మరొకసందర్భంలో, ఖైరతాబాద్, ఆర్.టి.ఏ. ఆఫీసులో మీతోపాటు నేను కూడా ఉన్నాను. ఆనాడు మీపైన, నాపైన ఏ రకమైన దాడి జరిగిందో మనమంతా చూడడం జరిగింది. మీపైన హత్యాయత్నం జరిగినా మీలో స్ఫూర్తి తగ్గలేదు. మీతోపాటు మమ్మల్నందరినీ కూడా అరెస్టు చేసి ఆనాడు బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లిన తరువాత మీపై హత్యాయత్నం జరిగిందని అప్పుడు మాకు అర్థమయ్యింది. మీలో చమటలు రావడం, మీరు చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంటే, అప్పటికప్పుడు మిమ్మల్ని బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రిలో చేర్చిన తర్వాత దాదాపు వారం, పదిరోజులపాటు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి నుంచి మీరు కోలుకోవడం జరిగింది.

2.50 ు. శ్రీ టి. హరీష్‌రావు – (కం) కానీ, కోలుకున్న తరువాత మీలో స్ఫూర్తి తగ్గిందా అంటే, తగ్గకుండా, ఆ స్ఫూర్తి పెరిగిందే తప్ప మీలో ఎప్పుడూ పోరాట స్ఫూర్తి తగ్గలేదు. అంటే, మిమ్మల్ని ఉద్యోగం నుంచి తొలగిస్తామన్నా, మీ మీద హత్యాప్రయత్నం జరిగినా, మీరు దేనీకి చలించకుండా నా తెలంగాణా రాష్ట్రం ముఖ్యం, నా ప్రజలు ముఖ్యం అనే ఏకైక లక్ష్యంతో తెలంగాణా రాష్ట్రం కోసం, తమ ఉద్యోగానికి, అలాగే తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా తెలంగాణా కోసం పోరాటం చేసిన గొప్ప నాయకులు మీరు. ఈరోజు మీరు ఆ స్థానంలో కూర్చోవడం ముఖ్యంగా ఆ స్థానానికి వన్నె తేవడమే కాకుండా, గౌరవం కూడా తెచ్చింది. ఇంతకంటే గొప్పతనం ఏం ఉంది? ఆనాడు కేసిఆర్‌గారు 11 రోజులు ఆమరణ నిరాహార దీక్షచేసి, తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా, తెలంగాణా ఉద్యమంలో

పోరాటం చేసిన వ్యక్తి ఆయన. ఆయన లాగే మీరు కూడా మీ ఉద్యోగాన్ని, మీ ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా, తెలంగాణా కోసం పోరాటం చేసి, తెలంగాణా రాష్ట్రం సాధించడంలో చాలా క్రియాశీలకమైన పాత్ర పోషించారు.

జాతీయ రహదారుల దిగ్బంధనమప్పుడు మీరు, నేను కలిసి ఉద్యోగుల తరపున పాలవాగు దగ్గర ధర్నాలు చేశాము. రెండు రోజులపాటు మనం అక్కడకు వెళ్ళి, పాలవాగు దగ్గర ఉండే ఒక ఆశ్రమంలో రెండు రాత్రులపాటు నేలమీద కూడా పడుకున్నాము. అక్కడ ఉండే గ్రామస్తులు, ఉద్యోగులు, వేలాదిమందితో కలిసి మీరు మీ వయసును కూడా లెక్కచేయకుండా పోరాటం చేసిన ఆ మధుర క్షణాలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. ఇంకా, చాలా విషయాలున్నాయి కానీ, సమయం లేదు కాబట్టి, త్వరగా ముగిస్తాను. ఏది ఏమైనప్పటికీ, తెలంగాణా సాధించడంలోను, తెలంగాణా పునర్నిర్మాణ సాధనలో కూడా అత్యంత కీలకమైన స్థానం వహించారు. రాష్ట్రంలో ప్రోటోకాల్ ప్రకారం చూస్తే మీది నాలుగవ స్థానం. మొదటగా గవర్నరు, ముఖ్యమంత్రి, హైకోర్టు ిఫ్ జస్టిస్ తరువాత మీ స్థానం చాలా అద్భుతమైనది. కాబట్టి, అటువంటి కీలకమైన, ఉన్నతమైన స్థానంలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, ఒక చిన్న ఉద్యోగిగా జీవితం ప్రారంభించి, టిఎన్‌జీవోల సంఘ అధ్యక్షులుగా సారథ్యం వహించి, అంచెలంచెలుగా ఎదిగి, ఈ స్థాయికి రావడం చాలా సంతోషం. నిజానికి మీరు అనేకమైన రికార్డులు సృష్టించారు. శాసనమండలి సభ్యులుగా పోటీచేస్తే, భారతదేశ చరిత్రలోనే ఏ శాసనమండలి సభ్యునికి రానటువంటి మెజారిటీ, భారతదేశ రికార్డులు బ్రద్దలుకొట్టి గెలిచినటువంటి ఘనత కూడా మీకే దక్కుతుంది.

(సభ్యుల హర్షధ్వానాలు)

అదే స్ఫూర్తితో తప్పకుండా ఈ సభ కూడా అత్యంత హుందాగా, తెలంగాణా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఈ ప్రభుత్వం ముందుకు నడిచేవిధంగా, మీరు సభను నడిపిస్తారనే సంపూర్ణ నమ్మకం, విశ్వాసం కూడా మాకు ఉంది. మేము ప్రభుత్వం తరపున శాసనసభ వ్యవహారాల మంత్రిగా మీరు ఈ సభను నడిపే విధానంలో మా పూర్తి సహాయసహకారాలు మీకు అందిస్తాం. మీరు ఇచ్చిన ప్రతి డైరెక్షన్‌ను కూడా తు.చ. తప్పకుండా ఈ ప్రభుత్వం పాటిస్తుందని, ఈ సభ సజావుగా జరిగే విధంగాను, మీకు మంచి పేరు తెచ్చేవిధంగా మేము పూర్తిస్థాయిలో మీకు సహకరిస్తామని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా, మీకు ఈ భగవంతుడు, సంపూర్ణ ఆయురారోగ్యాలను అందించి, నిండు నూరేళ్లు జీవించేవిధంగా, ఈ సభ సజావుగా జరిగేవిధంగా ఆ భగవంతునియొక్క ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉండాలని భగవంతుడిని

ప్రార్థిస్తూ, మరొక్కసారి మీకు హృదయపూర్వకంగా, పార్టీ పక్షాన, ప్రభుత్వ పక్షాన, వ్యక్తిగతంగా నా పక్షాన అభినందనలు తెలియజేస్తున్నాను. థాంక్యూ అధ్యక్ష, జై తెలంగాణా.

మిస్టర్ ఛైర్మన్ : ఇది నేను తట్టుకోలేనటువంటి ఉద్వేగానికి లోనైన సందర్భం. కళ్ళల్లో నుంచి ఆనందభాష్పాలు రాలుతున్న సందర్భం. ఈ సందర్భం గురించి ఏమని చెప్పాలి ! తెలంగాణా రాష్ట్రపోరాటంలో అమరులైనవారి త్యాగాలు, ఆనాడు జరిగిన సాయుధ రైతాంగ పోరాటం గురించి మొదలుపెట్టుకుంటే, మొన్న జరిగినటువంటి తెలంగాణా ఉద్యమంలో ఒరిగిన బిడ్డలు, జరిగిన ఉద్యమంలో విద్యార్థి నాయకులతోబాటు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సోదరులు, నన్నుగన్న గడ్డ నా గ్రామంతోబాటుగా, నాకు ఈ బాధ్యతలను అప్పగించి, సహకరించినటువంటి ఈ సభకు ముందుగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సభలో బహుశా ఎన్నడూ కూడా నేను పోరాటం మొదలుపెట్టినప్పటి నుంచి ఈ రోజు వరకూ ఇంతమౌనంగా మూడుగంటలపాటు చెప్పింది చెప్పడం మొదటిసారి. అయితే, మిమ్మల్నందరినీ చూసిన తరువాత నేను మాట్లాడడం తగ్గించుకుని, మీరు చెప్పింది విని, దానికి తగిన సలహాలు, సూచనలు చేయడం అన్నింటికన్నా మించిన బాధ్యతగా భావిస్తున్నాను. ఎక్కడో, బలహీనవర్గ కుటుంబంలో పుట్టిన నాకు, ఒక అటెండరుగా ఉద్యోగం చేస్తున్న నాకు రాష్ట్ర మాననీయ ముఖ్యమంత్రిగారు, ఆ పార్టీ నాయకులు, ఇక్కడకు వచ్చినటువంటి మాననీయ మంత్రులు ఈ బాధ్యతను నాకు అప్పగించి, ఈ సభను నడపడానికి ఎన్నుకున్నందుకు మరొక్కసారి గౌరవ ముఖ్యమంత్రిగారికి, మంత్రులకు, సభ్యులందరికీ కూడా నా అభినందనలు తెలియజేస్తున్నాను.

అదేరకంగా, మొట్టమొదటగా నేను తెలంగాణా ప్రజానీకానికంతటికీ బోనాల పండుగ మరియు రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని తెలంగాణా ప్రజానీకాన్ని మీ పక్షాన నేను కోరుతున్నాను. ఇక, ఈ రోజు మాట్లాడినటువంటి పెద్దలు చాలా విషయాలు చెప్పారు. కానీ, మనం బయట ఉన్న ప్రజానీకం, మన చట్టసభల వైపు, మనవైపు చూస్తున్నారు. ఏ పక్షంకోసం పోరాటం చేశామో, ఏ నిరుద్యోగులైతే తెలంగాణా ఉద్యమంలో పాల్గొని, తెలంగాణా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోకుంటే మాకు భవిష్యత్తు ఉండదని భావించారో, ఏ బడుగు, బలహీన వర్గాల ప్రజలు, ఏ దళితులైతే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మేము ప్రత్యేక రాష్ట్రంలో క్షేమంగా ఉంటామని భావించారో, ఆ ప్రజలంతా మనవైపు ఎదురుచూస్తున్నారు. ఏ విధమైన చట్టాలను తీసుకురాగలం, ఏ విధమైనటువంటి పరిపాలనను మనం అందించగలమనే విషయంలో ప్రజలు ఎదురుచూస్తోన్న ఈ సందర్భాన మనపైన గురుతరమైన బాధ్యత ఉంది. ఆ

ప్రజల సంక్షేమం కోసం, ఆ ప్రజల ఆలోచనలను అమలు చేయడానికి మన వంతు కృషిని మనం చేయవలసిన అవసరముంది.

ఈ సభలో మీ అందరికంటే నేను రాజకీయంగా పసివాడిని. మీకున్న అనుభవాలు, సూచనల ద్వారా నేను ముందుకు వెళ్లగలను తప్ప నేను స్వతహాగా ముందుకు వెళ్లలేనివాడిని. ఉన్నత విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, రాజకీయ ఉద్దండులు, గ్రామస్థాయి సర్పంచి నుంచి పనిచేసిన అనుభవంగల నాయకులు, కార్మికపోరాటాలు చేసిన నాయకులు, పత్రికా విలేఖరులుగా పనిచేసి శాసనపరిషత్ సభ్యులుగా ఎన్నికైన వారు ఈ సభలో ఉన్నారు. ఇంతమంది ఉద్దండులు ఉన్న ఈ సభవైపు ఈ రాష్ట్ర ప్రజానీకం చూస్తోంది. ఆ సభలో చేసిన చట్టాల్లో ఏమైనా లోటుపాట్లుంటే, ఇంకా ఏ విధంగా మెరుగ్గా చేస్తే సమాజం బాగుపడుతుందని చెప్పగలిగే పెద్దలు ఈ సభలో ఉండడం వల్ల తెలంగాణా ప్రజానీకమంతా ఈ సభవైపు చూస్తోంది. అందుకొరకు, నేను మీకందరికీ ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. ఏ తెలంగాణా ప్రజల కోసం మనమంతా పోరాటం చేశామో, ఏ తెలంగాణా ప్రజల సంక్షేమాన్ని మనమంతా కోరుకున్నామో, వారికోసం చట్టాలను తయారుచేసేటప్పుడు, వారు, వీరు అని చూడకుండా, ప్రతిపక్షంలో ఉన్న నిపుణులైన సభ్యుల యొక్క సలహాలు, నిర్మాణాత్మకమైన సూచనలను కూడా ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవలసిన అవసరముంది. ఆ విధమైన సూచనలు ప్రతిపక్షాల నుంచి రావలసిన అవసరముంది. కారణం, గతంలో ప్రభుత్వాన్ని నడిపిన అనుభవం ప్రతిపక్ష సభ్యులకు ఉండడం, చట్టాలు ఏ విధంగా చేస్తే మరింత బాగుంటుందో వారి సలహాలు, సూచనలు తీసుకునే నిర్ణయం చాలా సమంజసమని మనం పరిగణనలోకి తీసుకోవలసిన అవసరముంది.

ఈ సభలో ఉన్న పెద్దలందరి సహకారంతో నేను ఒక సంధానకర్తగా మీ మధ్య ఉండి, ప్రతిపక్షాల నుంచి వచ్చే సలహాలను ప్రభుత్వానికి, ప్రభుత్వం నుంచి వచ్చే సలహాలను ప్రతిపక్షానికి చేరవేస్తూ, ఈ రెండు చక్రాలను పట్టాలపైకి ఎక్కించి, ఈ రాష్ట్రం అభివృద్ధివైపు పయనించే విధంగా మీముందు పనిచేస్తానని ఖచ్చితంగా నేను భావిస్తున్నాను. అదే విధంగా, ఈ సభను సజావుగా నడపడానికి మీ అందరి సహకారాన్ని నేను కోరుతున్నాను.

స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్‌గారు, ఎంతోమంది అమరవీరులు, ఉద్యమకారుల త్యాగఫలితం కారణంగానే నేడు చాలామంది పెద్దలు ఈ సభలో కూర్చుని ఉన్నారు. నేడు తెలంగాణా ఉద్యోగుల శరీరాలు పులకరించిపోతూ ఉన్నాయి. ఈ పదవి నాకు వచ్చినట్లు కాక వారికి వచ్చినట్లుగా నేను భావిస్తూ ఉన్నాను. మీరంతా నన్ను ఈ స్థానానికి తోడ్కొని వచ్చిన క్షణాన నాకు పాలుపోలేదు. పెద్దలు శ్రీ డి.శ్రీనివాస్‌గారు ఒక తండ్రిలాంటివారు.

వారు కూడా ఈ సభలో ఉండి వారి సూచనలు, సలహాలిస్తే ఇంకా బాగుండేది. ఇక మీదట మనమంతా కలసి పనిచేద్దామని నేను ఆశిస్తున్నాను. గతంలో ఈ సభను నడిపిన పెద్దలు, శ్రీ మాడపాటి హనుమంతరావుగారు, మొదలైనవారందరూ నెలకొల్పిన విలువల కంటే హుందాగా ఉండే విధంగా, భవిష్యత్తులో భారతదేశంలోనే తెలంగాణా శాసనపరిషత్తును చూసి నేర్చుకునే విధంగా మరియు ఒక నమూనా శాసనపరిషత్‌గా ఈ సభను తీర్చిదిద్దాలని, దానికోసం ఈ సభలో ఉన్న పెద్దలందరూ వారి అమూల్యమైన సలహాలు, సూచనలిచ్చి సహకరించాలని నేను సభాముఖంగా కోరుతున్నాను.

నా విధి నిర్వహణలో భాగంగా, అన్ని ప్రాంతాలకు సమానంగా, ప్రతి సభ్యుడు తన ప్రాంత ప్రజల సమస్యలు, అభివృద్ధికోసం సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడానికి తప్పకుండా నా వంతు ప్రయత్నం చేస్తానని, అలాగే మీ అందరూ కూడా సహకారాన్ని అందించాలని నేను కోరుతూ ఉన్నాను. ఇంతకుముందు సభను ఏ విధంగా జరుపుకోవాలనే నియమాల గురించి మాట్లాడుకునే సందర్భంలో నేను పాల్గొనడం జరిగింది. సభను ఇంకా సజావుగా జరపడం కోసం, ప్రజాస్వామ్య విలువలు పెంచుకోవడం కోసం మనం ఇంకా కొన్ని నియమ నిబంధనలను అడాప్ట్ చేసుకోవలసిన అవసరముంది. అన్ని పార్టీలకు చెందిన సభ్యులకు ఆమోదయోగ్యంగా, అనుకూలంగా ఉండే విధంగా రూల్స్‌ను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ సభలో అన్ని పార్టీలకు చెందిన నాయకులు కలసి అవసరమైతే పదిసార్లు అయినా కలసి చర్చించుకుని సభను సజావుగా జరుపుకుని, ప్రజలు ఎదురుచూస్తున్న సంక్షేమ పథకాల పట్ల, చట్టాలపట్ల మనం వెంటనే స్పందించవలసిన అవసరముందని మిత్రులందరికీ ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. నా ఎన్నిక సందర్భంగా పెద్దలందరూ సహకరించి ప్రజాస్వామ్యానికే ఒక నూతన విలువను చెప్పారు.

**3.05 ము.** ఈ ఎన్నిక సందర్భంగా సహకరించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు. మీరంతా ఈ ఎన్నిక సందర్భంగా సహకరించి, ప్రజాస్వామ్యానికి నూతన విలువలు చెప్పారు. ఈ ప్రజాస్వామ్యానికి ఉన్నటువంటి గొప్ప గౌరవాన్ని తెలియజెప్పే విధంగా, చప్రాసీగా ఉన్నటువంటి నన్ను ఛైర్మన్‌ని చేసిన ఘనత కూడా ఈ ప్రజాస్వామ్యానిదే. ఇంతకన్నా గొప్ప విషయం ఏముంటుంది! ప్రజాస్వామ్యానికి ఉన్న విలువల్ని మీరు కాపాడారు. ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రి గారికి ప్రజాస్వామ్యంపట్ల ఉన్న ఆ నమ్మకం మేరకే, శాసనమండలిలో జరిగిన ఈ ఎన్నిక కూడా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగింది. ఈ ఎన్నిక సందర్భంగా సహకరించిన శాసనమండలి సభ్యులందరికీ నేను పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

మిత్రులందరూ కూడా వారు మాట్లాడుతున్న సందర్భంలో వారి అనుభవాలను చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఇంతకుముందు మాట్లాడిన పెద్దలు, ముఖ్యంగా మొదట సభ్యులు శ్రీ ఎ. నర్సారెడ్డి గారు, శ్రీ జాఫ్రి గారు, మంత్రివర్యులు శ్రీ ఈటెల రాజేందర్ గారు, ప్రొఫెసర్ డా. కె. నాగేశ్వర్ గారు, శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు గారు, శ్రీ కె. జనార్థన్ రెడ్డి గారు, మంత్రివర్యులు శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డిగారు, మహ్మద్ సలీం గారు, అదేవిధంగా మంత్రివర్యులు శ్రీ మహమూద్ ఆలీగారు, శ్రీ యాదవ రెడ్డి గారు, శ్రీ వి. భూపాల్ రెడ్డి గారు, శ్రీ టి. భానుప్రసాద రావు గారు, మంత్రి వర్యులు శ్రీ టి. హరీష్‌రావు గారు, శ్రీ పోట్ల నాగేశ్వర రావు గారు, శ్రీ డి. రాజేశ్వర్ రావు గారు, శ్రీ పూల రవీందర్ గారు, శ్రీ పాతూరి సుధాకరరెడ్డి గారు, శ్రీ నాయిని నర్సింహా రెడ్డి గారు, శ్రీ ఎన్.రాజలింగం గారు, శ్రీ రాములు నాయక్ గారు, శ్రీ ఎస్.జగదీశ్వర్ రెడ్డి గారు మొదలైన సభ్యులు మాట్లాడడం జరిగింది. ఇంతమంది సభ్యులు ఈ రోజు మాట్లాడుతూ, వారికి నాతో ఉన్నటువంటి అనుబంధాన్ని గురించి చెప్పడం జరిగింది.

ప్రధానంగా 1969 నాటి ఉద్యమ కాలంలో ఉద్యమకారులైనటువంటి శ్రీ ఎస్.జగదీశ్వర రెడ్డి గారితో నాకు చాలా దగ్గర పరిచయం ఉంది. ఇకపోతే, సభ్యులు శ్రీ కె.యాదవరెడ్డి గారు నాడు మాకు ఒక ఉద్యమ స్ఫూర్తికర్త. ఆ రోజుల్లో వారి ప్రసంగం కోసం మేం ఎదురుచూస్తూ కూర్చునే వాళ్లం. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాకు సంబంధించి సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు వారి అనుభవాన్ని కూడా మనతో పంచుకున్నారు. అలాగే, పెద్దలు శ్రీ నాయిని నర్సింహా రెడ్డి గారు ఆ రోజుల్లో బుల్లెట్ వాహనం మీద వస్తుంటే, మేమంతా ముషీరాబాద్‌లో రోడ్డు ప్రక్కన నిలబడి ఎదురుచూసే వాళ్లం. అలాంటిది, ఈ రోజు వారి చేతుల మీదుగా నన్ను ఛైర్మన్ పదవిలో కూర్చోబెట్టడం అంటే వారితో నాకు ఉన్న అనుబంధం జ్ఞప్తికి వచ్చింది.

ఇకపోతే, శ్రీ మహమూద్ అలీ గారితో ఉన్న అనుబంధం గానీ, ఇంతమందితో పెనవేసుకున్న అనుబంధం చూస్తుంటే... మీ తమ్ముడిగా, మీ సోదరుడిగా... అదేవిధంగా ఇంతకుముందు సభ్యులొకరు మాట్లాడుతూ చెప్పారు. "నువ్వు చిన్నవాడివి అయినా సరే, రేపటినుండి మేము నీ ముందు తలవంచుకొని పోవలసి వస్తుంది" అని అన్నారు. ఈ సందర్భంగా నేను ఇక్కడున్న మిత్రులందరికీ ఒక విషయం తెలియజేస్తున్నాను. మీరు తలవంచేది స్వామి గౌడ్‌కు కాదు. స్వామి గౌడ్ ఒక మామూలు వ్యక్తి. కాబట్టి, మీరు ఇక్కడున్న సభాపతి పీఠానికి, సభాపతి స్థానానికి తలవంచడమే తప్పితే, స్వామిగౌడ్‌కి కాదనే విషయాన్ని మీకు మనవి చేస్తున్నాను. ఈ సభా గౌరవాన్ని కాపాడడానికి తలవంచడం తప్పితే, మరొకటి

కాదనే విషయాన్ని గమనించాలని ఇక్కడున్న పెద్దలకు, మిత్రులకు, సభ్యులందరికీ మనవి చేస్తున్నాను.

ఈ రోజు జరిగిన ఎన్నికకు సంబంధించి నన్ను మీరందరూ ఛైర్మన్‌గా ఎన్నుకున్నందుకు, మహోన్నతమైన పదవిని నాకు కట్టబెట్టినందుకు మీకందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి గారికి, టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యులకు, ఈ ఎన్నికకు సహకరించిన మిత్రులకు, అన్ని పార్టీల పెద్దలకు, నన్ను అభినందించిన తెలుగుదేశం, ఎంఐఎం, మిగతా ఇండిపెండెంట్ సభ్యులకు, కాంగ్రెస్ పెద్దలకు ముఖ్యంగా పెద్దలు శ్రీ డి. శ్రీనివాస్ గారికి పేరు పేరునా నా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సభను సజావుగా నడపడం కోసం, ఈ సభా విలువలను పెంచడం కోసం, ఈ సభా సాంప్రదాయాలను మనమందరం పాటిద్దాం. ఈ విషయంలో మీ అందరి సహకారాన్ని నేను అర్థిస్తున్నాను. మీరందరూ సహకరిస్తేనే ఇది సాధ్యమౌతుంది. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే... ఇక నుండి ' నేను–మీరు ' అనే పదాలు మరచిపోదాం. 'మనం' అనే పదాన్ని వాడుదాం. మనమందరం కలిసి ముందుకు వెళ్లి, ఈ సభా సాంప్రదాయాన్ని పాటిస్తూ, ప్రభుత్వాన్ని అభివృద్ధి వైపు పరుగులెత్తించే విధంగా కలిసి పనిచేసేందుకు, మీ అందరి సహకారాన్ని కోరుతున్నాను. నాకు ఈ అవకాశం కల్పించిన ఈ సభకు, శాసన మండలికి మరొక్కసారి తలవంచి అభినందనలు తెలియజేస్తున్నాను. థ్యాంక్యూ.

## STATISTICS FOR THE FIRST SESSION SECOND SITTING 02.07.2014

| | | | |
|---|---|---|---|
| 1. | No. of days for which the Council sat. | ::: | 01 |
| 2. | No. of Hours for which the Council worked. | ::: | 14 Hrs.<br>10 Mts. |
| 3. | No. of Speeches made by the Members | ::: | 21 |
| 4. | No. of SPEECHES made by the Ministers | ::: | 05 |

Now, with the consent of the House, I adjourn the House is adjourned ***SINE DIE***.

(The House then adjourned *sine die* at 3.10 P.M.)

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad.”**